93.26 శాతం పింఛన్ల పంపిణీ

నెల్లూరు (హరనాథపురం); నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : జిల్లావ్యాప్తంగా శనివారం 93.26 శాతం సామాజిక పెన్షన్లను పంపిణీ చేసినట్లు డీఆర్‌డీఏ పీడీ వి.నాగరాజకుమారి ఒక ప్రకటనలో తెలిపారు. 3,04,749 పెన్షనర్లకుగాను 2,84,214 మందికి పింఛన్ల సొమ్ము అందజేసినట్లు పేర్కొన్నారు. ఇంకా 20,535 మందికి పంపిణీ చేయాల్సి ఉందన్నారు. కాగా, మర్రిపాడు మండలం డీసీపల్లిలో కలెక్టర్ హిమాన్షు శుక్లా లబ్ధిదారులకు పింఛను సొమ్ము స్వయంగా అందజేశారు. అలాగే జిల్లావ్యాప్తంగా ప్రజాప్రతినిధులు, అధికారులు, సచివాలయ సిబ్బంది నగదు అందజేశారు.



డీసీ పల్లిలో ముగిసిన పొగాకు అమ్మకాలు

10.27 మిలియన్ కేజీల అమ్మకం ● రూ.226 కోట్ల వ్యాపారం

మర్రిపాడు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : డీసీపల్లి పొగాకు బోర్డులో పొగాకు అమ్మకాలు శనివారం ముగిశాయి. బోర్డు పరిధిలోని 10 మండలాల్లో 1,785 బ్యారన్‌లు 2,081 మంది రైతులు ఈ ఏడాది బోర్డులో రిజిస్టర్ చేసుకున్నారు. ఈ ప్రకారం 7.47 మిలియన్ కేజీలను కొనుగోలు చేసేందుకు బోర్డు అనుమతి ఇచ్చింది. ఈ ఏడాది కేజీ ధర రూ.270తో ప్రారంభమై రూ.358లతో ముగిసింది. అనుమతి మేర ఆగస్టు 23వ తేదీ నాటికి బోర్డులో కొనుగోలు పూర్తి చేశారు. అనంతరం రైతులు అదనంగా పండించిన పొగాకును కొనుగోలు చేయాలని కేంద్ర వాణిజ్య శాఖను రైతులు అనుమతి కోరారు. దీంతో స్పందించిన స్పందించిన ఆ శాఖ రైతు వద్ద ఉన్న కొంత మొత్తం పొగాకును ఎటువంటి అపరాధ రుసుం లేకుండా, మరికొంత పొగాకును అపరాధ రుసుంతో సెప్టెంబరు 8వ తేదీ నుంచి తిరిగి కొనుగోలు ప్రారంభమై శనివారం ముగిసింది. దీంతో ఈ ఏడాది బోర్డులో 10.27 మిలియన్ కిలోల పొగాకును వివిధ కంపెనీలు రూ.226 కోట్లకు కొనుగోలు చేసినట్లు వేలం నిర్వహణాధికారి జి.రాజశేఖర్ తెలిపారు.

విజయవాడ-బెంగళూరు మధ్య 544జీ హైవే నిర్మాణం ● ఇందులో 3.7 కి.మీ పొడవున సొరంగ మార్గం ● నెల్లూరు-కడప సరిహద్దు ప్రాంతంలో వేగంగా పనులు ● 2027 ఫిబ్రవరిలోగా పనుల పూర్తికి కసరత్తు

సింహపురి సిగలో మరో సొరంగమాల

SUNDAY SPECIAL

జిల్లాలో మరో సొరంగ మార్గం రూపుదిద్దుకుంటోంది. ఇప్పటికే కృష్ణపట్నం-ఓబులవారిపల్లె రైల్వే మార్గంలో 6.7 కి.మీ పొడవున సొరంగ మార్గం ఉంది. తాజాగా విజయవాడ-బెంగళూరు గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ 544-జీ జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా నెల్లూరు, కడప జిల్లాల సరిహద్దు ప్రాంతమైన సీతారామపురం సమీపంలో మరో సొరంగ మార్గం నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయి. 518 కిలోమీటర్ల మేర ఈ జాతీయ రహదారిని నిర్మిస్తుండగా అందులో భాగంగానే సీతారామపురం వద్ద ఉన్న కొండను తొలచి రెండు సొరంగ మార్గాలను నిర్మిస్తున్నారు. సుమారు రూ.857.75 కోట్లతో మ్యాక్స్ ఇన్‌ఫ్రా కంపెనీ ఈ పనులు చేస్తోంది.

ఉదయగిరి/సీతారామపురం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో జాతీయ రహదారి నిర్మాణాల్లో నిర్మించిన సొరంగ మార్గాల్లో సీతారామపురం వద్ద నిర్మిస్తున్న సొరంగ మార్గం అతి పెద్దది. ఆరు వరుసల జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా వాహనాలు రాకపోకలు సాగించేందుకు వీలుగా రెండు వరుసల సొరంగ మార్గాలు నిర్మిస్తున్నారు. అటు కడప, ఇటు నెల్లూరు జిల్లాల సరిహద్దు ప్రాంతంలో ఒక్కో సొరంగ మార్గాన్ని 16.7 మీటర్ల వెడల్పు, 9.8 మీటర్ల ఎత్తుతో 3.7 కిలోమీటర్ల పొడవునా నిర్మిస్తున్నారు. ఈ పనులను మ్యాక్స్ ఇన్‌ఫ్రా కంపెనీ రూ.857.75 కోట్లతో దక్కించుకుంది. 2027, ఫిబ్రవరి నెలలోపు ఈ పనులు పూర్తికానున్నాయి. ప్రస్తుతం ఇరువైపులా అర కిలోమీటరు మేర పనులు పూర్తయ్యాయి.

● **తగ్గనున్న దూరం..**

167-బీజీ, 167-బీ, 565 జాతీయ రహదారులకు సమీపాన బెజవాడ-బెంగళూరు వరకు 518 కిలోమీటర్ల మేర గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణం జరుగుతుండడంతో వాహనదారులకు దూరం తగ్గడంతోపాటు సమయం ఆదా కానుంది. కడప, నెల్లూరు, ప్రకాశం జిల్లా వాసులకు విజయవాడ, బెంగళూరు వెళ్లేందుకు సుమారు 100 కిలోమీటర్లపాటు దూరం తగ్గడంతోపాటు 3 గంటలు ఆదా అవుతుంది. ఈ రహదారిపై ఏకంగా 120 కిలోమీటర్ల వేగంతో వాహనదారులు రాకపోకలు సాగించవచ్చు. అనంతపురం జిల్లా కొడికొండ వద్ద ప్రారంభమయ్యే ఈ రహదారి నిర్మాణం వైఎస్ఆర్, నెల్లూరు, ప్రకాశం జిల్లాల మీదుగా బాపట్ల జిల్లాలోని ముప్పవరం గ్రామం వద్ద జాతీయ రహదారి-16లో కలుస్తుంది. ఇప్పటికే ఈ రహదారి నిర్మాణానికి సంబంధించి పలు ప్రాంతాల్లో పనులు పూర్తయ్యాయి. అవసరమైన ప్రదేశాల్లో అండర్‌పాస్‌లు, వంతెనలు కూడా ఏర్పాటు చేస్తున్నారు. ఈ హైవే పనులు పూర్తయితే పలు జిల్లాల వాసులకు బెంగళూరు-విజయవాడకు మార్గం మరింత సుగమం అవుతోందని పలువురు అభిప్రాయపడుతున్నారు.



సీతారామపురం వద్ద అటవీ ప్రాంతంలో జరుగుతున్న సొరంగ మార్గం పనులు

నెల్లూరు జిల్లా సరిహద్దు ప్రాంతంలో సొరంగ మార్గం



సంగం బ్యారేజీలో దెబ్బతిన్న బ్యారేజ్ గేటు

వరద ప్రవాహానికి దెబ్బతిన్న బ్యారేజీ గేట్

సంగం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): సంగం బ్యారేజీకి వస్తున్న వరద ప్రవాహం ఒత్తిడితో 13వ గేటు దెబ్బతిని కిందకు దిగడంలేదు. ప్రియర్స్ ఒకవైపు బీమ్ వద్ద ఇరుక్కుంది. దీంతో గేటు అటు కిందకు, పైకి కదలడం లేదు. బ్యారేజీకి వరద ప్రవాహం రాకముందే కుడి, ఎడమ వైపు ఉన్న స్కవర్ వెంట్స్ తప్ప బ్యారేజ్‌లో ఉన్న మిగతా 79 గేట్లన్నీ ఎత్తేశారు. దీనివల్ల వచ్చిన వరద వచ్చినట్లే దిగువకు వెళ్లే అవకాశం ఏర్పడింది. ఈ క్రమంలో 28వ తేదీన డ్రెడ్జింగ్ పడవ కొట్టుకు వచ్చి బ్యారేజీకి ఎగువ భాగం పాత ఆనకట్ట క్రస్ట్ వద్ద ఆగిపోయి బ్యారేజీకి త్రుటిలో ప్రమాదం తప్పింది. అయితే దీన్ని తొలగించేందుకు బ్యారేజ్‌లో సుమారు 60 వేల క్యూసెక్కుల నీటి ప్రవాహం ఉన్న సమయంలో రెండు పర్యాయాలు గేట్లు దించి మళ్లీ ఎత్తే క్రమంలో బీమ్ కాంక్రీట్ దెబ్బతిని గేటు ఒక వైపు కిందకు దిగకుండా ఆగిపోయింది. దీనికి తక్షణమే బ్యారేజ్‌లో ఉన్న స్టాప్‌లాక్ వినియోగించి దెబ్బతిన్న బీమ్‌కు మరమ్మతులు చేయాల్సిన అవసరం ఉంది. కాగా, బ్యారేజీకి సోమశిల, బీరాపేరు, బొగ్గేరు నుంచి శనివారం సుమారు 1.16 లక్షల క్యూసెక్కుల ప్రవాహం వస్తోంది. దీంతో నీటి నిల్వ 12.1 అడుగులు నమోదయింది. బ్యారేజ్‌కు చేరుతున్న నీటిని గేట్ల ద్వారా నెల్లూరు బ్యారేజ్‌కు యథావిధిగా విడుదల చేస్తున్నారు.

● **'సోమశిల'కు తగ్గిన ఇన్‌ఫ్లో**

అనంతసాగరం : సోమశిల జలాశయానికి ఎగువ నుంచి వస్తున్న వరద ప్రవాహం తగ్గుముఖం పట్టింది. శనివారం 48,460 క్యూసెక్కులు వస్తుండగా, దిగువకు 47,650 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. డ్యాంలో 69.635 టీఎంసీలు నిల్వ ఉంది. వచ్చే ప్రవాహం ఆదివారానికి మరింత తగ్గే సూచనలు ఉన్నట్లు అధికారులు భావిస్తున్నారు.

● **రాపూరు :** కండలేరు డ్యాం సామర్థ్యం 68 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 58.78 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఏఈ అనిల్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. సోమశిల నుంచి 840 క్యూసెక్కుల నీరు ఇన్‌ఫ్లో వస్తుండగా, 700 క్యూసెక్కులను బయటకు వదులుతున్నట్లు తెలిపారు.



మద్రాసు బస్టాండు వద్ద..



కూరగాయల మార్కెట్ వద్ద..



డీకే కళాశాల కూడలి వద్ద సిగ్నల్ లైట్లు ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

ట్రాఫిక్ సిగ్నల్స్ వచ్చేశాయ్!

● **నెల్లూరులో ఏడు కూడళ్ల వద్ద ఏర్పాటు**

● **త్వరలో అమల్లోకి నిబంధనలు**

నెల్లూరు (సిటీ), నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు ట్రాఫిక్ సిగ్నల్స్... ఈ మాట అప్పుడెప్పుడో విన్నమాట. ఈ తరం యువతకు అస్సలు గుర్తు కూడా ఉండదు. వాహనాల రద్దీ పెరుగుతుందే కానీ రోడ్ల విస్తరణ జరగడం లేదు. దీంతో నగరంలోకి వాహనాలను తీసుకురావాలంటే యుద్ధమే చేయాలన్నంతగా కష్టపడాలి. ఏ రోడ్డుమీదకు వెళ్లినా.. ఏ కూడలి వద్ద చూసినా నిత్యం ట్రాఫిక్ జామ్. దీనిని నియంత్రించేందుకు ట్రాఫిక్ సిగ్నల్స్ వ్యవస్థను అందుబాటులోకి తీసుకువస్తున్నారు. 2023లో పునాది వేసుకున్న ఈ కృతువు ఇప్పుడు అందుబాటులోకి రానున్నది. నగరంలోని ఏసీ కూరగాయల మార్కెట్, డీకే కళాశాల కూడలి, హరనాథపురం జంక్షన్, కేవీఆర్ కూడలి, కనకమహల్ సెంటర్, రామలింగాపురం జంక్షన్, వీఆర్సీ కూడలిలో ట్రాఫిక్ సిగ్నల్స్ వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నారు. నెల్లూరు కార్పొరేషన్ నుంచి రూ. 1.40 కోట్లను కేటాయించిన యంత్రాంగం అందులో ఇప్పటివరకు. రూ.50 లక్షలను నిర్వహణ కంపెనీ ఎస్పీటీ నెట్‌వర్కుకు చెల్లించారు. సదరు కంపెనీ ఏడు ప్రాంతాలలోని కూడళ్ల వద్ద సిగ్నల్స్‌ను ఏర్పాటు చేస్తోంది. లైట్ల అమరిక పూర్తవగా కేబుల్ ఏర్పాటు జరుగుతోంది. ఇవన్నీ పూర్తయితే అతి త్వరలోనే నగరంలో ట్రాఫిక్ సిగ్నలింగ్ అందుబాటులోకి వస్తుంది.

● **'సుప్రీం' ఆదేశాలతో...**

దేశవ్యాప్తంగా వాహనాల రద్దీతో ప్రజలు ఇబ్బంది

- మిగతా 6లో..







ముఖ్యమంత్రి చంద్రబాబు నుంచి ప్రశంసాపత్రాలు అందుకుంటున్న కమిషనర్లు నందన్, శ్రావణ్‌కుమార్, అనుష

శభాష్.. బాగా పని చేశారు!

● **నెల్లూరు, కావలి, కందుకూరు కమిషనర్లకు సీఎం ప్రశంసలు**

నెల్లూరు (సిటీ)/కావలి/కందుకూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాన్‌లో సమర్థవంతంగా పని చేసినందుకు నెల్లూరు కార్పొరేషన్, కావలి, కందుకూరు మున్సిపల్ కమిషనర్లు నందన్, శ్రావణ్‌కుమార్, అనుషలను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రశంసించారు. అమరావతిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో శనివారం జరిగిన సైక్లోన్ మొంథా ఫైటర్ కార్యక్రమంలో కమిషనర్లకు సీఎం ప్రశాంసాపత్రాలు అందజేశారు. ఇటీవల మొంథా విపత్తులో యం త్రాంగం సమర్థవంతంగా పని చేసిందం టూ చంద్రబాబు కొనియాడారు. సీఎం వద్ద ప్రశంసలు అందుకున్న కమిష నర్లకు అధికా రులు, ఉద్యోగులు శుభాకాంక్షలు తెలిపారు.

వాట్సాప్ గ్రూప్‌ల అడ్మిన్లకు పోలీసుల నోటీసులు

నెల్లూరు(క్రైం), నవంబరు 1(ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని వివిధ వాట్సప్ గ్రూప్‌ల అడ్మిన్‌లకు పోలీసు అధికారులు నోటీసులు ఇస్తున్నారు. సామాజిక మాధ్యమాల దుర్వినియోగాన్ని నివారించేందుకు, ప్రజాశాంతి భద్రతలను కాపాడేందుకు బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 168 ప్రకారం సూచనలు పాటించాలని ఆదేశిస్తున్నారు. అడ్మిన్‌లు తమ గ్రూప్ పేరు, చిరునామా, మొబైల్ నెంబర్లు, సభ్యుల సంఖ్య, గ్రూప్ ఏర్పాటు ముఖ్య ఉద్దేశం తదితర వివరాలను అందజేయాలని నోటీసులలో పేర్కొన్నారు. అనుచితమైన, దూషణాత్మక, తప్పుదారి పట్టించే, మత విద్వేషాన్ని రేకెత్తించే, చట్టవిరుద్ధమైన కంటెంట్ వంటివి కనిపిస్తే వెంటనే గ్రూప్ నుంచి తొలగించి సమీప పోలీసు స్టేషన్‌లో తెలియజేయాలని గ్రూప్ అడ్మిన్‌లకు సూచించారు. చట్ట ఉల్లంఘన జరిగితే బీఎన్ఎస్ఎస్, ఐటీ చట్టం, ఇతర చట్టాల ప్రకారం న్యాయ పరమైన చర్యలు తీసుకుంటామని ఆ నోటీసులలో హెచ్చరికలు జారీ చేశారు.






ఇళ్లలో నుంచి బయటకు రావాలంటే అవస్థలే

కన్నీటి తీరం!

వరద నీటితో పెన్నమ్మ ఉరకలేస్తుండటంతో నదీపరివాహక ప్రాంతవాసులకు కంటి మీద కునుకులేకుండా పోయింది. ఏ వైపు నుంచి వరద ముంచెత్తుతుందోనని భయాందోళనకు గురయ్యారు. నగర శివార్లలోని పాత చెక్‌పోస్టు వద్ద వరద నీరు చేరడంతో స్థానికులు అవస్థలు పడ్డారు. కనీసం ఇళ్లల్లో నుంచి బయటకు రాలేని పరిస్థితి ఏర్పడింది. కొంతమందిని అధికారులు సురక్షిత ప్రాంతాలకు తరలించారు. అయితే, పెన్నాలో వరద తగ్గుముఖం పట్టడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

- జాకీర్, స్టాఫ్ ఫొటోగ్రాఫర్ (ఆంధ్రజ్యోతి)



నీటిలో బతుకుబండి..

పొగరాయుళ్లపై కొరడా

● బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం నిషేధం

● పొగతాగితే రూ. 200 జరిమానా

● జిల్లావ్యాప్తంగా విద్యాసంస్థల్లో అవగాహన

● రెండునెలలపాటు విస్తృత కార్యక్రమాలు

8లో..

ముత్తుకూరులో సుందర క్రీడా ప్రాంగణం

ముత్తుకూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : పీ ఫోర్ కార్యక్రమంలో భాగంగా ముత్తుకూరులో ఆదాని కృష్ణపట్నం పోర్టు సీఎస్ఆర్ నిధులతో సుందరమైన క్రీడా ప్రాంగాణాన్ని నిర్మిస్తున్నామని పోర్టు కార్పొరేట్ హెడ్ గంటా వేణుగోపాల్ తెలిపారు. స్థానిక షాదీ మంజిల్‌లో శనివారం టీడీపీ మండలాధ్యక్షుడు నీలం మల్లికార్జున్ యాదవ్‌తో కలిసి క్రీడాకారులకు పరికరాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో దంత వైద్యుడు హరీష్, టీడీపీ నేతలు నడవడి ముత్యం గౌడ్, బొలిగర్ల శ్రీనివాసులు, వేల్పుల నాగార్జున్ పాల్గొన్నారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ. 11613
వెండి కిలో ధర	రూ. 152700
వెండి ఒక గ్రాము	రూ. 158.70

పంచాయతీ నిధుల స్వాహాకు చెక్!

- ప్రతీ రూపాయికీ లెక్క చూపాల్సిందే..
- తాజాగా వెంకటాచలం సర్పంచి సస్పెన్షన్
- ఇద్దరు కార్యదర్శులపై వేటు..
- మరో ఐదుగురిపై చర్యలకు సిఫారసు


వెంకటాచలం సచివాలయం

వెంకటాచలం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : పంచాయతీల్లో నిధుల దుర్వినియోగానికి అడ్డుకట్ట వేసేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఖర్చు చేసే ప్రతి రూపాయికి పంచాయతీ కార్యదర్శులు ఖచ్చితంగా ఇక నుంచి పక్కాగా లెక్క చూపించాల్సిందే. పనులు చేయకుండానే చూపిస్తే ఇంకా అంతే సంగతులు. తాజాగా వెంకటాచలం పంచాయతీలో జరిగిన అక్రమాలు, అవకతవకలపై జిల్లా ఉన్నతాధికారులు తీసుకున్న చర్యలతో తప్పు చేస్తే ఎవరైనా.. ఎంతటి వారైనా చర్యలు తప్పవన్న సంకేతం రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చింది. నిధుల దుర్వినియోగానికి పాల్పడిన వెంకటాచలం సర్పంచ్ మందల రాజేశ్వరితోపాటు గ్రేడ్ 3, 4 పంచాయతీ కార్యదర్శులు సుబ్రహ్మణ్యం, భారతీలపై వేటు వేస్తూ సస్పెండ్ చేశారు. అలాగే గ్రేడ్ 1 పంచాయతీ కార్యదర్శులైన శ్రీనివాసరావు, అలీబాషా, ప్రత్యేకాధికారిగా బాధ్యతలు నిర్వర్తించిన నాటి ఎంపీడీఓ సరళ, ఈఓపీఆర్డీ రవీంద్రబాబు, విశ్రాంత ఎంపీడీఓ శ్రీనివాసులపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలంటూ సిఫార్సు చేస్తూ జిల్లా ఉన్నతాధికారులు పంచాయతీరాజ్ కమిషనర్‌కు నివేదికలను పంపారు. సర్పంచ్ మందల రాజేశ్వరి రూ.5.77 లక్షల రుపాయాల వెంకటాచలం పంచాయతీ నిధులను దుర్వినియోగం చేయడంతోపాటు నిబంధనలకు విరుద్ధంగా తన భర్త వైసీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మందల వెంకటశేషయ్య ఖాతాకు రూ.81.42 లక్షలు, అలాగే డెటా ఎంట్రీ ఆపరేటర్ ఖాతాకు రూ.1.84 లక్షలు, లబ్ధిదారులు కానీ వారి ఖాతాలకు రూ.4.81 లక్షలు, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు తన కుమారుడి ఖాతాకు రూ.13.94 లక్షలు, గత వైసీపీ హయంలో పని చేసిన పంచాయతీ కార్యదర్శులు తమ సొంత ఖాతాలకు రూ.5.56 లక్షలు జమ చేసినట్లు విచారణలో తెలడంతో విచారణ నివేదిక మేరకు ఇటీవల సర్పంచ్ చెక్ పవర్‌ను అధికారులు రద్దు చేశారు. తాజాగా వారం కిందట సర్పంచ్ మందల రాజేశ్వరిపై సస్పెన్షన్ వేటు వేశారు. అలాగే వెంకటాచలం మండలం గూడ్లూరువారిపాళెం పంచాయతీ కార్యదర్శి సుబ్రహ్మణ్యం, ముత్తుకూరు మండలం వల్లూరు పంచాయతీ కార్యదర్శి భారతీలను విధుల నుంచి సస్పెండ్ చేస్తూ కలెక్టర్ హిమాన్షు శుక్లా ఉత్తర్వులు జారీ చేశారు. ఈ తాజా పరిణామంతో తప్పు చేస్తే తమపై కూడా సస్పెన్షన్ వేటు తప్పదన్న భయం ఇటు పంచాయతీ కార్యదర్శుల్లో, అటు సర్పంచ్‌ల్లో నెలకొంది. క్షేత్రస్థాయిలో విచారించి చర్యలు తీసుకునే దిశగా ఉన్నతాధికారులు అడుగులు వేయడంతో పంచాయతీల్లో నిధుల స్వాహాకు చెక్ పడినట్లు అయింది.

నిధుల దుర్వినియోగానికి పాల్పడితే చర్యలు

పంచాయతీ నిధుల దుర్వినియోగానికి పాల్పడితే జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకునేలా చేస్తాం. పంచాయతీల్లో ఖర్చు చేసే ప్రతి రుపాయికి పక్కాగా లెక్క చూపించాలి. ఆ బాధ్యత పంచాయతీ కార్యదర్శులదేనన్నారు. పంచాయతీల్లో అవినీతి, అక్రమాలు, అవకతవకల విషయంలో జిల్లా ఉన్నతాధికారులు రాజీ పడడం లేదు. పంచాయతీలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం.

- ఎంపీడీవో కల్పన

ఘనంగా ఆంధ్రరాష్ట్ర అవతరణ దినోత్సవం

పొదలకూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో శనివారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక పంచాయతీ బస్టాండ్ ఆవరణలో ఉన్న అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహానికి ఆర్యవైశ్య నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. నెల్లూరు రూరల్ ఆర్య వైశ్య సంఘం అధ్యక్షుడు అమర్తలూరు చెంచయ్య, ఏఎంసీ డైరెక్టర్ పిన్నేల ప్రభాకర్ మాట్లాడారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య నాయకులు పొట్టి సుధాకర్, ఆకులూరు విజయకుమార్, మీరామధు, కామేష్ తదితరులు పాల్గొన్నారు.

దుప్పట్ల పంపిణీ

వెంకటాచలం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇస్కపాళెం గ్రామంలో శని వారం మొంథా తుపాన్ కారణంగా నష్టపోయిన వారికి తెలుగు మహిళా మండలాధ్యక్షురాలు శ్రీనితారెడ్డి ఆధ్వర్యంలో దుప్పట్లు పంపిణీ చేశారు. మొంథా తుపాన్ సమయంలో ప్రజలకు ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్ర మోహన్‌రెడ్డి అండగా నిలి చారన్నారు. ఆయన అడుగుజాడల్లోనే తాను కూడా సహాయాన్ని అందించానన్నారు. కార్యక్రమంలో కూటమి నేతలు గోత్తల నరేష్, కాకి శివకుమార్, సాయికృష్ణ పాల్గొన్నారు.

డాక్టరేట్ ప్రదానం

వెంకటాచలం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాకుటూరు వద్ద ఉన్న వీఎస్‌యూ ప్రాంగణంలోని వర్సిటీ కళాశాలలో బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగానికి చెందిన పరిశోధన విద్యార్థిని ఎన్ బేబీకి వీఎస్‌యూ డాక్టరేట్ ప్రదానం చేసింది. బేబీ ఏ స్టడీ ఆన్ ఇండివిడ్యుయల్ క్యారెక్టరిస్టిక్స్ ఆన్ ఇంటెన్షన్స్ టూ పర్సు సోషల్ ఇంట్రిప్రెనేర్‌షిప్ బై ఎంబీఏ స్టూడెంట్ ఇన్ ఆంధ్రప్రదేశ్ అనే అంశంపై ప్రొఫెసర్ సుజాఎస్ నాయర్ పర్యవేక్షణలో ఆమె తన పరిశోధనను పూర్తి చేశారు.

కక్ష సాధింపులకు తావే లేదు!

వెంకటాచలం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): అవినీతి, అక్రమాలకు పాల్పడబట్టే వెంకటాచలం సర్పంచ్ మందల రాజేశ్వరిని పదవి నుంచి తొలగించడం జరిగిందని టీడీపీ నేత సండి రమేష్ అన్నారు. వెంకటాచలంలో శనివారం ఆయన విలేకర్ల సమావేశాన్ని ఏర్పాటు చేసి మాట్లాడారు. అధికారం ఉందని సర్పంచ్ రాజేశ్వరిని పదవి నుంచి తప్పించారని కాకాణి చెప్పడం సిగ్గుచేటు అన్నారు. కక్షసాధింపులకు అవకాశం ఉంటే 16 నెలలు వైసీపీ సర్పంచ్‌లు పదవిలో కొనసాగే పరిస్థితి ఉందా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు బత్తల రాఘరామయ్య, చల్లా రమణయ్య, తురకా రామ్‌ప్రసాద్, వలిపి మునిరత్నం తదితరులు పాల్గొన్నారు.

పెంచలస్వామి కల్యాణం

రాపూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): పెంచలకోన క్షేత్రం శనివారం భక్తులతో కిక్కిరిసింది. శుక్రవారం రాత్రి పెద్ద ఎత్తున వివాహలు జరిగాయి. ఈ సందర్భంగా శనివారం క్యూలైన్లు కిక్కిరిశాయి. ఉదయం మూలవిరాట్‌కు అభిషేకాలు నిర్వహించారు. అనంతరం దేవేరులతో శ్రీవారి కళ్యాణం నిర్వహించారు. భక్తులకు ఉచిత ప్రసాదాలతో పాటు, అన్నప్రసాదం పంపిణీ చేసినట్లు ఆలయ ఉప కమీషనర్ పోరెడ్డి శ్రీనివాసులు రెడ్డి తెలిపారు. అలాగే నేడు క్షీరాబ్ధి కైసిక ద్వాదశి, 5వ తేది కార్తీక పౌర్ణమి సందర్భంగా ఈ రెండు రోజుల్లో నిత్య కళ్యాణం తాత్కాలికంగా రద్దు చేయడం జరిగిందని, తిరిగి యదావిధంగా కొనసాగుతుందని ఆలయ అధికారులు తెలిపారు.

నిత్యాన్నదాన పథకానికి విరాళం

పెంచలకోన దేవస్థానంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి శనివారం కడప జిల్లా మాధవరం వాస్తవ్యులు తిక్కన వెంకట సుబ్బారెడ్డి, చంద్రమ్మ దంపతులు కుటుంబ సమేతంగా కలిసి రూ.లక్ష విరాళాన్ని అందజేశారు. దాత ఈ విరాళాన్ని ఆన్లైన్ ద్వారా దేవస్థాన అకౌంట్‌కు బదిలీ చేసారు. దాతకు దేవస్థానం అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేసి స్వామివారి శేషవస్త్రం ప్రసాదాలు అందజేశారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- పౌరసరఫరాల డైరెక్టర్ వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి

కొడవలూరు ,నవంబరు 1(ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ డైరెక్టర్ వేమిరెడ్డి పట్టాభిరామిరెడి అన్నారు. మండల పరిధి లోని గంగవరం గ్రామంలోని సొసైటీలో ఆయన శనివారం రైతులకు యూరియా పంపిణీచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు చంద్రబాబు నాయుడు రుణాలు, సబ్సిడీ విత్తనాలు సరఫరా చేస్తూ ఆదుకుంటున్నారని చెప్పారు. గండవరం సొసైటీకి ప్రభుత్వం రూ.8 కోట్లు ఆర్థికసహాయం అందచేసి రైతుల్ని ఆదుకుందని చెప్పారు. రైతులకు యూరియా కొరత రాకుండా ప్రభుత్వం చర్యల్ని చేపట్టిందని వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారిణి విజయలక్ష్మి, నాయకుడు మాలకొండయ్య, రైతులు పాల్గొన్నారు.

మార్కెట్ కల పీ4తో సాకారం!

ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం, నవంబరు1 (ఆంధ్రజ్యోతి): బుచ్చిరెడ్డిపాళెం ప్రజల ఏళ్ళ నాటి కల కూరగాయల మార్కెట్ నిర్మాణం పీ.4తో సాకారమైందని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి అన్నారు. శనివారం ఎమ్మెల్యే బుచ్చిలో కూరగాయల మార్కెట్ సముదాయాన్ని పరిశీలించారు. పీ.4లో పిలుపు మేరకు మార్కెట్ సముదాయం ఉచితంగా నిర్మించేందుకు ముందుకు వచ్చిన తేజు డెవలపర్స్ వారు ఇంత త్వరగా నిర్మాణం పూర్తిచేయడం అభినందనీయ మన్నారు. ఈ నెలాఖరులోపు మార్కెట్‌ని ఎంపీ, మున్సిపల్ శాఖమంత్రి చేతులమీదుగా ప్రారంభించనున్నట్లు తెలిపారు. గతంలో 24 దుకాణా లున్న ఈ మార్కెట్ ఇప్పుడు 61 దుకాణాలతో మార్కెట్ కాంప్లెక్స్‌గా రూపుదిద్దుకుందన్నారు. మార్కెట్ నిర్మాణంపై దాత తోట శ్రీనివాసులు రెడ్డికి పలు సూచనలిచ్చారు. భవిష్యత్తులో కోవూరు పట్టణంలో కూడా ఇలాంటి మార్కెట్ కాంప్లెక్స్‌నే పీ.4లో దాతల సహకారంతో పాత (కూలిపోయిన) మార్కెట్ ప్రాంతంలోనే అతి త్వరలో నిర్మిస్తామని. ఎమ్మెల్యే తెలిపారు. స్థలాలు, ఇళ్ళకోసం పలువురు పేదలు ఏకరువు పెట్టడంతో స్పందించిన ఎమ్మెల్యే అందరికీ ఇళ్ళు కట్టిస్తామని మాటిచ్చారు. అనంతరం మున్సిపాలిటీ భవనం నిర్మాణం పరిశీలించారు. త్వరితగతిన నిర్మాణం పూర్తి చేసి ఉగాదికి ప్రారంభోత్సవం చేసేందుకు సిద్ధం చేయాలని కమిషనర్ బాలకృష్ణ, కాంట్రాక్టర్ వీవీ. శేషయ్యలను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో చైర్‌పర్సన్ మోర్ల సుప్రజమురళి, కమిషనర్ బాలకృష్ణ, వైస్ చైర్మన్లు శివకుమార్‌రెడ్డి, నస్రీన్, కౌన్సిలర్ వైష్ణవి, అర్బన్ అధ్యక్షుడు గుత్తా శ్రీనివాసులు, మాజీ ఎంపీటీసీ పర్వీన్, కమలాకర్ రెడ్డి, వంశీకృష్ణారెడ్డి, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధి చంద్రబాబుకే సాధ్యం

కోవూరు,నవంబరు1(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి ఏకకాలంలో సాధించడం ముఖ్యమంత్రిచంద్రబాబునాయుడు ఒక్కరికే సాధ్యమని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. పడుగుపాడు మజరా బండారుమాన్యంలలో శనివారం ఆమె ఇంటింటికీ తిరిగి ఫించన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భగా ఆమె మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ నాయకత్వంలో మిత్రపక్షాల సహకారంతోప్రభుత్వం ఏర్పడిన తరువాత 473 మందికి రూ 5కోట్ల 53లక్షల ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ఆర్థికసహాయం అందించామన్నారు. ముంథా తుఫాను సందర్భంగా నష్టనివారణా చర్యలు చేపట్టడం చంద్రబాబునాయుడి పరిపాలనాదక్షతకు చిహ్నామన్నారు. పెన్నానది పొర్లు కట్టల పటిష్ఠతకు నిధులు మంజూరుచేసిన ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు సీహెచ్ సుబ్బయ్య, ఎంపీడీఓ శ్రీహరి, పెన్నాడెల్టా ఛైర్మన్ జెట్టి రాజగోపాలరెడ్డి, ఎంపీపీ తుమ్మలపెంట పార్వతి, టీడీపీ నాయకులు కొల్లారెడ్డి సుధాకరరెడ్డి, ఇంతా మల్లారెడ్డి, జెట్టి మదన్‌మోహన్‌రెడ్డి , కోవూరు, వేగూరు సర్పంచులు యాకసిరి విజయ,కరేటి అమరావతి పాల్గొన్నారు.


పింఛన్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

పింఛన్ల పంపిణీలో దేశంలోనే ఏపీ టాప్

ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి


పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి

ముత్తుకూరు (టీపీ గూడూరు), నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : తోటపల్లి గూడూరులో శనివారం జరిగిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ టీపీ గూడూరు పంచాయతీలో 375 మందికి నెలకు రూ.15.87 లక్షలు పింఛన్లు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఏడాదికి రూ.1.90 కోట్లు అందిస్తున్నామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి నెలా రూ.2700 కోట్లు, ఏడాదికి రూ.32 వేల కోట్లు పింఛన్ల పంపిణీ జరుగుతుందన్నారు. దేశంలోనే ఇదే అత్యధికమన్నారు. రూ.8000 కోట్లు ఖర్చు పెడుతున్న తెలంగాణలో రూ.2016 ఇస్తున్నారన్నారు. పెద్దరాష్ట్రమైన మహారాష్ట్ర, గుజరాత్, కర్ణాటక, బీహార్, తమిళనాడు రాష్ట్రాల్లో తక్కువ ఇస్తున్నారన్నారు. వృద్ధులు, వితంతవులకు ఏడాదికి రూ.48 వేలు, దివ్యాంగులకు రూ.72 వేలు, మంచానికే పరిమితమైన వారికైతే ప్రతి నెలా రూ.15 వేలు పింఛన్లను అందజేస్తున్నామన్నారు. ఈ లెక్కలన్నీ జగన్‌మోహన్‌రెడ్డికి, బ్లూ మీడియాకు కనిపించవన్నారు. టీపీ గూడూరులో అన్నదాత సుఖీభవ పథకం కింద రైతులు రూ.74.80 లక్షలు పొందారన్నారు. తల్లికి వందనం పథకంలో 292 మందికి రూ.38.22 లక్షలు లబ్ధి చేకూరిందన్నారు. సంక్షేమం అంటేనే తెలుగుదేశంగా ప్రజలు భావిస్తున్నారన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు రఘబాబు, నేతలు శ్రీనివాసులురెడ్డి, జితేంద్ర తదితరులు పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములు త్యాగఫలితమే ఆంధ్రరాష్ట్రం


నివాళులర్పిస్తున్న వీసీ శ్రీనివాసరావు, రిజిస్ట్రార్ సునీత

వెంకటాచలం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : పొట్టి శ్రీరాములు త్యాగ ఫలితంగానే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడిందని వీఎస్‌యూ వీసీ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు అన్నారు. వీఎస్‌యూలో శని వారం రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆంధ్రుల ఆత్మగౌరవం కోసం అహింసా మార్గంలో పోరాడి ప్రాణ త్యాగం చేసిన మహనీయుడు పొట్టి శ్రీరాములు అని, యువతకు ఆయన ప్రేరణ అన్నారు. కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కే సునీత, వర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ విజయ, ప్రొఫెసర్లు సుజాఎస్ నాయర్, టీ వీరారెడ్డి, డాక్టర్ చెంచురెడ్డి, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త డాక్టర్ అల్లం ఉదయ్‌శంకర్, ప్రోగ్రామ్ ఆఫీసర్స్ డాక్టర్ ఎస్‌టీ సాయినాథ్, డాక్టర్ శంకర్, డీన్ సీడీసీ డాక్టర్ ఎం హుస్సేనయ్య, అసిస్టెంట్ రిజిస్ట్రార్ డాక్టర్ సుజయ్‌కుమార్ పాల్గొన్నారు.

బుచ్చిరెడ్డిపాళెం: మున్సిపాలిటీలోని 18వ వార్డులో ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవం, పొట్టి శ్రీరాములు వర్ధంతిని పురస్కరించుకుని వార్డులోని పింఛనుదారులకు శనివారం వవ్వేరు బ్యాంకు అధ్యక్షురాలు దొడ్ల విజయలక్ష్మి, కోదండరామిరెడ్డి దంపతులు పలువురు టీడీపీ కార్యకర్తలతో కలిసి పింఛన్లతో పాటు మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సుమన్, కామాక్షయ్య, అరుణ్, పలువురు పించనుదారులు ఉన్నారు.

వ్యాసరచన పోటీల విజేతలకు బహుమతుల ప్రదానం

బుచ్చిరెడ్డిపాళెం, నవంబరు1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దామర మడుగు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా ఇటీవల నిర్వహించిన వ్యాసరచన పోటీల విజేతలకు శనివారం బుచ్చి మండల ఆవాజ్ కమిటీ నాయకులు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆవాజ్ కమిటీ మండల కార్యదర్శి మునీర్ అహ్మద్, ఉపాధ్యక్షులు జానీబాషా, షేక్ బాబు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

స్థానికుల సంక్షేమం దందాలా కనిపిస్తోందా కాకాణీ!

ముత్తుకూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : థర్మల్ కేంద్రాలలో ఉపాధి కోసం స్థానికులు చేసిన ప్రయత్నాలు, అక్రమార్జనలో మునిగితేలి జైలు జీవితం గడిపిన కాకాణి కళ్లకు దౌర్జన్యం, దందాలా కనిపిస్తోందని టీడీపీ మండలాధ్యక్షుడు నీలం మల్లికార్జున్ యాదవ్ మండిపడ్డారు. ముత్తుకూరు పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన విలేకర్ల సమావేశాన్ని ఏర్పాటు చేసి మాట్లాడారు. గత వైసీపీ ప్రభుత్వంలో తన అనుచరులతో కలిసి టోల్‌గేట్లు, దందాలు నడుపుతూ రూ.కోట్లు అర్జించిన కాకాణికి అన్ని పనులు అలానే కనిపిస్తున్నాయని ఎద్దేవా చేశారు. విలేకరుల సమావేశంలో స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ కల్పనా రెడ్డి, ప్రధానకార్యదర్శి మాచిరెడ్డి శ్రీధర్‌రెడ్డి, ముత్యం గౌడ్, శ్రీనివాసులు, ఏడుకొండలు, నాగార్జున్, జనార్ధన్, శోభన్ పాల్గొన్నారు.

టీడీపీ నేత 'మాతూరు'కు సంతాపం

విడవలూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : విడవలూరుకి చెందిన టీడీపీ సీనియర్ నాయకులు, రైతు సంఘం నేత మాతూరు శ్రీనివాసులురెడ్డి శనివారం వేకువ జామున గుండెపోటుతో మృతి చెందారు. ఈ సందర్భంగా విడవలూరుకి వచ్చిన కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి మాతూరు శ్రీనివాసులురెడ్డి పార్థివ దేహానికి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శ్రీనివాసులురెడ్డి పార్టీకోసం, రైతుల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేశారన్నారు. ఎన్నికల్లో తన గెలుపునకు శ్రమించారని అయన మరణం పార్టీకి లోటని అమె తెలిపారు. ఎమ్మెల్యే వెంట ఈస్ట్రన్ చానల్ డీసీ చైర్మన్ పాశం శ్రీహరిరెడ్డి, ఇన్‌చార్జీ అడపాల శ్రీధర్‌రెడ్డి, బెజవాడ వంశీకృష్ణారెడ్డి, పూండ్ల అచ్యుత్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ట్రాఫిక్ సిగ్నల్స్ వచ్చేశాయ్!

(5వ పేజీ తరువాయి)

పడుతున్నారని తరచూ మీడియా, ప్రచార మాధ్యమాల ద్వారా వస్తున్న వార్తలను పరిగణలోకి తీసుకున్న భారత అత్యున్నత న్యాయస్థానం పట్టణ, నగర ప్రాంతాలలో ట్రాఫిక్ సిగ్నల్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించింది. 2018లో ఈ ఉత్తర్వులు ఆయా ప్రభుత్వాలు జారీ అయ్యాయి. అందులో భాగంగా ఏపీలోనూ పట్టణ, నగర ప్రాంతాల్లో ట్రాఫిక్ సిగ్నల్స్ ఉండాలని సూచనలు జారీ చేశారు. ఈ వ్యవస్థను ఏర్పాటు చేసే నెట్‌వర్క్ కంపెనీలతో స్థానికంగా ఉండే మున్సిపాలిటీలు ఒప్పందం చేసుకుని నిధులు కేటాయించాలని అప్పట్లో ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు నెల్లూరులో నిర్వహణ బాధ్యతలను ఎస్‌టీటీ నెట్‌వర్క్‌కు అప్పగించారు.

ప్రజల సహకారం ముఖ్యం

నెల్లూరులో ట్రాఫిక్ సిగ్నల్స్ వ్యవస్థ త్వరలో అందుబాటులోకి రానున్నది. ఆ మేరకు వేగంగా పనులు జరుగుతున్నాయి. ఈ సిగ్నల్స్ అందుబాటులోకి వస్తే ప్రజల సహకారం చాలా అవసరం. వారికి కూడా సిగ్నలింగ్ వ్యవస్థపై అవగాహన పెరుగుతుంది. ట్రాఫిక్ నియంత్రణకు మేము సిద్ధంగా ఉన్నాము.

- వెంకటరెడ్డి, ట్రాఫిక్ సీఐ

వరద బాధితులకు సరుకుల పంపిణీ


సరుకులను అందజేస్తున్న తహసీల్దారు, టీడీపీ నాయకులు

విడవలూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మొంథా తుపాను కారణంగా నిరాశ్రయులైన వరద బాధితులకు వరద సాయం అంటంలేదని ఆంధ్రజ్యోతి దినపత్రికలో వచ్చిన వరద సాయం.. అధికారుల ఇష్టారాజ్యం కథనానికి కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, జిల్లా అధికారులు స్పందించారు. వరద బాధితులకు సరుకులు అందజేయాలని లేకుంటే చర్యలు తప్పవని రెవెన్యూ అధికారులను హెచ్చరించారు. దీంతో శని వారం చౌకిచర్ల గ్రామానికి చెందిన గిరిజనులకు తహసీల్దారు చంద్రశేఖర్, స్థానిక టీడీపీ నాయకులు ఓగు నాగేశ్వరావు, కొల్లు చిన్నవెంకయ్య సమక్షంలో వరదసాయాన్ని అందజేశారు. సరుకులు అందటంతో గిరిజనులు కోవూరు ఎ మ్మెల్యే, మండల నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ అబ్దుల్ సలాం, వీఆర్వో శ్రీనివాసులు, నాయకులు హరిప్రసాద్, సుధా కర్ పాల్గొన్నారు.

జగనన్న లేఅవుట్లలో విజిలెన్స్ తనిఖీలు

పొదలకూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : పంచాయతీ పరిధిలోని చిట్టేపల్లి తిప్ప వద్ద ఉన్న జగనన్న లేఅవుట్లలో థర్డ్‌పార్టీ బృందం శనివారం తనిఖీలు నిర్వహించారు. పేదల ఇళ్ల నిర్మాణం ముసుగులో గత వైసీపీ ప్రభుత్వం ఆప్షన్ 3 కింద కాంట్రాక్టర్లు భారీ అవినీతి, అక్రమాలకు తెరతీసారనే ఆరోపణలతో థర్డ్ పార్టీ బృందం ఇన్‌చార్జ్‌గా నెల్లూరు డివిజనల్ హౌసింగ్ ఈఈ మోహనరావు ఆధ్వర్యంలో పొదలకూరు జగనన్న లేఅవుట్‌లోని ఆప్షన్ 3 కింద నిర్మించిన 406 ఇళ్లను స్వయంగా పరిశీలించారు. జగనన్న లేఅవుట్‌లో గతంలో 800 మందికి పట్టాలిచ్చారు. అందులో ఆప్షన్ 3 కింద 406 మంది ఇళ్లు వివిధ దశలో నిర్మించారు. వాటిని ఈ బృందం వారు యూపీసీ, రీబాండింగ్ హెక్యూలర్, కోర్ టెస్టులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో థర్డ్ పార్టీ బృందం, టీడీపీ పట్టణ అధ్యక్షుడు బొద్దులూరు మల్లికార్జున్‌నాయుడు పాల్గొన్నారు.

C.R.I.M.E N.E.W.S

దుప్పిని రక్షించిన గ్రామస్థులు


పొలం కంచెలో ఇరుక్కుపోయిన దుప్పి

దుత్తలూరు (ఉదయగిరి), నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నందిపాడు గ్రామ సమీపంలో 565 జాతీయ రహదారిపైకి అటవీ ప్రాంతం నుంచి ఓ చుక్కల దుప్పి వచ్చింది. దానిని వీధి కుక్కలు చూసి వెంటపడడంతో దుప్పి సమీపంలో ఉన్న పొలంలోకి వెళ్లింది. పొలం చుట్టూ కంచె ఏర్పాటుచేసి ఉండడంతో ఎటూ వెళ్లలేక చిక్కుకొంది. గమనించిన గ్రామస్థులు దానిని రక్షించి అటవీ ప్రాంతంలో వదిలారు.

రామాలయంలో చోరీ

వరికుంటపాడు(ఉదయగిరి రూరల్), నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అశోక్‌నగర్ గ్రామానికి చెందిన రామాలయంలో చోరీ జరిగిన సంఘటన శనివారం వెలుగుచూసింది. వివరాల మేరకు.. శుక్రవారం రాత్రి గుర్తుతెలియని దుండగులు తాళాలు పగలగొట్టి ఆలయంలోకి ప్రవేశించారు. అమ్మవారి మెడలోని రూ.30 వేలు విలువ చేసే రెండు బంగారు మంగళసూత్రాలతోపాటు హుండీని సైతం చోరీ చేశారు. అటుగా వెళ్లిన కొంతమంది గ్రామస్థులు తాళాలు పగలగొట్టి ఉండడాన్ని గమనించి ఆలయంలోకి వెళ్లి పరిశీలించారు. ఇటీవల దక్కనూరు గ్రామం ఆలయంలో సైతం చోరీ జరగడంతో గ్రామాల్లో భయాందోళన నెలకొంది. కాగా, ఈ విషయమై పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు.

రెండు మోటార్‌బైక్‌ల ఢీ

- దంపతులకు గాయాలు

వరికుంటపాడు(ఉదయగిరి రూరల్), నవంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని జడదేవి బస్టాండ్ సెంటర్‌లోని 565 జాతీయ రహదారిపై రెండు మోటార్‌బైక్‌లు ఢీకొనడంతో దంపతులకు గాయాలైన సంఘటన శనివారం చోటుచేసుకొంది. వివరాల మేరకు.. మర్రిపాడు మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన నల్లు తిరుపతయ్య, కొండమ్మ దంపతులు ప్రకాశం జిల్లా పామూరు మండలం ఇర్లపాడులో భూమిని కౌలుకు తీసుకుని సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో స్వగ్రామంలో పింఛన్ నగదు తీసుకొనేందుకు బైక్‌పై వెళుతుండగా బస్టాండ్ సెంటర్‌లో ఉన్న వరికుంటపాడుకు చెందిన వాకా చినజాలయ్య అనే వ్యక్తి తన బైక్‌ను ఒక్కసారిగా ముందుకు కదిలించడంతో రెండు బైక్‌లు ఢీకొన్నాయి. దీంతో దంపతులకు తీవ్ర గాయాలు కావడంతో ఉదయగిరి వైద్యశాలకు తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తీసుకెళ్లారు. సమాచారం అందుకున్న ఎస్ఐ రఘునాథ్ సంఘటనా స్థలాన్ని పరిశీలించడంతోపాటు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అదనపు కట్నం కోసం వేధింపులు

నెల్లూరురూరల్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): తనను అదనపు కట్నం కోసం వేధింపులకు గురి చేస్తున్నారని ఓ మహిళ తన భర్త, అత్తమామలపై ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. రూరల్ సీఐ గుంజి వేణు తెలిపిన వివరాలు మేరకు.. పెద్దచెరుకూరు పరిధిలోని సిరిగార్డెన్స్‌లో నివాసముంటున్న దిద్రాయి కృప సంధ్యకు ఎనిమిదేళ్ల క్రితం అమాస వినయ్‌కుమార్‌తో వివాహమై ప్రస్తుతం ఇద్దరు పిల్లలున్నారు. అప్పట్లో ఇచ్చిన కట్నం, బహుమతులు సరిపోక తాజాగా మరింత అదనపు కట్నం కావాలని ఆమె భర్త వినయ్‌తోపాటు అతని తల్లి సూర్యప్రభ, తండ్రి రఘు రామయ్యలు తనను మానసికంగా, శారీరకంగా వేధించడంతో పాటు ఇంటి నుంచి బయటకు గెంటేశారు. దీంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

యువకుడిపై పోక్సో కేసు

నెల్లూరు(క్రైం), నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఓ బాలికను ప్రేమించాలంటూ వేధింపులకు గురిచేస్తున్న యువకుడిపై చిన్న బజారు పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. నగరానికి చెందిన ఓ బాలిక డిప్లమో మొదటి సంవత్సరం చదువుతోంది. ఆమె ఇంటి పక్కనే సాయి నివాసం ఉంటున్నాడు. అతను గత కొంతకాలంగా తనను ప్రేమించాలని బాలిక వెంట పడుతున్నాడు. శుక్రవారం రాత్రి బాలిక ఇంటికి వెళ్లి ఆమె చేయిపట్టుకుని ప్రేమించమని ఒత్తిడి చేశాడు. బాలిక తల్లి అడ్డుకోగా ఆమెను దుర్భాషలాడాడు. ఈ మేరకు బాధిత తల్లి శనివారం చిన్న బజారు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు నిందితుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు.

పొలంలో పని చేస్తూ రైతు మృతి

- వారం రోజుల్లో కొడుకుపెళ్ళి
- అంతలోనే విషాదం

మనుబోలు, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): నా కొడుకుపెళ్ళి.తప్పక రండి. అని మనుబోలు గ్రామం అంతా పెళ్ళి కార్డులు పంచాడు. సాయంత్రానికల్లా పొలంలో శవమై కనిపించాడు రైతు, కల్లుగీత కార్మికుడు కోసూరు శ్రీనువాసులు గౌడ్. శనివారం చోటుచేసుకున్న సంఘటన గ్రామస్తులను కలిచివేసింది. గమళ్లపాళెంలో విషాదం నెలకొంది. స్థానిక కోదండరామపురంలోని గమళ్ళపాళెంకు చెందిన కోసూరు శ్రీనువాసులు గౌడ్ వరిసాగు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఈయనకు భార్య, ఇద్దరు పిల్లలు. కుమార్తెకు పెళ్ళిఅయిపోగా, కుమారుడికి వచ్చే శనివారం పెళ్ళి నిశ్చయించారు. దీంతో పెళ్ళిపనుల్లో బాగంగా పెళ్ళి కార్డులు పంచాడు. తరువాత మధ్యాహ్నం ఇంటినుంచి పొలానికి వెళ్లి సాయంత్రమైనా ఇంటికి రాకపోయేసరికి కుటుంబసభ్యులు, బంధువులు శ్రీనివాసులు కోసం గాలించారు. పొలంలో శ్రీనువాసులు శవమై కనిపించాడు. గుండె పోటుతో చనిపోయి ఉండవచ్చునని రైతులు, గ్రామస్తులు భావిస్తున్నారు. పొలంవద్దనే బంధువులు, సాటి గీత కార్మికులు, రైతులు కన్నీరు మున్నీరుగా విలపించారు.

రైల్లోంచి జారిపడి యువకుడు...

మనుబోలు: మండలంలోని కొమ్మలపూడి -మనుబోలు రైల్వేస్టేషన్ల మధ్య శనివారం రైల్లోంచి గుర్తుతెలియని ఓ యువకుడు (25) జారిపడి మృతిచెందినట్లు రైల్వే ఎస్ఐ. హరిచందన తెలిపారు. అప్‌లైన్‌లో 150వ కి.మీ వద్ద 9-11 స్థంభాల మధ్య ఓ యువకుడు చనిపోయి ఉండడాన్ని విదుల్లో ఉన్న కీమెన్ గుర్తించి రైల్వే పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఎస్ఐ సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు నమోదు చేసుకున్నారు. మృతుడు సిమెంట్ రంగు ఆఫ్ చొక్కా, నల్లటిరంగు షాట్, ఫ్యాంటు ధరించి ఉన్నాడు. అంతకుమించి ఎలాంటి ఆనవాలు లభ్యం కాకపోవడంతో గుర్తుతెలియని వ్యక్తిగా కేసు నమోదు చేసుకుని, శవపరీక్షల నిమిత్తం మృతదేహంను నెల్లూరుకు తరలించినట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని..

కొడవలూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వాహనం ఢీకొని మహిళ మృతి చెందిన సంఘటన శనివారం నార్త్ రాజూపాళెం గ్రామం వద్ద చోటు చేసుకొంది. పోలీసుల కథనం మేరకు... దగదర్తి మండలంలోని ప్యాట్సన్ పేట గ్రామానికి చెందిన నలబోతుల రవణమ్మ(60), నలబోతుల సుబ్రహ్మణ్యం నెల్లూరులో తన కుమార్తె ఇంటికి వెళ్లి మోటర్ సైకిల్ పై తిరిగి వస్తూండగా నార్త్ రాజూపాళెం జాతీయ రహదారి వద్ద గుర్తు తెలియని వాహనం వెనుక నుండి ఢీకొంది. దీంతో వెనుక కూర్చున్న రమణమ్మ వాహనం కింద పడి అక్కడిక్కడే మృతి చెందింది. మోటర్ సైకిల్ సుబ్రహ్మణ్యంకు స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న ఎస్ఐ కోటిరెడ్డి గాయపడిన వ్యక్తిని చికిత్స నిమిత్తం 108లో వైద్యశాలకు తరలించారు. జాతీయ రహదారిపై పోలీసులు ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నెల్లూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	137
స్కిన్ చికెన్	246
స్కిన్‌లెస్	270

కోడిగుడ్ల ధర (100): 575

ఆర్‌ఈఎంఎస్ స్కీమ్ పునరుద్ధరణపై హర్షం

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ రిటైర్డు ఉద్యోగులకు నిలిపివేసిన రిటైర్డ్ ఎంప్లాయిస్ మెడికల్ స్కీమ్ (ఆర్‌ఈఎంఎస్) అమలుకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడం హర్షణీయమని ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర డిప్యూటీ జనరల్ కార్యదర్శి జీ నారాయణరావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. 2020కు ముందు విధులు నిర్వహించి రిటైర్డ్ అయిన ఉద్యోగులు రిటైర్మెంట్ సమయంలో రూ.25వేలు నుంచి రూ.27 వేల వరకు చెల్లించి సభ్యులైన వారికి జీవితకాల వైద్య సదుపాయాలు, రిఫరల్ ఆసుపత్రుల ద్వారా భార్యాభర్తలకు రూ.4 లక్షల వరకు వైద్య సాయం అందించే పథకాన్ని ఆర్టీసీ విలీనం తర్వాత గత ప్రభుత్వం నిలిపివేసిందని పేర్కొన్నారు. ఈ పథకాన్ని ప్రస్తుత కూటమి ప్రభుత్వం తిరిగి అమలు చేయాలని ఆదేశించడం అభినందనీయమని పేర్కొన్నారు.

వంతెనలపై రహదారి గుంతలమయం!

- నాసిరకంగా తాత్కాలిక మరమ్మతులు
- ప్రమాదకరంగా ఇనుప బోల్టులు
- అవస్థలు పడుతున్న ద్విచక్రవాహన చోదకులు



వెంకటేశ్వరపురం వంతెనపై రబ్బరు లేచిపోవడంతో రహదారిపై ప్రమాదకరంగా మారిన జాయింట్ బోల్టులు



పెన్నా వంతెనపై నాసిరకంగా చేసిన ప్యాచ్ వర్కుతో బయటపడ్డ ఇనుప చువ్వలు, కంకర

నెల్లూరు(వ్యవసాయం), నవంబరు 1(ఆంధ్రజ్యోతి): నెల్లూరు నగరంలో ప్రధానమైన వంతెనలు గుంతలమయమై ప్రమాదకరంగా మారడంతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులకు గురవుతోన్నారు. ఏమాత్రం అజాగ్రత్తగా వాహనం నడిపినా ప్రమాదాల బారిన పడాల్సిన పరిస్థితి నెలకొంది. అదే వర్షాకాలం అయితే ఇక పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించుకుంటేనే భయమేస్తోంది. పెన్నా వంతెన, వెంకటేశ్వరపురం ఫ్లైఓవర్ వంతెనలు ఇందుకు కేరాఫ్ అడ్రస్‌గా మారాయి. కోవూరు, వెంకటేశ్వరపురం, జనార్దనరెడ్డికాలనీతోపాటు రాజుపాళెం వైపు నుంచి నెల్లూరు నగరానికి రావాలంటే ఈ రెండు వంతెనలనే ఎక్కువ మంది వాహన చోదకులు ఆశ్రయిస్తారు. నిత్యం వందలాది వాహనాలు ఈమార్గం గుండా ప్రయాణిస్తుంటాయి. అంతటి ప్రధాన్యం ఉన్న వంతెనలు ఇవి. అయితే వాటి ప్రాధాన్యతకు తగ్గట్టుగా నిర్వహణ లేదన్న విమర్శలు ఉన్నాయి. వెంకటేశ్వరపురం ఫ్లైఓవర్ వంతెనపై ఇనుప చువ్వలు బయటపడి ప్రమాదభరితంగా మారింది. రైల్వే వంతెనపై అయితే ఇనుప రేకులు బయటపడి ఉన్నాయి. అంతేకాకుండా పిల్లర్ల మధ్యలో ఉన్న రబ్బరు లేచిపోవడంతో ఇనుప బోల్టులు బయటపడ్డాయి. దీంతో అధికలోడుతో వస్తున్న వాహనాల టైర్లకు బోల్టులు గుచ్చుకుని పంచర్లు అవుతోన్నాయి. ఇక్కడ ప్రతి రోజూ కనీసం ఒక లారీ టైరన్నా పేలుతూ ఉంటోంది. ఇక పెన్నా వంతెన పరిస్థితి మరింత దారుణంగా ఉంది. రోడ్డు మధ్యలో తప్ప ఇటు, అటు గుంతలమయమైంది. ఇనుప చువ్వలు కూడా బయటపడి ప్రమాదకరంగా మారాయి. ఏమాత్రం చూపు ముందుకు కాకుండా పక్కకు చూశారో గుంతలో పడి ప్రమాదానికి గురవాల్సిందే. వర్షాకాలం పరిస్థితి మరింత దారుణంగా ఉంటోంది. వర్షపు నీటితో నిండి గుంతలు కనిపించక ప్రమాదాలు తప్పడం లేదు. అయితే అధికారులు స్పందించి ప్యాచ్ వర్కులు వేస్తున్నా అవి కొంతకాలానికే లేచిపోయి మళ్లీ యథా పరిస్థితి నెలకొంటుంది. దీంతో వాహనచోదకులకు ముఖ్యంగా ద్విచక్ర వాహనచోదకులకు ఇబ్బందులు తప్పడం లేదు. అధికారులు స్పందించి నాశిరకంగా కాకుండా నాణ్యమైన ప్యాచ్ వర్కులు చేసి ప్రమాదాల నుంచి వాహన చోదకులను కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.



వెంకటేశ్వరపురం ఫ్లైవోవర్ వంతెనపై రోడ్డు మధ్యలో ఏర్పడిన గుంతలో బయటపడ్డ ఇనుప కమ్ములు

అనుమతులు అతిక్రమిస్తే కూల్చేస్తాం : సీపీ

నెల్లూరు(సిటీ), నవంబరు 1(ఆంధ్రజ్యోతి) : నెల్లూరులో ఈ ఏడాది ఆగస్టు 31 తరువాత అనధికారికంగా నిర్మించిన కట్టడాలు, ప్లాన్‌కు భిన్నంగా చేపట్టిన నిర్మాణాలపై చర్యలు తీసుకుంటున్నట్లు ఎన్‌ఎంసీ సిటీ ప్లానర్ హిమబిందు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. 1985 జనవరి 1వ తేదీ నుంచి 2025 ఆగస్టు 31లోపు నిర్మించిన అనధికార కట్టడాలు, ప్లానుకు విరుద్ధంగా ఉన్న నిర్మాణాలు మాత్రమే బీపీఎస్-2025 పథకంలోకి వస్తాయని పేర్కొన్నారు. ఆగస్టు 31 తరువాత అనధికార కట్టడాలన్నింటిని కూల్చేస్తామని, ఇందులో భాగంగా ఎన్జీవో కాలనీ, ఫుట్బా ఎస్టేట్‌లో చర్యలు మొదలుపెట్టినట్లు తెలిపారు.

లార్వా నివారణకు చర్యలు



నిల్వ నీటిలో గంబూజియా చేపలను వదులుతున్న వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, సిబ్బంది

నెల్లూరురూరల్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): నివాసాల వద్ద నిల్వ ఉన్న నీటిలో లార్వా అభివృద్ధి చెందకుండా గంబూజియా చేపలను వదిలారు. శనివారం నెల్లూరురూరల్లోని అల్లీపురం పీహెచ్‌సీ పరిధిలో పెద్దచెరుకూరు, సిరిగార్డెన్స్ వద్ద ఈ తరహా చేపలను వైద్య అధికారులు వదిలిపెట్టారు. ఈ సందర్భంగా సబ్ యూనిట్ అధికారి సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ ఈ చేపలు లార్వాను తీనేస్తాయని చెప్పారు. తద్వారా దోమల వ్యాప్తి ఘననీయంగా తగ్గుతుందన్నారు. ప్రస్తుతం వర్షాలు పడినందున దోమలను నిలువరిస్తే రోగాలు వ్యాప్తి ఉండదని సూచించారు. ప్రజలు కూడా తమ నివాసాల వద్ద నీటిని నిల్వ ఉంచకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో సుశీలమ్మ, పీహెచ్ఎన్ లూసీ, ఎంపీహెచ్ఏ శ్రీనివాస్, ఏఎన్ఎం రోజ్‌మేరిలు పాల్గొన్నారు.

'పెరమన' ప్రమాద బాధితులను ఆదుకుంటాం

- రూ.5 లక్షల ఆర్థిక సాయం అందజేసిన మంత్రి నారాయణ



బాధితులతో మాట్లాడుతున్న మంత్రి నారాయణ

నెల్లూరు(సిటీ), నవంబరు 1(ఆంధ్రజ్యోతి): సంగం సమీపంలో జాతీయ రహదారిపై పెరమన వద్ద ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదం బాధితులను ఆదుకుంటామని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ భరోసా ఇచ్చారు. ఈ ఘటనలో మృతి చెందిన సిటీ నియోజకవర్గం పరిధిలోని గుర్రాలమడుగు ప్రాంతానికి చెందిన బాధిత కుటుంబాలను శనివారం ఆయన పరామర్శించారు. ప్రభుత్వం నుంచి రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందజేశారు. మరింత చేయూతనిచ్చేందుకు ప్రయత్నిస్తామని, ఆందోళన చెందవద్దని తెలిపారు. అనంతరం 4వ డివిజన్ జకీర్‌హుస్సేన్ నగర్‌లో ఆయన పర్యటించి ఎన్టీఆర్ భరోసా లబ్ధిదారులకు పింఛన్ నగదు అందచేశారు. అనంతరం 69 మందికి రూ.62 లక్షల సీఎం సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. అదేవిధంగా ఇటీవల మొంథా తుఫాన్ కారణంగా పునరావాస కేంద్రాల్లో ఉన్న 118 కుటుంబాలకు బియ్యం, నిత్యావసరాలను పంపిణీ చేశారు. నెల్లూరులో కాలువలపై అక్రమ కట్టడాలన్నింటిని తొలగిస్తామని, ఈ క్రమంలో పేదలు, నిరుపేదలుంటే వారికి ప్రత్యామ్నాయం చూపుతామని మంత్రి వెల్లడించారు. వరదలు కారణంగా నగరం ముంపునకు గురికాకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

మాట నిలబెట్టుకున్న ప్రభుత్వం మాది

- ఎమ్మెల్సీ బీద రవిచంద్ర



పింఛన్ నగదు అందచేస్తున్న ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, టీడీపీ నేత గిరిధర్‌రెడ్డి

నెల్లూరురూరల్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): పింఛన్ దారులకు ఇచ్చిన మాట కోసం ఆర్థికంగా ఎన్ని ఇబ్బం దులున్నా 1వ తేదీన నగదు అందచేస్తున్న ప్రభుత్వం చంద్ర బాబుదని ఎమ్మెల్సీ బీద రవిచంద్ర అన్నారు. నెల్లూరురూరల్లోని కాకుపల్లి, కలివెలపాళెం గ్రామాలలో టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్ రెడ్డితో కలిసి శనివారం ఆయన లబ్ధిదా రులకు పింఛన్ నగదు అందచేశారు. ఈ సందర్భంగా వారివురు మాట్లాడుతూ ప్రభుత్వానికి ఆర్థికపరమైన ఇబ్బందులు అనేకమున్నాయన్నారు. అయినప్పటికీ అవేమి లెక్క చేయకుండా ప్రజల అభ్యున్నతి యోజనార్థం 1వ తేదీన పింఛన్ అందచేయాలని సీఎం ఆదేశించారని తెలిపారు. దివ్యాంగులు, అవ్వ,తాతలు సంతోషంగా ఉండాలన్నదే కూటమి పార్టీల ప్రభుత్వం తొలి లక్ష్యమన్నారు. నెల్లూరు రూరల్లో జరిగే వినూత్న కార్యక్రమాలు రాష్ట్రంలోనే ప్రత్యేకతను సంతరించుకున్నాయని చెప్పారు. అనంతరం గిరిధర్‌రెడ్డి రైతులకు యూరియా పింపణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ విజయకుమార్, కాకుపల్లి సర్పంచు సుభాషిణి, ఏఎంసీ చైర్మన్ శ్రీధర్‌రెడ్డి, పీఏసీ ఎస్ చైర్మన్లు, తదితరులు పాల్గొన్నారు.

- వైసీపీకి షాక్

నెల్లూరురూరల్లో ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి వైసీపీ షాకిచ్చారు. మండలంలోని కొత్త, పాతవెల్లం టి గ్రామాలకు చెందిన రాపూరు అంజయ్య, పలగాని శివకుమార్‌రెడ్డిలు ఆ పార్టీకి రాజీనామ చేసి టీడీపీలో చేరారు. నెల్లూరులోని కార్యాలయంలో ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి వీరికి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. తనను నమ్మి పార్టీలోకి వచ్చిన వారికి తగిన గౌరవం ఉంటుందని తెలిపారు. అందరం కలిసి కూటమి పార్టీల ప్రభుత్వం అందచేస్తున్న సంక్షేమాన్ని ప్రజలకు చేరవేద్దామని పిలుపునిచ్చారు. రానున్న ఎన్నికల్లో నూరు శాతం విజయమే లక్ష్యంగా పని చేయాలన్నారు. ముందుగా 19వ డివిజన్ ముత్యాలపాళెంలో లబ్ధిదారులకు ఇంటింటికి వెళ్లి పింఛన్ నగదు అందచేశారు.

అమ్మా.. ఆరోగ్యం ఎలా ఉంది!

- నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులరెడ్డి



పింఛను పంపిణీ చేస్తున్న కోటంరెడ్డి శ్రీనివాసులరెడ్డి

నెల్లూరు(వైద్యం), నవంబరు 1(ఆంధ్రజ్యోతి): అమ్మా.. ఆరోగ్యం ఎలా ఉంది.. పెద్దమ్మా.. నీ ఆరోగ్యం బాగుందా.. అంటూ నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసుల రెడ్డి శనివారం వృద్ధుల యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. నగరంలోని 16వ డివిజన్ బాలాజీనగర్‌లోని పలు ప్రాంతాలలో నుడా చైర్మన్ ఇంటింటికి తిరిగి పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కోటంరెడ్డి మాట్లాడుతూ వృద్ధులు, వితంతవులు, దివ్యాంగుల నెలవారి ఖర్చుల కోసం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పింఛను రూపంలో ఆదుకుంటున్నారన్నారు. ఇచ్చిన హామీ మేరకు పింఛను అందిస్తున్న ఘనత చంద్రబాబుకే దక్కుతుందని తెలిపారు. రాష్ట్రం అన్ని రంగాల్లో ముందుకు వెళుతుందన్నారు. అయితే రాష్ట్ర అభివృద్ధిని సైంధవుడిలా వైసీపీ నేతలు అడ్డుకుంటున్నారని చెప్పారు. మరో 30 ఏళ్ల చంద్రబాబు అధికారంలో ఉండటం ఖాయమని, దేశంలో ఏపీని నెంబర్ ఒన్ స్థాయిలో చేర్చటం ఖాయమన్నారు. వైసీపీ అధినేత జగన్ జైలుకు వెళితే ఆ పార్టీ బంగాళాఖాతంలో కలవడం తప్పదన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు సాయి, హనీఫ్, కేవీరెడ్డి, రాజు, గురు, సతీష్, సచివాలయ ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల కుటుంబాలకు అండగా ఉంటాం

- ఆర్టీసీ జోనల్ చైర్మన్ సురేష్‌రెడ్డి



రాఘవయ్య మృతదేహాన్ని సందర్శించిన సురేష్‌రెడ్డి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), నవంబరు 1(ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో మృతి చెంది న ఆర్టీసీ ఉద్యోగుల కుటుంబాలకు అండగా ఉంటామ ని ఆర్టీసీ నెల్లూరు జోనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి తెలిపారు. నెల్లూరు రీజియన్ పరిధిలో పనిచేస్తూ విధి నిర్వహణలో మృతి చెందిన నెల్లూరు-1 డిపో కండక్టర్ రాఘవయ్య(56), నెల్లూరు-2 డిపో డ్రైవర్ వెంకయ్య(59)ల నివాసాలకు శనివారం ఆయన వెళ్లి మృతదేహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధి నిర్వహణలో మృతి చెందిన వారి కుటుంబాలకు తక్షణ సాయంగా రూ.25 వేల ఆర్థిక సాయం అందిస్తున్నామన్నారు. ఉద్యోగుల కుటుంబాలకు ప్రభు త్వం నుంచి రావాల్సిన ఉద్యోగ ప్రయోజనాలు, నష్టపరిహారం త్వరగా అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రజా రవాణాధికారి ఎస్కే షమీమ్, డిపో మేనేజర్లు, అధికారులు పాల్గొన్నారు.

నేడు వీరబ్రహ్మేంద్రస్వామి జయంతి

నెల్లూరు(సాంస్కృతికం), నవంబరు 1(ఆంధ్రజ్యోతి): నగరంలోని విరాట్‌నగర్‌లో గాయత్రీదేవి, విశ్వకర్మ భగవాన్ స్వామి, గోవిందమాంబ సమేత జగద్గురు శ్రీమద్విరాట్ వీరబ్రహ్మేంద్రస్వాముల దేవస్థానంలో ఆదివారం వీరబ్రహ్మేంద్ర స్వామి 417వ జయంతి మహోత్సవాలు, కార్తీకమాసం వనమహోత్సవ భోజన సంతర్పన కార్యక్రమం జరగనుంది. ఉదయం సుప్రభాతసేవ, అభిషేకాలు, కలశతీర్థం, పూలంగిసేవ పూజలు జరుగుతాయి.

సమ్మె కాలంలో ప్రాణాలు కోల్పోయిన రోగులకు నష్టపరిహారం చెల్లించాలి : ఏఐటీయూసీ



మాట్లాడుతున్న ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి శంకర్ కిశోర్

నెల్లూరు(వైద్యం), నవంబరు 1(ఆంధ్రజ్యోతి) : ఎన్టీఆర్ వైద్య సేవ నెట్‌వర్క్ ఆసుపత్రుల సమ్మె కాలంలో వైద్యం అందక మరణించిన రోగులకు రూ.25 లక్షల నష్టపరిహారం చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పెనుమల్లి శంకర్ కిశోర్ డిమాండ్ చేశారు. శనివారం సీపీఐ జిల్లా కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్టీఆర్ వైద్య సేవ నెట్‌వర్క్ ఆసుపత్రుల వైద్యులు 22 రోజులుగా సమ్మె చేశారన్నారు. ఆయా సమయాలలో రాష్ట్ర వ్యాప్తంగా 200 మందికి పైగా మరణించగా జిల్లాలో 25 మంది వరకు మరణించారని ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్టీఆర్ వైద్యసేవ పథకం కింద ప్యాకేజీలు తక్కువగా ఉండటంతో నెట్‌వర్క్ ఆసుపత్రులు రోగుల వద్ద అదనంగా డబ్బులు వసూలు చేస్తున్నాయన్నారు. తెల్లరేషన్ కార్డు ఉన్న వారికి రూ.5 లక్షల హెల్త్ ఇన్స్యూరెన్స్ తప్పనిసరి చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి మధు, మహిళా సంఘం కో కన్వీనర్ బిట్రగుంట శిరీష, తదితరలు పాల్గొన్నారు.

వాత్సల్య, గీతామయి ఆశ్రమాల్లో అన్నదానం



గీతామయి ఆశ్రమంలో అన్నదానం చేస్తున్న నిర్వాహకులు

నెల్లూరు(హరనాథపురం), నవంబరు 1(ఆంధ్రజ్యోతి): నెల్లూరు పార్లమెంటు సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి తల్లి వేమిరెడ్డి శ్యామలమ్మ వర్ధంతి సందర్భంగా శనివారం అన్నదాన కార్యక్రమాలు జరిగాయి. నగరంలోని వాత్సల్య అనాథ శరణాలయం, గీతామయి వృద్ధుల ఆశ్రమం, చిల్డ్రన్స్ పార్కు వద్దనున్న సాయిబాబు ఆలయంలో ఈ అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

5 నుంచి యోగా కార్యక్రమాలు

నెల్లూరు(విద్య), నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ఈషా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈనెల 5 నుంచి 11వ తేదీ వరకు మూలాపేటలోని శివాలయం సెంటర్ శ్రీవీరశైవ సత్రంలో ఇన్నర్ ఇంజనీరింగ్ (యోగా) కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కోఆర్డినేటర్ మాధవ్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రాచీన యోగశాస్త్రాల సారం అయిన ఇన్నర్ ఇంజనీరింగ్ మనిషి సంపూర్ణ శ్రేయస్సుకు బాటలు వేసి, ఆనందకరమైన జీవితానికి దోహదపడుతుందని పేర్కొన్నారు. ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం జరిగే ఈ కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ హాజరు కావచ్చని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన వారు ఈషా డాట్ కో/ఐఈఎన్ఎల్ఆర్‌లో లాగిన్ అయ్యి వివరాలు నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు.

పొట్టిశ్రీరాములకు ఘన నివాళి



పొట్టి శ్రీరాములకు నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

నెల్లూరురూరల్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ఆంధ్రరాష్ట్ర ఆవతరణ వేడుకల్లో భాగంగా శనివారం బుజబుజనెల్లూరులోని శేషు స్కూల్లో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా స్కూల్ కరస్పాండెంట్ బీ శేషుయాదవ్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఏకాదశి పుష్పార్చనలు



పూజలు అందుకుంటున్న స్వామివారు

నెల్లూరు (సాంస్కృతి కం), నవంబరు 1(ఆంధ్ర జ్యోతి): పొగతోట గాంధీ నగర్‌లోని ఆదిశంకర ధ్యాన్య మందిరంలో కొన సాగుతున్న కార్తీకమాస రుద్రాభిషేక అర్చనలతో పాటు శనివారం కార్తీక శుద్ధ ఏకాదశి సందర్భంగా విశేషంగా కార్తీక దామో దర స్వామిని అభిషేకాలు జరిగాయి. అనంతరం విష్ణుసహస్రనామ స్తోత్ర పారాయణతో పుష్పార్చన జరిగింది. అద్దేపల్లి రవీంద్రనాథ్‌శర్మ పూజలు నిర్వహించారు. ట్రస్టు ధర్మకర్త పామ ర్తి వెంకటలీలామోహన్, మేనేజింగ్ ట్రస్టీ చక్రాల ఆనంద కుమార్, కనపర్తి దుర్గాకుమార్, చక్రాల నాగరత్నకుమారి, వెంకట శ్రీకాంత్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

హరిబాబుకు ఉత్తమ హాస్యనటుడి పురస్కారం



సినీనటుడు గౌతంరాజు నుంచి పురస్కారం అందుకుంటున్న హరిబాబు

నెల్లూరు(సాంస్కృతికం), నవంబరు 1(ఆంధ్రజ్యోతి): నెల్లూరుకు చెందిన సినీహాస్య నటుడు దోర్నాల హరిబాబుకు మరో ఉత్తమ హాస్యనటుడు పురస్కారం లభించింది. శనివారం హైదరాబాదులోని పొట్టిశ్రీరాములు తెలుగు యూనివర్శిటీలో జరిగిన విశ్వజనని అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమంలో హరిబాబు విశ్వజనని ఉత్తమ హాస్యనటుడు పురస్కారం అందుకున్నారు. ప్రతిభావంతులైన కళాకారులకు ప్రతిష్టాత్మకమైన సంస్థ విశ్వజనని ఫౌండేషన్ అందించింది. పలు రంగస్థల హాస్య ప్రదర్శనలు, టీవీషోలు, సినిమాల్లో హాస్యనటన, నెల్లూరు కామెడీ ద్వారా కామెడీ స్కిట్లతో హాస్యప్రియులను అలరిస్తున్నందుకు హరిబాబుకు ఈ పురస్కారం లభించింది. ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు, సినీప్రముఖులు, హాస్యనటుడు గౌతంరాజు తదితరులు పాల్గొని అభినందనలు తెలిపారు.

తల్లిదండ్రులకు బాలిక అప్పగింత

మనుబోలు, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): గూడూరు రోడ్డుపై అటు, ఇటు తిరుగుతున్న దీప (8)అనే బాలికను తల్లిదండ్రుల ఆచూకి తెలుసుకుని గూడూరు ఒన్‌టౌన్, మనుబోలు పోలీసులు కలిసి శనివారం తల్లిదండ్రులకు అప్పగించారు. వివరాల్లోకి వెళితే... స్థానిక ఎరుకుల కాలనీకి చెందిన వెంకటేష్, మమతల కుమార్తె దీప. ఈ బాలికను చదివించేందుకు గూడూరు హాస్టల్‌లో ఉంచారు. అక్కడ ఉండేందుకు ఇష్టపడని దీప హాస్టల్ బయటకు వచ్చి రోడ్లపై తిరుగుతుండగా స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పాప తెలిపిన వివరాలను గూడూరు పోలీసులు మనుబోలు పోలీసులకు తెలపగా, ఎస్ఐ శివరాకేష్ సిబ్బందిచే విచారణ చేపట్టి ఎరుకుల కాలనీకి చెందిన పాపగా గుర్తించారు. పాప తల్లిదండ్రులను స్టేషన్‌కు పిలిపించి బాలికను అప్పగించారు.

డిగ్రీ పరీక్షలకు ఐదుగురి గైర్హాజరు

వెంకటాచలం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : విక్రమ సింహపురి యూనివర్సిటీ పరిధిలోని అనుబంధ డిగ్రీ కళాశాలలో శనివారం జరిగిన డిగ్రీ మూడవ, ఐదవ సెమిస్టర్ పరీక్షలలో ఐదు మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు వీఎస్‌యూ పరీక్షల నిర్వాహణాధికారిని డాక్టర్ ఆర్ మధుమతి ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షలలో మొత్తం 39 మంది మంది విద్యార్థులకుగాను 34 మంది హాజరయ్యారు.

వైభవంగా ప్రాకారోత్సవం



ప్రాకారోత్సవంలో మూలస్థానేశ్వర స్వామి

నెల్లూరు(సాంస్కృతికం), నవంబరు 1(ఆంధ్రజ్యోతి): నగరంలోని మూలాపేట మూలస్థానేశ్వరస్వామి ఆలయంలో కార్తీకమాసం సందర్భంగా శనివారం ప్రాకారోత్సవం వైభవంగా జరిగింది. ఈసందర్భంగా ఉదయం మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, విశేష పూజలు అమ్మవారికి అర్చనలు జరిగాయి. సాయంత్రం పూలంగిసేవ, విశేష పూజలు జరిగాయి. భక్తులు భారీసంఖ్యలో పాల్గొన్నారు.

మున్సిపల్ పాఠశాలలో ఇంద్రజాల ప్రదర్శన



ఇంద్రజాల ప్రదర్శన చేస్తున్న సెల్వకుమార్

నెల్లూరు(విద్య), నవంబరు 1(ఆంధ్రజ్యోతి): నగరంలోని కృష్ణమందిరం నగరపాలక సంస్థ ప్రాథమిక పాఠశాలలో శనివారం ఇంద్రజాల ప్రదర్శన నిర్వహించారు. నెల్లూరు అర్బన్ ఎంఈవో కార్యాలయంలో రికార్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఎఫ్.సెల్వకుమార్ ఇంద్రజాల ప్రదర్శనతో విద్యార్థులను ఉత్సాహపరిచారు. వివిధ రకాల ప్రదర్శనలతో విద్యార్థులకు చేసి చూపించిన ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. అనంతరం పాఠశాల సిబ్బంది ఆయనను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు షేక్.ఖాజా రహంతుల్లా, ఉపాధ్యాయులు గోవిందు, మంజుల, గిరిజాకుమారి, సుప్రజ, సిబ్బంది పాల్గొన్నారు.

వేదగిరిపై కొనసాగుతున్న పవిత్రోత్సవాలు



ఉత్సవమూర్తులకు అభిషేకం నిర్వహిస్తున్న అర్చక బృందం

వేదగిరి క్షేత్రంలో రెండోరోజు శనివారం పవిత్రోత్సవాలు వైభవంగా జరిగాయి. విష్వక్సేనపూజతో మొదలైన ఉత్సవాలు అకల్మష హోమం, స్నపన తిరుమంజనం, అగ్ని ప్రతిష్ఠ, కుంభావాహన, ఆరాధన, పవిత్ర వాస్తు అధివాసంతోపాటు ప్రధాన హోమాలు ఆలయ ప్రధాన అర్చకులు భాస్కరాచార్యుల నేతృత్వంలో సాగుతున్నాయి. వేదపండితుల మంత్రోశ్ఛరణలు, శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. ముందుగా స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ కమిటీ చైర్మన్ ఇందుపూరు అచ్యుత రెడ్డి దంపతులు, ఈవో గోపి, ఉభయకర్తలు పాల్గొన్నారు. ఈ వేడుకలను భక్తులు కనులారా వీక్షించారు.

-నెల్లూరు రూరల్, (ఆంధ్రజ్యోతి)

ఆ తల్లికి.. బిడ్డ భారమైంది..!



ఐసీడీఎస్ సిబ్బంది చేతిలో శిశువు

ఆ తల్లికి బిడ్డ భారమైంది. మానవత్వాన్ని మంట గలుపుతూ పసికందును ముళ్లపొదల్లో పడేసింది. ఈ ఘటన జాతీయ రహదారి పక్కన కోవూరుకు సమీపంలో శనివారం వెలుగు చూసింది. వివరాల్లోకి వెళ్తే... ఓ లారీ డ్రైవర్ కాలకృత్యాలు తీర్చుకునేందుకు జాతీయరహదారి పక్కనున్న పొదల్లోకి వెళ్లాడు. ముళ్ల పొదల్లో బొడ్డుకూడా ఊడని ఓ పసికందును చూసి నిర్ఘాంతపోయాడు. అపస్మారకస్థితిలో ఉన్న ఆ ఆడశిశువును చేతుల్లోకి తీసుకుని దగ్గర్లో ఉన్న ప్రభుత్వ వైద్యశాలకు పరుగులు తీసి ప్రాణాల్ని కాపాడాడు. వెంటనే శిశువు ముళ్ల పొదల్లో కనుగొన్న విషయాన్ని కోవూరు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు హుటాహుటిన ప్రభుత్వ వైద్యశాలకు చేరుకుని శిశువును కాపాడమని వైద్యులకు విజ్ఞప్తి చేశారు. శిశువు పొదల్లో దొరికిన విషయం తెలుసుకున్న స్త్రీశిశు సంక్షేమశాఖ అధికారులు ప్రభుత్వ వైద్యశాలకు చేరుకుని బిడ్డ సంరక్షణ బాధ్యతలను చేపట్టారు. శిశువును ముళ్ల పొదల్లో పడేసి వెళ్లిన రక్కసులను గుర్తించి తగిన చర్యలు తీసుకోమని కోరుతూ ఐసీడీఎస్ కార్యాలయ కార్యదర్శి కే ఉమ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆమె ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ముళ్ల పొదల్లో చిక్కిన శిశువును తాము పెంచుకుంటామంటూ పలువురు మహిళలు, వ్యక్తులు పోలీసులను, ఐసీడీఎస్ సిబ్బందిని ప్రాధేయపడడం విశేషం.

-కోవూరు, (ఆంధ్రజ్యోతి)



భూసేకరణలో అన్యాయంపై ఆందోళన

కందుకూరు, (ఆంధ్రజ్యోతి): 167బీ జాతీయ రహదారి విస్తరణ కోసం మండలంలోని ఓగూరు, ప లుకూరు గ్రామాల పరిధిలో చేస్తున్న భూసేకరణలో రైతులకు తీవ్ర అన్యాయం చేస్తున్నారని బాధిత రైతులు శనివారం నిరసన నిర్వహించారు. తొలుత ఓగూరు సచివాలయంలో సమావేశమైన రెండు గ్రామాల బాధిత రైతులు తమకు జరుగుతున్న అన్యాయంపై ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన తెలిపా రు. అనంతరం జాతీయ రహదారిపైకి వచ్చి నిరసన కొనసాగించారు. ఈ సందర్భంగా బాధిత రై తులు నరహరి తదితరులు మాట్లాడుతూ ఓగూరు, పలుకూరు గ్రామాల పరిధిలో జాతీయ రహదా రి పక్కన ఉండే భూములు ప్రస్తుతం ఎకరం కోటి రూపాయలకు పైగా ఉండగా కేవలం రూ. 8ల క్షల ధర నిర్ణయించి ఆ ప్రకారం పరిహారం చెల్లించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. జాతీయ రహదారి రైతులను బలిచేయటం అన్యాయమన్నారు.

అవ్వాతాతలు సంతోషంగా ఉన్నారు!



పింఛన్‌పై వృద్ధుడి అభిప్రాయం తెలుసుకుంటున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా

మర్రిపాడు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ఎన్టీఆర్ భరోసా పింఛన్ పొందుతున్న అవ్వాతాతలు చాలా సంతోషంగా ఉన్నారని కలెక్టరు హిమాన్షు శుక్లా అన్నారు. శనివారం ఆయన మర్రిపాడు మండలం డీసీపల్లిలో లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్ అందజేశారు. అనంతరం మీడియాతో మాట్లాడారు.రూ. 4వేల నుంచి నుంచి వివిధ రకాల పింఛన్లను ప్రభుత్వం రూ. 6వేలు, రూ. 15వేలు వరకు పెంచటంతోపాటు అనేక సంక్షేమ కార్యక్రమాలు అందచేస్తున్నదన్నారు. క్రమం తప్పకుండా పింఛన్ అందుతుందా ? ఏమైనా ఇబ్బందులు తలెత్తుతున్నాయా..? అని వృద్ధులను విచారించగా, అందుతున్నాయని వారు సంతోషం వ్యక్తం చేశారు. ఇటీవల వచ్చిన తుఫాన్ సమయంలో మండలంలోని అధికారులు కష్టించి పనిచేశారని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ చైర్మన్ ఆరికట్ల జనార్దన్ నాయుడు, ఎంపీడీవో నాగేంద్ర ప్రసాద్, తహసీల్దారు అనీల్ కుమార్, టీడీపీ మండల అధ్యక్షుడు గంగాధర్, నాయకులు నారాయణరెడ్డి, చంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

డీఎస్‌డీవోగా పాండు రంగారావు బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు చేపట్టిన పాండురంగారావుకు పుష్పగుచ్ఛం ఇస్తున్న యతిరాజ్

నెల్లూరు(విద్య), నవంబరు 1(ఆంధ్రజ్యోతి): జిల్లాలో క్రీడాభివృద్ధికి కృషి చేస్తానని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఎం.పాండురంగారావు అన్నారు. నగరంలోని డీఎస్ఏ కార్యాలయంలో శనివారం ఆయన డీఎస్‌డీవోగా రిటైర్డ్ డీఎస్‌డీవో ఆర్‌కే.యతిరాజ్ నుంచి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా క్రీడా రంగంపై అవగాహన ఉంద ని, ఫుట్‌బాల్ కోచ్‌గా జిల్లాలో పని చేసిన అనుభవంతో బాధ్యతాయుతమైన విధులు నిర్వహిస్తానన్నారు. క్రీడా సంఘాలు, కోచ్‌లు, క్రీడా ప్రముఖులతో సత్సంబంధాలు మెరుగుపరచుకుని కలెక్టర్ ఆదేశాల మేరకు పనిచేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా యతిరాజ్ మాట్లాడుతూ జిల్లా క్రీడారంగం ఉన్నతికి పాటుపడాలని, విధి నిర్వహణలో అందరికీ ఆదర్శంగా నిలవాలని ఆకాక్షించారు. ఈ కార్యక్రమంలో కోచ్‌లు పాల్గొన్నారు.

నేడు ఎస్‌జీఎఫ్ యోగా ఎంపికలు

నెల్లూరు(విద్య), నవంబరు 1(ఆంధ్రజ్యోతి): జిల్లా పాఠశాలల క్రీడా సమాఖ్య అండర్-19 బాలబాలికల యోగా ఎంపికలను ఈనెల 2న నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో నిర్వహిస్తున్నట్లు కార్యదర్శి పీ.వేణుగోపాల్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఇంటర్ చదువుతున్న విద్యార్థులు, 2007 జనవరి 1వ తేదీ తరువాత జన్మించిన వారు ఈ ఎంపికల్లో పాల్గొనవచ్చని ఆయన వివరించారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు ఉదయం 10 గంటలకు హాజరు కావాలని ఆయన ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

పొగరాయుళ్లపై కొరడా

- బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం నిషేధం
- పొగతాగితే రూ.200 జరిమానా
- విద్యాసంస్థల్లో అవగాహన
- రెండునెలలపాటు విస్తృత కార్యక్రమాలు
- ఎన్‌సీడీకి బాధ్యతల అప్పగింత
- టీఎఫ్‌వైసీ 3.0కి శ్రీకారం

నెల్లూరు (వైద్యం), నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): బహిరంగ ప్రదేశాల్లో సిగరెట్, బీడీ, చుట్ట తాగరాదని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఓ చట్టాన్ని తీసుకువచ్చాయి. అలా చేస్తే రూ. 200 జరిమానా విధిస్తున్నట్లు ప్రకటించాయి. ఇందుకు సంబంధించిన పోస్టర్లను కూడా ఇటీవల అధికారులు విడుదల చేశారు. 2003లోనే సుప్రీం కోర్టు బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం చేయరాదని నిషేధం విధించింది. విద్యాలయాల కు 100 మీటర్ల దూరం వరకు ఎవరూ ధూమపానం చేయరాదని ఆదేశించింది. అయితే ఆ చట్టం సరిగా అమలు జరగలేదు. ఈ నేపథ్యంలో గత జూలై 1 నుంచి ధూమపాన నిషేధాన్ని పూర్తిగా అమలు చేయాలని అధికారులకు ఆదేశాలు అందాయి. ముఖ్యంగా నెల్లూరులోని ప్రధాన కూడళ్లు, కావలి, కందుకూరు పట్టణాల్లోని ప్రధాన కూడళ్లు, ఆర్టీసీ బస్టాండ్, రైల్వేస్టేషన్లలో ధూమపానం నిషిద్ధం. అలాగే గ్రామీణ ప్రాంతాల్లోని ప్రధాన కూడల్లిలో కూడా నిషేధం. అయితే కొందరు చాటుమాటుగా ధూమపానం సేవిస్తునే ఉన్నారు.

● అమలులో టీఎఫ్‌వైసీ 3.0

జిల్లాలో ఈ విషయమై ప్రచారం నిర్వహించేందుకు కేంద్ర కుటుంబ ఆరోగ్య సంక్షేమ శాఖ టుబాకో ఫ్రీ యూత్ కాంపెయినింగ్ 3.0 (టీఎఫ్‌వైసీ) కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇం దుకు అనుగుణంగా అవగాహన కార్యక్రమాలకు రూపొందించి ముందుకు సాగుతోంది. ప్రస్తుత సమాజంలో 11 ఏళ్లకే పొగాకు ఉత్పత్తులకు యువత బానిసలువుతున్నారని కేంద్ర కుటుంబ ఆరోగ్య సంక్షేమ శాఖ ప్రత్యేక పరిశీలన ద్వారా గుర్తించింది. ఈ నేపథ్యంలో పొగాకు ఉత్పత్తుల వల్ల కలిగే అనారోగ్య కారణాలపై విస్తృత అవగాహన అవసరమని భావించింది. క్షేత్రస్థాయిలో ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల్లో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించింది.

● రెండు నెలలపాటు అవగాహన

ఈ నేపథ్యంలో అక్టోబ రు 9 నుంచి డిసెంబరు 8 వరకు జిల్లాలో అవగాహ న కార్యక్రమాలు చేపట్టాలని కేంద్రం ఆదేశించింది. తొలిసారిగా పొగాకు ఉత్పత్తుల వినియోగాన్ని తగ్గించాలన్న లక్ష్యంతో వైద్య ఆ రోగ్యశాఖ కూడా ముందుకు వెళుతుంది. ఇందులో భాగంగా పాఠశాలల్లో చదువుతున్న 11 ఏళ్ల పైడిబడిన విద్యార్థులకు పొగాకు ఉత్పత్తుల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కార్యక్రమాలు చేపట్టింది. జిల్లాలోని 2594 ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రాథమికోన్నత పాఠశాలల్లో అవగాహన తరగతులను నాన్ కమ్యూనికేబుల్ డీసీజెస్(ఎన్‌సీడీ) విభాగం చేపట్టింది. తద్వారా 20వేల మంది విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆయా విద్యార్థులు ఓ ప్రతిజ్ఞ తయారు చేసుకుని పొగాకు అలవాట్లను ఇక నుంచి మానివేస్తామని, ఇంట్లో వారేకాకుండా చుట్టు పక్కల వారి నుంచి కూడా మానిపించే దిశగా అవగాహన కార్యక్రమాలు కొనసాగుతాయి. ఇందులో సచివాయం ఏఎన్‌ఎంలు కూడా భాగస్వామ్యమవుతారు.



● జిల్లాలో బాధితులు ఎక్కువే..

జిల్లా జనాభాలో 50శాతం మంది పురుషులు, 7.1 శాతం మంది మహిళలు పొగాకు ఉత్పత్తులకు బానిసలవుతున్నట్లు వై ద్య ఆరోగ్యశాఖ ఎన్‌సీడీ విభాగం వెల్లడించింది. ప్రతీ ఐదుగురిలో ఒకరు ధూమపానానికి, పాన్ ఉత్పత్తులకు అలవాటు పడుతున్నట్లు ఓ సర్వేలో వెల్లడైంది. ప్రతీఏటా 8 శాతం మంది కొ త్త వారు పొగాకు ఉత్పత్తులకు అలవాటు పడుతున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. చిన్నారులు సైతం ఈ పొగాకు ఉత్పత్తులకు బానిసలు కావటం కలవరపెడుతున్న సమస్య.

పాఠశాలల్లో విస్తృత అవగాహన



పొగాకు ఉత్పత్తుల నిషేధంపై పాఠశాలల్లో అవగాహన తరగతులు ప్రారంభమయ్యాయి. 11ఏళ్ల పైడిన యువకులు సైతం పొగాకు ఉత్పత్తులకు బానిసలవుతున్నట్లు కేంద్రం గుర్తించింది. ఇందుకు అనుగుణంగా అవగాహన తరగతులు డిసెంబరు 8 వరకు కొనసాగుతాయి. ప్రజల్లో పొగాకు ఉత్పత్తులపై చైతన్యం తీసుకు వచ్చేందుకే ఈ కార్యక్రమాలు చేపడుతున్నాం.

- డాక్టర్ యశ్వంత్
(ఎన్‌సీడీ నోడల్ అధికారి)

రజకులకు సామాజిక రక్షణ చట్టం ఏర్పాటు చేయాలి

● శిక్షణ తరగతుల్లో భాస్కరయ్య



మాట్లాడుతున్న భాస్కరయ్య

నెల్లూరు(హరనాథపురం),నవంబరు1 (ఆంధ్రజ్యోతి): రా ష్ట్ర ప్రభుత్వం రజకుల కోసం సామాజిక రక్షణ చట్టం ఏ ర్పాటు చేయాలని ఏపీ రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మన్నూరు భాస్కరయ్య పేర్కొన్నారు. నగరంలోని జెట్టి శేషారెడ్డి భవన్‌లో శనివారం జిల్లా ప్రధాన కార్యదర్శి రేకులగుంట అంకయ్య అధ్యతన రజకుల చైతన్య శిక్షణ తరగతులు జరిగాయి. ఈ సందర్భంగా భాస్కరయ్య మాట్లాడుతూ 2024 ఎన్నికల్లో టీడీపీ, బీజేపీ, జనసేన పా ర్టీలు మ్యానిఫెస్టోలో ఇచ్చిన అన్నీ హామీలను అమలు చే యాలని కోరారు. హామీలు అమలు కోసం జరిగే పోరా టం లో రజకులంతా భాగస్వాములు కావాలని కోరారు ఈ కా ర్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు నేరెళ్ల శ్రీనివాస్, రై తు సంఘం నాయకులు మూలం రమేష్, వడ్డెర వృత్తిదారు ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుంజి దయాకర్, ఇతర నాయకులు చిన్న, గురుశేఖర్, కామయ్యపాల్గొన్నారు.

గిరిజనులు ఆర్థికాభివృద్ధిని మెరుగు పర్చుకోవాలి

● జనజాతీయ గౌరవ్ దివస్‌లో మేయర్ స్రవంతి



గిరిజన విద్యార్థులతో మేయర్ స్రవంతి, ఐటీడీఏ పీవో మల్లికార్జునరెడ్డి, తదితరులు

నెల్లూరు(హరనాథపురం), నవంబరు 1(ఆంధ్రజ్యోతి): గిరిజనులు ఆర్థికాభివృద్ధిని మెరుగు పరచుకునేందుకు గిరిజన సంక్షేమ శాఖ అధికారులతో సమన్వయం చేసుకోవాలని నగర మేయర్ పొట్లూరి స్రవంతి అన్నారు. శనివారం నగరంలోని గిరిజన భవన్‌లో జనజాతీయ గౌరవ్ దివస్ జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడుతూ బిర్సా ముండా జయంతిని పురస్కరించుకుని జనజాతీయ గౌరవ్ దివస్ కార్యక్రమాలను దేశవ్యాప్తంగా నిర్వహించటం హర్షించదగిన విషయమన్నారు. నెల్లూరు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బీ.మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ బిర్సా ముండా జయంతిని పురస్కరించుకుని ధర్తీ ఆబా అనే పేరుమీద కేంద్ర ప్రభుత్వం నూతన పథకాన్ని ప్రారంభించిందన్నారు. గిరిజన గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించడమే ఈ పథకం ముఖ్య ఉద్దేశం అన్నారు. ఈ పథకం కింద జిల్లాలో 21 గ్రామాలను గుర్తించి ప్రభుత్వానికి ఆమోదం కోసం పంపామని చెప్పారు. గిరిజన సంక్షేమానికి అనేక కార్యక్రమాలు చేస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా 500 మంది గిరిజన గురుకుల విద్యార్థులు ప్రాచీన గిరిజన కళ ప్రతిబింబించేలా ప్రదర్శనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ, గిరిజన సంక్షేమశాఖ, ఇంజనీరింగ్ విభాగానికి చెందిన అధికారులు పాల్గొన్నారు.

కావలిలో ప్రయాణికుడికి పర్సు అప్పగింత

కావలి, నవంబరు1 (ఆంధ్రజ్యో తి): కావలి ఆర్టీసీ బస్టాండ్ కూల్‌డ్రింక్ షాపు వద్ద కలిగిరి మండలం సిద్దనకొండూరుక చెందిన షైడి కి షోర్ శనివారం తన పర్సు పోగొట్టుకున్నాడు. దానిని ఆర్టీసీ అధికారులు ఆ ప్రయాణికుడికి అందజేశారు. కి షోర్ కూల్‌డ్రింక్ తాగుతూ తన చేతిలోని పర్సును పోగొట్టుకున్నాడు. ఆర్టీసీ విచారణ కేంద్రంలో ఫిర్యాదు చేయగా, ఈలోపు కూల్‌డ్రింక్ షా పులో పనిచేసే వ్యక్తి పర్సును విచారణకేంద్రంలో అప్పజెప్పి తన నిజాయితీని చాటుకున్నారు. ఆ పర్సులో చిన్న బంగారు ఉంగరంతోపాటు పర్సులో ఉన్న వస్తువల వివరాలు చెప్పటంతో ఆర్టీసీ డీఎం ఆదినారాయణ, బస్సు స్టేషన్ మేనేజరు రామక్రిష్ణ, పోలీస్ అవుట్‌పోస్టు కానిస్టేబుల్, ఆర్టీసీ సెక్యూరిటీ సిబ్బంది సమక్షంలో ప్రయాణికుడికి పర్సును అందజేశారు. ఈ సందర్భంగా పలువురు అభినందించారు.

6న విశ్రాంత ఉద్యోగుల సంఘం ఎన్నికలు

నెల్లూరు(హరనాథపురం), నవంబరు 1(ఆంధ్రజ్యోతి): విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగుల సంఘం కార్యవర్గ సమావేశం ఈనెల 6న ఉదయం 10గంటలకు నగరంలోని టౌన్‌హాల్లో జరుగుతుందని ఏపీ స్టేట్ గవర్నమెంటు రిటైర్డు ఎంప్లాయీస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఐ.లక్ష్మీనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో కార్యవర్గ ఎన్నికలు జరుగుతాయని పేర్కొన్నారు. సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్‌ఎం బాషా ఎన్నికల అధికారిగా వ్యవహరిస్తారని తెలిపారు.

టెట్ నుంచి ఉపాధ్యాయులకు మినహాయింపు ఇవ్వాలి



డీఈవోకు వినతిపత్రం అందచేస్తున్న ఫ్యాప్టో నేతలు

నెల్లూరు(విద్య), నవంబరు 1(ఆంధ్రజ్యోతి) : టెట్ నుంచి ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు మినహాయింపు ఇవ్వాలని ఫ్యాప్టో నేతలు కోరారు. నగరంలోని జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో శనివారం డీఈవో బాలాజీరావుకు ఫ్యాప్టో నేతలు వినతిపత్రం అందచేశారు. ఈసందర్భంగా ఫ్యాప్టో చైర్మన్ కే.మధుసూదన్‌రావు మాట్లాడుతూ ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ ఉత్తీర్ణత అనే నిబంధన అసంబద్ధమైందన్నారు. దీనిపై ఉన్న నిబంధన చట్టంలో మార్పు తేవడంతోపాటు వెంటనే ప్రభుత్వం సుప్రీం కోర్టులో రివ్యూ పిటీషన్ వేయాలన్నారు. ప్రస్తుతం టెట్ ఉత్తీర్ణత కావడం వలన విద్యాబోధనలో ప్రత్యేకంగా వచ్చే అభివృద్ధి కానీ, మార్పుగానీ ఉండదని తెలిపారు. సెక్రటరీ జనరల్ షేక్.జావీద్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేసిన బదిలీ చట్టం-2025 నిబంధనలకు విఘాతం కలిగేలా బదిలీల్లో కొత్త పాఠశాలల ఎంపిక చేసుకున్న వారిని నేటికీ రిలీవ్ చేయకపోవడం బాధాకరమన్నారు. అధికారులు చర్యలు తీసుకుని ఉపాధ్యాయులను రిలీవ్ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఫ్యాప్టో నేతలు పీ.మాధవరావు, సీహెచ్‌వీ.కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ కలహాలతో యువతి, యువకుడి ఆత్మహత్య

● నగరంలోని వేర్వేరు ప్రాంతాల్లో ఘటన

నెల్లూరు(క్రైం), నవంబరు 1(ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాల నేపథ్యంలో నగరంలోని వేర్వేరు ప్రాంతాల్లో ఓ యువతి, ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటనలు శనివారం వెలుగులోకి వచ్చాయి. ప్రకాశం జిల్లా టంగుటూరు మండలానికి చెందిన లావణ్య(21)కు నెల్లూరు 4వ మైలు ప్రాంతానికి చెందిన వినోద్‌తో 2023 మేలో వివాహం జరిగింది. వారికి 5 నెలల కుమారుడు ఉన్నాడు. ప్రస్తుతం నగరంలోని మల్లెతోటలో నివాసం ఉంటున్నారు. ఇటీవల దంపతుల నడుమ మనస్పర్థలు చోటుచేసుకున్నాయి. ఈ విషయాన్ని ఆమె తన కుటుంబసభ్యులకు చెప్పగా వారు పలు మార్లు దంపతులకు నచ్చజెప్పి సంతోషంగా కాపురం చేసుకోవాలని సూచించారు. శుక్రవారం అర్ధరాత్రి వినోద్ పని నిమిత్తం తిరుపతికి వెళ్లాడు. శనివారం లావణ్య తన అక్క కీర్తికి, భర్తకు నేను చనిపోతున్నానని మెసేజ్ చేసింది. దీంతో కీర్తి విషయాన్ని తన తండ్రి కోటేశ్వరరావుకు తెలియజేయగా ఆయన నెల్లూరులో ఉన్న తన మరదలు కామేశ్వరికి ఫోన్‌చేసి చెప్పారు. ఆమె తన భర్తతో కలిసి లావణ్య ఇంటికి వెళ్లి చూడగా తలుపులు లోపల గడియపెట్టి ఉన్నాయి. బలవంతంగా తలుపులు తెరిచి లోపలకు వెళ్లి చూడగా లావణ్య చీరతో ఫ్యానుకు ఉరివేసుకొని వేలాడుతూ కన్పించింది. వెంటనే ఆమెను కిందకు దించి నగరంలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతురాలి తండ్రి నెల్లూరుకు చేరుకొని నవాబుపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

● లేక్‌వ్యూ కాలనీలో...

నగరంలోని లేక్‌వ్యూ కాలనీకి చెందిన సునీల్(31), సుశీల దంపతులు. సునీల్ ఎలక్ట్రీషన్ పనులు చేస్తున్నాడు. వారి మధ్య మనస్పర్థలు రావడంతో భార్య పుట్టింటికి వెళ్లింది. సునీల్ పలుమార్లు కాపురానికి రావాలని భార్యను కోరినా ఆమె రాలేదు. దీంతో మనస్థాపానికి గురైన ఆయన శుక్రవారం అర్ధరాత్రి తన ఇంట్లోని ఫ్యానుకు చీరతో ఉరివేసుకున్నాడు. విషయాన్ని గమనించిన కుటుంబసభ్యులు ఆయన్ను కిందకు దించి జీజీహెచ్‌కు తరలించారు. పరిశీలించిన వైద్యులు అప్పటికే సునీల్ మృతి చెందాడని నిర్ధారించారు. ఈ మేరకు మృతుడు తండ్రి వెంకటశేషగిరి శనివారం దర్గామిట్ట పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు మృతదేహాన్ని మార్చురీకి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు వీరబ్రహ్మేంద్రస్వామి జయంత్యుత్సవం

ఆత్మకూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని హనుమాన్ జంక్షన్ వద్ద ఉన్న వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో ఆదివారం జయంతి మహోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉదయం సుప్రభాత సేవ, మంగళ తోరణం, అభిషేకం ప్రత్యేక పూజలు నిర్వహిస్తారన్నారు. భక్తులకు అన్నప్రసాద వితరణ గావిస్తారని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ. 11613
వెండి కిలో ధర	రూ. 152700
వెండి ఒక గ్రాము	రూ. 158.70

అసంపూర్తిగా భవనాల నిర్మాణం

సచివాలయ, విలేజ్ హెల్త్ క్లినిక్ సిబ్బంది అగచాట్లు

ఉదయగిరి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే చేపట్టిన సచివాలయ, ఆయుష్మాన్ భారత్ విలేజ్‌హెల్త్ క్లినిక్ భవనాల నిర్మాణం సగంసగం పనులతో అసంపూర్తిగా ఉన్నాయి. నిధుల లేమి కారణంగా ఏళ్ల తరబడి భవనాల నిర్మాణం కొనసాగుతుండడంతో అద్దె, ప్రభుత్వ భవనాల్లో కొనసాగిస్తున్నారు. కొన్ని భవనాలు ఇరుకుగా ఉండడం, శిథిలావస్థకు చేరడంతో విధులు నిర్వహించడం సిబ్బందికి కష్టతరంగా మారింది.



ఉదయగిరి ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో అసంపూర్తి నిర్మాణంతో విలేజ్ హెల్త్ క్లినిక్



ఏళ్ల తరబడి నిర్మాణం కొనసాగుతున్న సచివాలయ భవనం

ఏళ్లతరబడి సాగుతున్న భవన నిర్మాణాలు

నియోజకవర్గంలోని ఎనిమిది మండలాలకు 95 సచివాలయాలు, 95 రైతుసేవా కేంద్రాలు, 85 విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాలు మంజూరయ్యాయి. అందులో సుమారు 40 భవనాలు అసంపూర్తి నిర్మాణంతో మిగిలిపోయాయి. ఉదయగిరి మండలంలో నేలటూరు, వెంగళరావునగర్, ఉదయగిరి పట్టణంలో సచివాలయాలు, విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాలు అసంపూర్తిగా ఉన్నాయి. దుత్తలూరు మండలంలో నర్రవాడ, నందిపాడు, సీతారామపురం మండలం బాలాయపల్లి, వరికుంటపాడు మండలంలో పది భవనాలకుగాను ఐదు భవనాలు, కొండాపురం మండలంలో పది భవనాలకుగాను రెండు, జలదంకి మండలంలో 11 భవనాలకు గాను రెండు భవనాలు అసంపూర్తిగా ఉన్నాయి. ఏళ్ల తరబడి భవన నిర్మాణాలు పూర్తి కాకపోవడంతో పరాయి పంచన సేవలందించేందుకు ఉద్యోగులు తంటాలు పడుతున్నారు. సామగ్రి, మందులు నిల్వ చేసుకునేందుకు కూడా ఇబ్బందులు పడుతున్నారు.

చేతులెత్తేసిన కాంట్రాక్టర్లు

అప్పటి వైసీపీ ప్రభుత్వం పూర్తిస్థాయిలో నిధులు మంజూరు చేయకపోవడంతో నిర్మించడం తమ వల్ల కాదంటూ కాంట్రాక్టర్లు చేతులెత్తేశారు. కొంతమంది నిర్మాణాలు పూర్తిచేసినా పంచాయతీలకు అప్పగించేందుకు ఒప్పుకోలేదు. తమకు రావాల్సిన నిధులు మంజూరయ్యే వరకూ అప్పగించేది లేదని తేల్చిచెప్పారు.

త్వరలో పూర్తిచేయిస్తాం: పంచాయతీరాజ్ డీఈ

అసంపూర్తిగా ఉన్న సచివాలయ, విలేజ్ హెల్త్ క్లినిక్ భవన నిర్మాణాలను త్వరలో పూర్తిచేయిస్తామని పంచాయతీరాజ్ డీఈ సీహెచ్ మణికుమార్ తెలిపారు. అసంపూర్తి భవనాల నివేదికను పంపాలని ప్రభుత్వం సూచించింది. వాటిని పూర్తి చేసేందుకు త్వరలో ప్రభుత్వం నిధులు మంజూరు చేసే అవకాశముంది. నిధులు మంజూరు కాగానే భవన నిర్మాణ పనులు పూర్తి చేస్తామన్నారు.

న్యూస్ బాక్స్

భక్తిశ్రద్ధలతో లలితా రుద్ర మహాయజ్ఞం



కాశీవిశ్వేశ్వరస్వామికి అభిషేకాలు నిర్వహిస్తున్న భక్తులు

సంగం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిరుమనకొండలో ఉన్న రాజరాజేశ్వరీదేవి సమేత కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయంలో పీఠాధిపతి రాజరాజేశ్వరానందస్వామి ఆధ్వర్యంలో జరుగుతున్న లలితా రుద్ర మహాయజ్ఞం శనివారం 41వ రోజుకు చేరింది. ఈసందర్భంగా స్వామి, అమ్మవార్లకు క్షీర, పంచామృతాలతో అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం లలితా రుద్ర మహాయజ్ఞం నిర్వహించి పూర్ణాహుతి సమర్పించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాద వితరణ జరిగింది. ఈ కార్యక్రమంలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

నూతన విగ్రహ ప్రతిష్ఠోత్సవం



పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

ఆత్మకూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దేపూరు గ్రామంలో శనివారం శ్రీ సీతాలక్ష్మణ హనుమాన్ సమేత కోదండరామస్వామి వార్ల నూతన విగ్రహ ప్రతిష్ఠ, కుంభాభిషేక మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఉదయం గణపతి పూజ, అభిషేక, అర్చనలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు



విద్యార్థులకు పోటీలు నిర్వహిస్తున్న ఎంఈవో వెంకటేశ్వర్లు

ఉదయగిరి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు భారత రాజ్యాంగంపై వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఈసందర్భంగా ఎంఈవో-1 వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మండలంలోని జడ్పీ ఉన్నత పాఠశాలల స్థాయిలో నిర్వహించిన పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు మండల స్థాయిలో పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. విద్యార్థుల్లో అంతర్గతంగా దాగి ఉన్న సామర్థ్యాలను వెలికి తీసేందుకు ఇలాంటి పోటీలు దోహదపడతాయన్నారు. ఈ పోటీల్లో జడ్పీ ఉన్నత పాఠశాల గండిపాళెం విద్యార్థినులు టీ సంజన, ఎస్ .మధుప్రియ, గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థి డీ పూర్ణేష్‌లు నియోజకవర్గ స్థాయికి ఎంపికయ్యారన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు తత పాల్గొన్నారు.

గిరిజన ఆధార్ శిబిరానికి నామమాత్రపు స్పందన



ఆధార్ తీయించుకుంటున్న గిరిజనులు

సీతారామపురం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక బిట్-1 గ్రామ సచివాలయంలో గత రెండు రోజుల నుంచి గిరిజనుల కోసం ప్రత్యేకంగా నిర్వహిస్తున్న ఆధార్ శిబిరానికి నామమాత్రపు స్పందన లభించింది. ఐటీడీఏ నుంచి వచ్చిన ఆధార్ ఆపరేటర్ రెండు రోజులుగా సీతారామపురం బిట్-1 గ్రామ సచివాలయంలో వేచిచూసినా పెద్దగా గిరిజనులు రాలేదు. శనివారం సచివాలయానికి వచ్చిన కొంతమందికి ఆధార్ కార్డుల్లో చేర్పులు, మార్పులు చేసి సిబ్బంది వెళ్లిపోయారు.

అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ

సీతారామపురం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారుల ఎత్తు, బరువులను పోషణ్ ట్రాకర్ యాప్‌తో పాటు , రిజిస్టర్లలో తప్పనిసరిగా నమోదు చేయాలని ఐసీడీఎస్ సూపర్వైజర్ షేక్ షాను సూచించారు. ఆమె శనివారం రంగనాయుడుపల్లి, అయ్యవారిపల్లి పూసల కాలనీ, బాలాయపల్లి అంగన్వాడీ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు.

పర్యావరణ పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత



మొక్కలు నాటుతున్న ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు

ఉదయగిరి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత అని మండలంలోని కృష్ణంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సత్తార్‌సాహెబ్ పేర్కొన్నారు. శనివారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా శ్రీపొట్టిశ్రీరాములుకు ఘన నివాళులర్పించారు. పాఠశాల ఆవరణలో వివిధ రకాల మొక్కలు నాటి సంరక్షణ బాధ్యతలు చేపట్టారు. అనంతరం విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి ప్రతిభ కనపర్చిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మన్సూర్‌రోజ్‌దార్, మాలకొండారెడ్డి, శేఖర్, సురేంద్ర, రఫీ, ఓబయ్య, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టాలి



బస్టాండ్ సెంటర్‌లో బ్లీచింగ్ చల్లుతున్న పారిశుధ్య సిబ్బంది

సీతారామపురం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టాలని ఇన్‌చార్జ్ ఎంపీడీవో చంద్రశేఖర్ సూచించారు. మండల కేంద్రంలోని బస్టాండ్ సెంటర్, తోటవీధిలో నిర్వహించిన పారిశుధ్య పనులను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పంచాయతీ రోడ్లపై నీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. డ్రైనేజీలను శుభ్రం చేయించాలని, రోడ్ల పక్క చెత్తాచెదారాలను తొలగించి బ్లీచింగ్ చల్లించాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. రక్షిత నీరును క్లోరినేషన్ చేసి ప్రజలకు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పిడుగు రవీంద్ర, పంచాయతీ సిబ్బంది, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం అందజేత



నగదును అందజేస్తున్న సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు

ఆత్మకూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మున్సిపాల్టీ పరిధిలో ఇటీవల మృతిచెందినవారి కుటుంబ సభ్యులకు శనివారం సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు వారి ఇళ్లకు వెళ్లి ఆర్థిక సాయం అందజేశారు. 2వ వార్డు పరిధిలోని గంధాల అంకమ్మ, 3వ వార్డు పరిధిలో షేక్ ఖాదర్‌బాష, 9వ వార్డులో గీతాల భారతి, రామిశెట్టి సుబ్బారావు, 16వ వార్డులో వాశిలి శివయ్య, 18వ వార్డులోని వెండిపల్లి అంకమ్మ, 19వ వార్డులోని షేక్ సత్తార్‌షా, 22వ వార్డులోని శాసంపూడి లక్ష్మమ్మ, 23వ వార్డులో పరిధిలోని చిర్రా నారాయణరెడ్డి, కొమరగిరి ఆదెమ్మ కుటుంబాలను వారు పరామర్శించి ఒక్కో కుటుంబానికి రూ.10 వేల వంతున ఆర్థిక సహాయాన్ని అందజేశారు.

ట్రాఫిక్ సిగ్నల్స్ వచ్చేశాయ్!

(5వ పేజీ తరువాయి)

పడుతున్నారని తరచూ మీడియా, ప్రచార మాధ్యమాల ద్వారా వస్తున్న వార్తలను పరిగణలోకి తీసుకున్న భారత అత్యున్నత న్యాయస్థానం పట్టణ, నగర ప్రాంతాలలో ట్రాఫిక్ సిగ్నల్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించింది. 2018లో ఈ ఉత్తర్వులు ఆయా ప్రభుత్వాలు జారీ అయ్యాయి. అందులో భాగంగా ఏపీలోనూ పట్టణ, నగర ప్రాంతాల్లో ట్రాఫిక్ సిగ్నల్స్ ఉండాలని సూచనలు జారీ చేశారు. ఈ వ్యవస్థను ఏర్పాటు చేసే నెట్‌వర్కు కంపెనీలతో స్థానికంగా ఉండే మున్సిపాలిటీలు ఒప్పందం చేసుకుని నిధులు కేటాయించాలని అప్పట్లో ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు నెల్లూరులో నిర్వహణ బాధ్యతలను ఎస్పీటీ నెట్‌వర్కుకు అప్పగించారు.

ప్రజల సహకారం ముఖ్యం

నెల్లూరులో ట్రాఫిక్ సిగ్నల్స్ వ్యవస్థ త్వరలో అందుబాటులోకి రానున్నది. ఆ మేరకు వేగంగా పనులు జరుగుతున్నాయి. ఈ సిగ్నల్స్ అందుబాటులోకి వస్తే ప్రజల సహకారం చాలా అవసరం. వారికి కూడా సిగ్నలింగ్ వ్యవస్థపై అవగాహన పెరుగుతుంది. ట్రాఫిక్ నియంత్రణకు మేము సిద్ధంగా ఉన్నాము.

- వెంకటరెడ్డి, ట్రాఫిక్ సీఐ

ఘాట్‌రోడ్డు నిర్మాణానికి అటవీశాఖ అనుమతులు ఇవ్వాలి



సచివాలయం ఎదుట ఆందోళన చేస్తున్న గ్రామస్థులు

ఉదయగిరి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): అసంపూర్తిగా ఉన్న ఉదయగిరి-బండగానిపల్లి ఘాట్ రోడ్డు నిర్మాణానికి అటవీశాఖ అనుమతులు ఇవ్వాలని శనివారం మండలంలోని బిజ్జంపల్లి గ్రామ సచివాలయం ఎదుట సీపీఎం, ఆవాజ్ కమిటీల ఆధ్వర్యంలో పలు గ్రామాల ప్రజలు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా నాయకుడు కాకు వెంకటయ్య మాట్లాడుతూ దశాబ్దాల తరబడి అటవీ అనుమతుల్లేక 3.2 కిలోమీటర్ల మేర రహదారి నిర్మాణం నిలిచిపోవడంతో సుమారు 11 గ్రామాల్లో ప్రజలు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు ఘాట్‌రోడ్డు మొత్తం కోతకు గురైందన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రహదారి నిర్మాణం చేపట్టాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఆవాజ్ కమిటీ మండల అధ్యక్షుడు షేక్ నాయబ్, సభ్యులు ఖాజావలి, సీఐ టీయూ నాయకులు, పలు గ్రామాల ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

రహదారులు, భవనాల నిర్మాణానికి ప్రతిపాదనలు

- పంచాయతీరాజ్ డీఈ మణికుమార్



మాట్లాడుతున్న పంచాయతీరాజ్ డీఈ మణికుమార్

ఉదయగిరి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): నియోకవర్గంలో పలు గ్రామాల్లో రహదారులు, పంచాయతీ కార్యాలయాలు, ఆరోగ్య కేంద్రాల నిర్మాణానికి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ సూచనల మేరకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు పంచాయతీరాజ్ డీఈ సీహెచ్ మణికుమార్ పేర్కొన్నారు. శనివారం స్థానిక కార్యాలయంలో ఆయన విలేఖరులతో మాట్లాడుతూ ప్రధాన మంత్రి గ్రామీణ సడక్ యోజన పథకం-4 కింద నియోజకవర్గంలో తెడ్డుపాడు, గమళ్ల పాళెం, లింగరాజు అగ్రహారం, భీమవరప్పాడు, పొట్టిపల్లి, రేణమాల, గుడినరవ, కొత్తపల్లి, నల్లబోతులవారి కాలనీలో సీసీ, బీటీ రోడ్ల నిర్మాణానికి రూ.20 కోట్లతో ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. అలాగే బ్రహ్మేశ్వరం, వేములపాడు, రామవరప్పాడు, కుమ్మరకొండూరు, శెట్టిపాళెం, ఏ.కిస్తీపురం, దాసరిపల్లి గ్రామాల్లో పంచాయతీ కార్యాలయ భవనాల నిర్మాణానికి రూ.2.24 కోట్లతో ప్రతిపాదనలు పంపామని తెలిపారు. నియోజకవర్గంలో అసపూర్తిగా ఉన్న 15 ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య కేంద్రాల మరమ్మతులకు రూ.2.50 కోట్లతో ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. 15వ ఆర్థిక సంఘం నిధుల కింద పెద్దిరెడ్డిపల్లి, జీ.కొండారెడ్డిపల్లికి రూ.36 లక్షలు, సాయిపేట గ్రామానికి రూ.42 లక్షలతో ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య మందిరాలు మంజూరయ్యాన్నారు.

ఉదయగిరి కేంద్రంగా రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలి



ఇన్‌చార్జి తహసీల్దారుకు వినతిపత్రం అందజేస్తున్న విశ్రాంత ఉద్యోగులు

ఉదయగిరి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఉదయగిరి కేంద్రంగా రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలని తాలుకా పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం ఇన్‌చార్జి తహసీల్దారు షాజియాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ప్రస్తుతం కొత్త జిల్లాలు, రెవెన్యూ డివిజన్ల ఏర్పాటుపై ప్రభుత్వం కసరత్తు చేస్తోందన్నారు. ప్రస్తుతం ఉదయగిరి నియోజకవర్గంలోని మండలాలు మూడు రెవెన్యూ డివిజన్ల పరిధిలో ఉండడంతో ప్రజలు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా రన్నారు. ఈ అవస్థల నుంచి ప్రజలు బయట పడాలంటే ఉదయగిరిని రెవెన్యూ డివిజన్ చేయడమే ఏకైక మార్గమన్నారు. ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ఉదయగిరిని రెవెన్యూ డివిజన్ చేయించాలన్నారు. ఇందు కోసం పార్టీలకతీతంగా ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉదయగిరి తాలుకా పెన్షనర్స్ అసోసి యేషన్ అధ్యక్షుడు ఖాదర్‌బాషా, ప్రధాన కార్య దర్శి నజీర్‌బాషా, కోశాధికారి అబ్దుల్‌రషీద్, సభ్యుడు చెన్నకేశవులు, ఉదయగిరి జిల్లా సాధ న సమితి కమిటీ ప్రధాన కార్యదర్శి దస్తగిరి అహ్మద్, పలువురు విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు.

కీటక జనిత వ్యాధుల నియంత్రణకు చర్యలు



ఆనకట్ట నీటిలో చేపపిల్లలను వదులుతున్న అధికారులు

ఉదయగిరి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గండిపాళెం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలో కీటక జనిత వ్యాధుల నియంత్రణకు చర్యలు చేపట్టినట్లు మలేరియా సబ్ యూనిట్ అధికారి షేక్ నౌషాద్ బాబు పేర్కొన్నారు. ఇందులో భాగంగా శనివారం జిల్లా మలేరియా అధికారిణి హుస్సేనమ్మ ఆదేశాల మేరకు పట్టణంలోని ఆనకట్ట, కోనేరు, హుస్సేన్‌కుంట తదితర ప్రాంతాల్లో వైద్యఆరోగ్య సిబ్బందితో కలిసి గంబూషియా చేప పిల్లలను వదిలారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ చేపలను నీటిలో వదలడం ద్వారా లార్వా దశలోనే దోమల ఉత్పత్తిని అరికట్టవచ్చన్నారు. దోమలు పుట్టకుండా, కుట్టకుండా చర్యలు చేపట్టడంతో పాటు ప్రతిఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించి వ్యాధులకు దూరంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో శివకుమారి, హెచ్‌ఈ వెంకటేశ్వర్లు, వైద్యఆరోగ్య సిబ్బంది చెన్నయ్య, శ్రీనివాసులు, మన్సూర్ తదితరులు పాల్గొన్నారు.

అరుణాచలానికి ఆర్టీసీ ప్రత్యేక బస్సు ఏర్పాటు

ఆత్మకూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమికి అరుణాచలం దర్శించుకునే భక్తుల కోసం ఈనెల 4వ తేదీన ప్రత్యేక సూపర్‌లగ్జరీ బస్సు నడుపుతామని డిపో మేనేజర్ శివకేశ్ యాదవ్ తెలిపారు. మంగళవారం ఉదయం 8 గంటలకు ఆత్మకూరు నుంచి బస్సు బయలు దేరుతుంద న్నారు. భక్తులు సిరిపురం గోల్డెన్ టెంపుల్, అరుణాచలంలో గిరి ప్రదక్షణ, దైవ దర్శనం చేసుకున్న అనంతరం అదేరోజు రాత్రి 7 గంటలకు తిరిగి బస్సు బయలు దేరుతుందని తెలిపారు. ఒకొక్కరికి రానుపోను టికెట్ ధర రూ.1400గా నిర్ణయించామన్నారు. ఆన్‌లైన్ రిజర్వేషన్ సౌకర్యాన్ని కల్పిస్తున్నామని తెలి పారు. పూర్తి వివరాల కోసం 8555929504, 9959225645, 7382924753, నెంబర్లకు ఫోన్ చేసి సంప్రదించాలని కోరారు.

C.R.I.M.E N.E.W.S

దుప్పిని రక్షించిన గ్రామస్థులు



పొలం కంచెలో ఇరుక్కుపోయిన దుప్పి

దుత్తలూరు (ఉదయగిరి), నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నందిపాడు గ్రామ సమీపంలో 565 జాతీయ రహదారిపైకి అటవీ ప్రాంతం నుంచి ఓ చుక్కల దుప్పి వచ్చింది. దానిని వీధి కుక్కలు చూసి వెంటపడడంతో దుప్పి సమీపంలో ఉన్న పొలంలోకి వెళ్లింది. పొలం చుట్టూ కంచె ఏర్పాటుచేసి ఉండడంతో ఎటూ వెళ్లలేక చిక్కుకొంది. గమనించిన గ్రామస్థులు దానిని రక్షించి అటవీ ప్రాంతంలో వదిలారు.

రామాలయంలో చోరీ

వరికుంటపాడు(ఉదయగిరి రూరల్), నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అశోక్‌నగర్ గ్రామానికి చెందిన రామాలయంలో చోరీ జరిగిన సంఘటన శనివారం వెలుగుచూసింది. వివరాల మేరకు.. శుక్రవారం రాత్రి గుర్తుతెలియని దుండగులు తాళాలు పగలగొట్టి ఆలయంలోకి ప్రవేశించారు. అమ్మవారి మెడలోని రూ. 30 వేలు విలువ చేసే రెండు బంగారు మంగళసూత్రాలతోపాటు హుండీని సైతం చోరీ చేశారు. అటుగా వెళ్లిన కొంతమంది గ్రామస్థులు తాళాలు పగలగొట్టి ఉండడాన్ని గమనించి ఆలయంలోకి వెళ్లి పరిశీలించారు. ఇటీవల దక్కనూరు గ్రామం ఆలయంలో సైతం చోరీ జరగడంతో గ్రామాల్లో భయాందోళన నెలకొంది. కాగా, ఈ విషయమై పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు.

రెండు మోటార్‌బైక్‌ల ఢీ

- దంపతులకు గాయాలు

వరికుంటపాడు(ఉదయగిరి రూరల్), నవంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని జడదేవి బస్టాండ్ సెంటర్‌లోని 565 జాతీయ రహదారిపై రెండు మోటార్‌బైక్‌లు ఢీకొనడంతో దంపతులకు గాయాలైన సంఘటన శనివారం చోటుచేసుకొంది. వివరాల మేరకు.. మర్రిపాడు మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన నల్లు తిరుపతయ్య, కొండమ్మ దంపతులు ప్రకాశం జిల్లా పామూరు మండలం ఇర్లపాడులో భూమిని కౌలుకు తీసుకుని సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో స్వగ్రామంలో పింఛన్ నగదు తీసుకొనేందుకు బైక్‌పై వెళుతుండగా బస్టాండ్ సెంటర్‌లో ఉన్న వరికుంటపాడుకు చెందిన వాకా చినజాలయ్య అనే వ్యక్తి తన బైక్‌ను ఒక్కసారిగా ముందుకు కదిలించడంతో రెండు బైక్‌లు ఢీకొన్నాయి. దీంతో దంపతులకు తీవ్ర గాయాలు కావడంతో ఉదయగిరి వైద్యశాలకు తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తీసుకెళ్లారు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ రఘునాథ్ సంఘటనా స్థలాన్ని పరిశీలించడంతోపాటు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అదనపు కట్నం కోసం వేధింపులు

నెల్లూరురూరల్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): తనను అదనపు కట్నం కోసం వేధింపులకు గురి చేస్తున్నారని ఓ మహిళ తన భర్త, అత్తమామలపై ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. రూరల్ సీఐ గుంజి వేణు తెలిపిన వివరాలు మేరకు.. పెద్దచెరుకూరు పరిధిలోని సిరిగార్డెన్స్‌లో నివాసముంటున్న దిద్రాయి కృప సంధ్యకు ఎనిమిదేళ్ల క్రితం అమాస వినయ్‌కుమార్‌తో వివాహమై ప్రస్తుతం ఇద్దరు పిల్లలున్నారు. అప్పట్లో ఇచ్చిన కట్నం, బహుమతులు సరిపోక తాజాగా మరింత అదనపు కట్నం కావాలని ఆమె భర్త వినయ్‌తోపాటు అతని తల్లి సూర్యప్రభ, తండ్రి రఘురామయ్యలు తనను మానసికంగా, శారీరకంగా వేధించడంతో పాటు ఇంటి నుంచి బయటకు గెంటేశారు. దీంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

యువకుడిపై పోక్సో కేసు

నెల్లూరు(క్రైం), నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఓ బాలికను ప్రేమించాలంటూ వేధింపులకు గురిచేస్తున్న యువకుడిపై చిన్న బజారు పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. నగరానికి చెందిన ఓ బాలిక డిప్లమో మొదటి సంవత్సరం చదువుతోంది. ఆమె ఇంటి పక్కనే సాయి నివాసం ఉంటున్నాడు. అతను గత కొంతకాలంగా తనను ప్రేమించాలని బాలిక వెంట పడుతున్నాడు. శుక్రవారం రాత్రి బాలిక ఇంటికి వెళ్లి ఆమె చేయిపట్టుకుని ప్రేమించమని ఒత్తిడి చేశాడు. బాలిక తల్లి అడ్డుకోగా ఆమెను దుర్భాషలాడాడు. ఈ మేరకు బాధిత తల్లి శనివారం చిన్న బజారు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు నిందితుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు.

పొలంలో పని చేస్తూ రైతు మృతి

- వారం రోజుల్లో కొడుకుపెళ్లి
- అంతలోనే విషాదం

మనుబోలు, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): నా కొడుకుపెళ్లి.తప్పక రండి. అని మనుబోలు గ్రామం అంతా పెళ్లి కార్డులు పంచాడు. సాయంత్రానికల్లా పొలంలో శవమై కనిపించాడు రైతు, కల్లుగీత కార్మికుడు కోసూరు శ్రీనువాసులు గౌడ్. శనివారం చోటుచేసుకున్న సంఘటన గ్రామస్తులను కలిచివేసింది. గమళ్లపాళెంలో విషాదం నెలకొంది. స్థానిక కోదండరామపురంలోని గమళ్ళపాళెంకు చెందిన కోసూరు శ్రీనువాసులు గౌడ్ వరిసాగు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఈయనకు భార్య, ఇద్దరు పిల్లలు. కుమార్తెకు పెళ్ళిఅయిపోగా, కుమారుడికి వచ్చే శనివారం పెళ్ళి నిశ్చయించారు. దీంతో పెళ్ళిపనుల్లో బాగంగా పెళ్ళి కార్డులు పంచాడు. తరువాత మధ్యాహ్నం ఇంటినుంచి పొలానికి వెళ్లి సాయంత్రమైనా ఇంటికి రాకపోయేసరికి కుటుంబసభ్యులు, బంధువులు శ్రీనివాసులు కోసం గాలించారు. పొలంలో శ్రీనువాసులు శవమై కనిపించాడు. గుండెపోటుతో చనిపోయి ఉండవచ్చునని రైతులు, గ్రామస్తులు భావిస్తున్నారు. పొలంవద్దనే బంధువులు, సాటి గీత కార్మికులు, రైతులు కన్నీరు మున్నీరుగా విలపించారు.

రైల్లోంచి జారిపడి యువకుడు...

మనుబోలు: మండలంలోని కొమ్మలపూడి -మనుబోలు రైల్వేస్టేషన్ల మధ్య శనివారం రైల్లోంచి గుర్తుతెలియని ఓ యువకుడు (25) జారిపడి మృతిచెందినట్లు రైల్వే ఎస్‌ఐ. హరిచందన తెలిపారు. అప్‌లైన్‌లో 150వ కి.మీ వద్ద 9-11 స్థంభాల మధ్య ఓ యువకుడు చనిపోయి ఉండడాన్ని విధుల్లో ఉన్న కీమెన్ గుర్తించి రైల్వే పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఎస్‌ఐ సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు నమోదు చేసుకున్నారు. మృతుడు సిమెంట్ రంగు ఆఫ్ చొక్కా, నల్లటిరంగు షాట్, ప్యాంటు ధరించి ఉన్నాడు. అంతకు మించి ఎలాంటి ఆనవాలు లభ్యం కాకపోవడంతో గుర్తుతెలియని వ్యక్తిగా కేసు నమోదు చేసుకుని, శవపరీక్షల నిమిత్తం మృతదేహంను నెల్లూరుకు తరలించినట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని..

కొడవలూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వాహనం ఢీకొని మహిళ మృతి చెందిన సంఘటన శనివారం నార్తు రాజూపాళెం గ్రామం వద్ద చోటు చేసుకొంది. పోలీసుల కథనం మేరకు... దగదర్తి మండలంలోని ప్యాట్సన్ పేట గ్రామానికి చెందిన నలబోతుల రవణమ్మ(60), నలబోతుల సుబ్రహ్మణ్యం నెల్లూరులో తన కుమార్తె ఇంటికి వెళ్లి మోటర్ సైకిల్ పై తిరిగి వస్తూండగా నార్తు రాజూపాళెం జాతీయ రహదారి వద్ద గుర్తు తెలియని వాహనం వెనుక నుండి ఢీకొంది. దీంతో వెనుక కూర్చున్న రమణమ్మ వాహనం కింద పడి అక్కడిక్కడే మృతి చెందింది. మోటర్ సైకిల్ సుబ్రహ్మణ్యంకు స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న ఎస్‌ఐ కోటిరెడ్డి గాయపడిన వ్యక్తిని చికిత్స నిమిత్తం 108లో వైద్యశాలకు తరలించారు. జాతీయ రహదారిపై పోలీసులు ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నెల్లూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	137
స్కిన్ చికెన్	246
స్కిన్‌లెస్	270

కోడిగుడ్ల ధర (100): 575

రాళ్లపాడును వేధిస్తున్న సిబ్బంది కొరత

లింగసముద్రం, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ప్రజలు, రైతులకు తాగు, సాగునీటిని అందించే రాళ్లపాడు ప్రాజెక్టులో ఏళ్ల తరబడి సిబ్బంది వేధిస్తోంది. దీంతో ఆయకట్టు రైతులు ఇబ్బందులకు గురవుతున్నారు. ముఖ్యంగా ప్రాజెక్టు పూర్తి సామర్థ్యంతో నిండిన ప్రతిసారీ ఒకరిద్దరు అధికారులను, కొందరు ఎన్ఎంఆర్‌లను తాత్కాలికంగా నియమించుకొని మమ అనిపిస్తున్నారు. దీంతో పైర్ల సాగు సమయంలో నీటి నిర్వహణ సక్రమంగా జరగడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా ప్రాజెక్టుకు వరదలు వచ్చే సమయంలో అధికారులు, సిబ్బంది కొరతతో ఉన్న కొద్దిమంది అధికారులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. కాగా, ప్రస్తుతం ప్రాజెక్టులో ఒక ఈఈ, ఇద్దరు డీఈలు, ఒక అటెండరు మాత్రమే రెగ్యులర్ ఉద్యోగులు. గతంలో కందుకూరు మైనర్ ఇరిగేషన్ శాఖ నుండి ఒక ఏఈని ప్రాజెక్టుపై ఇన్‌చార్జ్ ఏఈగా నియమించారు. అలాగే మొంథా తుపాను నేపథ్యంలో గుండ్లకమ్మ ప్రాజెక్టు నుండి ఇద్దరు ఏఈలను తాత్కాలికంగా నియమించారు. గతంలో బకింగ్‌హామ్ కెనాల్ నుండి ఇద్దరు లస్కర్లను డిప్యూటేషన్‌పై నియమించారు. కాగా, 10 మంది ఏఈలు, 14 మంది లస్కర్లు, 18 ఇతర పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

మాలకొండ ఆదాయం రూ.10,83,617

వలేటివారిపాలెం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాలకొండ మాల్యాద్రి లక్ష్మీనృసింహస్వామికి శనివారం భక్తుల నుండి రూ. 10,83,617 ఆదాయం లభించినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ ఎస్ చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. అష్టోత్తరం టిక్కెట్ల ద్వారా రూ. 16,350, కుంకుమార్చన ద్వారా రూ. 19,240, వివాహముల ద్వారా రూ. 17 వేలు, తలనీలాల ద్వారా రూ. 31,850, వాహన పూజల ద్వారా రూ. 2,840, ప్రత్యేక దర్శనం ద్వారా రూ. 3,55,800, స్థలపురాణం పుస్తకాల విక్రయం ద్వారా రూ. 440, రూము అద్దెలు ద్వారా రూ. 27,990, కవర్లు ద్వారా రూ. 9,085, లడ్డు ప్రసాదం ద్వారా రూ. 2,11,975, అన్నదానం ద్వారా రూ. 3,62,415, విరాళాల ద్వారా రూ. 28,632 ఆదాయం లభించినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ చంద్రశేఖర్ తెలిపారు.

అన్నదానానికి రూ. లక్ష విరాళం



డీసీ చంద్రశేఖర్‌కు విరాళం అందజేస్తున్న మాల్యాద్రినాయుడు దంపతులు

మాలకొండ మాల్యాద్రి లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో అన్నదానానికి శనివారం కందుకూరుకు చెందిన మామిడాల మాల్యాద్రి నాయుడు ఆయన సతీమణి లక్ష్మీకాంతమ్మ లక్ష రూపాయల విరాళం ఇచ్చారు. డిప్యూటీ కమిషనర్ ఎస్ చంద్రశేఖర్‌కు విరాళం అందజేశారు.

అయ్యవారిపల్లెలో పారిశుధ్య పనులు

వలేటివారిపాలెం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అయ్యవారిపల్లెలో పంచాయతీ సర్పంచి డేగా వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో శనివారం ప్రత్యేక పారిశుధ్య పనులు చేపట్టారు. తుఫాన్ ప్రభావంతో ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు గ్రామంలో పారిశుధ్యం పడకేసింది. దీంతో గ్రామంలో వైరల్ జ్వరాలు ప్రబలకుండా ముదస్తుగా పారిశుధ్య పనులు చేపట్టారు వీధుల్లోని మురుగు కాల్వలు, మురుగు నీరు నిల్వ ఉన్న ప్రదేశాలలో బ్లీచింగ్ చల్లించారు. మురుగునీరు నిల్వ లేకుండా చర్యలు పట్టారు. పారిశుధ్య పనులను ఎంపీడీఓ శంకర్‌రావు పరిశీలించారు.

అల్లూరులో ఎంపీ బీద

అల్లూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌రావు శనివారం అల్లూరులో జరిగిన పలు శుభ కార్యాలకు హాజరయ్యారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు రామిశెట్టి కృష్ణచైతన్య నూతన గృహాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో డబుల్ ఇంజన్ ప్రభుత్వం నడుస్తోందని, భవిష్యత్తులో రాష్ట్రానికి అనేక అభివృద్ధి ప్రాజెక్టులు రానున్నాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పలగాటి శ్రీనివాసులు రెడ్డి, బండి శ్రీనివాసులు రెడ్డి, తోట శ్రీహరి, అరగల రమణయ్య, తోట శీనయ్య, మునిరాజా తదితరులు పాల్గొన్నారు.

అమర లింగేశ్వరస్వామి ఆలయ చైర్మన్‌గా వీరగంధం



సత్యన్నారాయణకు అభినందనలు తెలుపుతున్న సర్పంచి బసవయ్య నాయుడు

ఉలవపాడు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మన్నేటికోట అమరలింగేశ్వరస్వామి ఆలయ ధర్మకర్తల మండలి నియామకం శనివారం జరిగిందని ఈవో వీ రంగరాజు తెలిపారు. మన్నేటికోట మాజీ సర్పంచు వీరగంధం సత్యనారాయణను ధర్మకర్తల మండలి చైర్మన్‌గా కందుకూరు డివిజన్ ఇన్‌స్పెక్టర్ జీపీ సత్యన్నారాయణ ఆలయంలో ప్రమాణస్వీకారం చేయించారు. సభ్యులుగా దేవినేని రంగారావు, గొత్తుల క్రిష్టయ్య, మల్లవరపు గోపి, వాసిపల్లి వెంకయ్య, గొత్తుల శ్రావణి, కొండరాజు పద్మ, నాళం అలేఖ్యల చేత ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా సర్పంచు పులివర్తి బసవయ్య నాయుడు, గ్రామస్థులు నూతన చైర్మన్‌ను సన్మానించారు.

నిత్యావసరాల పంపిణీ

జలదంకి, నవంబర్1(ఆంధ్రజ్యోతి): శనివారం మండలంలోని చామదలలో 41 చేనేత కుటుంబాలకు 50 కిలోల బియ్యంతోపాటు నిత్యావసరాలు తహసీల్దార్ ప్రమీలతో కలసి మండల తెలుగుయువత అధ్యక్షుడు మునగాల తిరుమలరెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ కూటమి నాయకులతోపాటు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

శివాలయం నిర్మాణానికి భూమిపూజ

కలిగిరి, నవంబరు1 (ఆంధ్రజ్యోతి): కలిగిరిలో పర్వతవర్ధిని సమేత జానకి రామలింగేశ్వరస్వామి నూతన ఆలయ నిర్మాణానికి గ్రామపెద్దలు, మండల వాసులు శ్రీకారం చుట్టారు. శనివారం ఆలయ ప్రాంగణంలో బాలాలయ నిర్మాణానికి భూమిపూజ కార్యక్రమం నిర్వహించారు.

దివ్యాంగుల కాలనీని వీడని వర్షపు నీరు





దివ్యాంగుల కాలనీలో నిల్వ ఉన్న వర్షపు నీరు

కావలి, నవంబరు1 (ఆంధ్రజ్యోతి): మొంథా తుపాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు ఊళ్లకు ఊళ్లు నీటమునిగాయి. ఈ నేపథ్యంలో వర్షాలు ఆగిపోయినా పట్టణంలోని దివ్యాంగ కాలనీని మాత్రం వర్షపు నీరు వీడడంలేదు. అసలే లోతట్టు ప్రాంతంలో ఉన్న ఈ కాలనీ.. ఇక్కడ రోడ్లు, డ్రైన్లు లేకపోవటంతో జలమయమైంది. వర్షాలు పడితే లోతట్టు ప్రాంతాలు తరచూ మునకకు గురైనప్పటికీ ఆ తర్వాత వాన నీరు బయటికి ప్రవహిస్తుంది. అయితే రైల్వే ట్రాక్ పడమర వైపు ముసునూరులో ఉన్న దివ్యాంగుల కాలనీలో నేటికీ వాననీరు పెద్దఎత్తున నిల్వ ఉంది. కాలనీ నుంచి నీరు బయటకు వెళ్లేందుకు మున్సిపల్ అధికారులు తొలుత కాలువలు తీసి, తర్వాత వాటికి తూములు వేసి మూసివేశారు. అయితే పైపు ద్వారా నీరు బయటకు వెళ్లనీయకుండా దిగవ ప్రాంతం వారు మట్టికట్ట అడ్డు వేయటంతో వరద నీరు అక్కడే నిలిచిపోయింది. దీంతో దివ్యాంగులు ఇళ్ల నుంచి బయటకు వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి నీరు బయటకు వెళ్లేలా వెంటనే ఏర్పాట్లు చేయాలని కాలనీవాసులు కోరుతున్నారు.

పొట్టి శ్రీరాములు త్యాగ ఫలితమే ఆంధ్ర రాష్ట్రావతరణ



కావలిటౌన్ : పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాల వేస్తున్న తటవర్తి రమేష్, తదితరులు

కావలి (టౌన్) నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగ ఫలితమే ఆంధ్ర రాష్ట్ర అవతరణ అని మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు తటవర్తి రమేష్ పేర్కొన్నారు. శనివారం ఆంధ్రరాష్ట్ర అవతరణ దినోత్సవం పురస్కరించుకుని మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో బీపీఎస్ కూడలి ట్రంకురోడ్డులోని పొట్టిశ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘం నేతలు ఓరుగంటి రామకృష్ణ, పాదర్తి నాగరాజు, గాదంశెట్టి మధుసూధన్‌రావు, నల్లూరు చందు, కొండలరావు తదితరులు పాల్గొన్నారు. అలాగే వైసీపీ కేంద్రకమిటీ సభ్యుడు కాటంరెడ్డి విష్ణవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు విగ్రహానికి వైసీపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. వెంగళరావునగర్‌లోని శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి బీ కోటేశ్వరి అధ్యక్షతన రాష్ట్ర అవతరణ దినోత్సవం జరిగింది. పొట్టి శ్రీరాములు చిత్రపటానికి ఆమె పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సామాజిక కార్యకర్త ఎం. మాలకొండారెడ్డి పాల్గొన్నారు.

● అమరజీవికి ఘన నివాళులు

కందుకూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రరాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా శనివారం అమరజీవి పొట్టి శ్రీరాములుకు అధికారులు, వివిధ వర్గాల ప్రజలు ఘనంగా నివాళులర్పించారు. పట్టణంలోని పెద్దబజారులో ఉన్న పొట్టి శ్రీరాములు కాంశ్య విగ్రహం వద్ద ఆర్యవైశ్యులు రా ష్ట్ర అవతరణ దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో చక్కా కేశవరావు, కాకుమాని ప్రవీణ్‌కుమార్, తాతా లక్ష్మీనారాయణ, ఓరుగంటి శివశంకర్, ఇన్నమూరి శ్రీనివాసులు, కోట వెంకటనరసింహం, కోట కిషోర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

● పట్టణ పోలీసుస్టేషన్‌లో....

ఆంధ్రరాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా కందుకూరు పట్టణ పోలీసుస్టేషన్‌లో అమరజీవి పొట్టి శ్రీరాములుకు ఘనంగా నివాళులర్పించారు. సీఐ అన్వర్‌బాషా, పట్టణ ఎస్‌ఐ శివనాగరాజు, పోలీసుసిబ్బంది అమరజీవి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే స్థానిక టీఆర్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ షేక్ నాగూర్‌వలీ ఆధ్వర్యంలో అధ్యాపకులు అమరజీవి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

● ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవం

ఉలవపాడు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రరాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని ఉలవపాడులో ఆర్యవైశ్య సంఘం నాయకుల ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక పొట్టి శ్రీ రాములు విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య నాయకులు బానపల్లి సుబ్రహ్మణ్యం, పొన్నూరు రామాంజనేయులు, మేడా అర్జున్ కుమార్, దివ్యానంద గుప్తా తదితరులు పాల్గొన్నారు.



కందుకూరు : పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్య నాయకులు

అర్హులందరికీ ఎన్టీఆర్ భరోసా అందచేయడమే లక్ష్యం

బిట్రగుంట, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ ఎన్టీఆర్ భరోసా అందచేయడమే లక్ష్యంగా టీడీపీ ప్రభుత్వం పని చేస్తున్నదని పార్టీ మండల కన్వీనర్ నాగేశ్వరరావు అన్నారు. బోగోలు మండలంలోని 16 పంచాయతీలో శనివారం పెన్షన్ల పంపిణీ చేశారు. విశ్వనాథరావుపేట, కొత్తూరు గ్రామాల్లో జరిగిన కార్యక్రమంలో ఎంపీడీవో సుబ్రహ్మణ్యం, పంచాయతీ కార్యదర్శి జాలయ్య, మండల ప్రధాన కార్యదర్శి సుధీర్‌బాబు, ముస్లీం మైనార్టీ మండల అధ్యక్షులు అహ్మద్‌బాషా, తదితరులు ఉన్నారు.

దగదర్తి (బిట్రగుంట): ఎన్టీఆర్ భరోసా పించన్ల పంపిణీలో ఎంపీడీవో వెంకటేశ్వర్లు, మండల టీడీపీ నాయకుడు వడ్డే శ్రీకాంత్ నాయుడు, పంచాయతీ కార్యదర్శి మయూరి, టీడీపీ నేతలు వీ వినయ్‌కుమార్, కే. వెంకట సురేష్, కే. వెంకటేశ్వర్లు, అవినాష్‌చౌదరి, ముప్పా క్ర, తరుణ్, జీ.వికాస్, జీ.భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

జలదంకి: మండలంలో శనివారం ప్రభుత్వ సిబ్బంది ఉదయాన్నే ఇంటింటికీ వెళ్లి సామాజిక పింఛన్లు అందించారు. జలదంకిలో ఎంపిటిసి కుట్టుబోయిన మాదవరావు, తెలుగు యువత నాయకులు వి.మహేంద్రరెడ్డి, మారిబోయిన నారాయణలు ఫించను నగదు అందజేశారు. తిమ్మసముద్రంలో మండల టీడీపీ ఉపాధ్యక్షుడు కంచర్ల వినోద్‌నాయుడు ఫించన్ల పంపిణీలో ప్రభుత్వ సిబ్బందితో పాల్గొని ఫించను నగదును అందించారు.

కొండాపురం: పింఛన్ల పంపిణీ శనివారం మండలంలో 90 శాతం పూర్తయినట్లు ఎంపీడీవో ఆదినారాయణరావు తెలిపారు. వృద్ధాప్య, వితంతు, దివ్యాంగ పింఛన్ లబ్ధిదారులు మొత్తం 5400 మంది ఉండగా, 4860 మందికి శనివారం పంపిణీ చేశామన్నారు. మిగిలినవారికి సోమవారం పంపిణీ చేస్తామని తెలిపారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

ఉలవపాడు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన వర్షాలకు వ్యాధులు ప్రబలే అవకాశాలు ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కరేడు పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ అనిల్‌కుమార్ సూచించారు. శనివారం తిరుపతి కుంట కాలనీవాసులకు సీజనల్ వ్యాధులపై సిబ్బందితో కలిసి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైద్యఆరోగ్య సిబ్బంది శ్రీనివాసరావు, ఏఎన్ఎం శోభ, ఎంఎల్‌హెచ్‌పీ మణెమ్మ, ఆరోగ్య కార్యకర్త అల్తాఫ్ తదితరులు పాల్గొన్నారు.

భారీ వర్షాలతో పంటలకు అపార నష్టం

జలదంకి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలో భారీ వర్షాల ధాటికి మెట్టపైర్లు మినుము, పెసర పంటలు ఉరకెత్తాయి. వారం పాటు ఎడతెరిపిలేని వర్షాలు పడడంతో మండలంలోని గట్టుపల్లి, కేశవరం, అన్నవరం, చినక్రాక, వేములపాడు, కేశవరం, రామవరప్పాడు, చోడవరం పంచాయతీలలో రైతులు సాగు చేసిన మెట్టపంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. రాష్ట్ర, కేంద్రప్రభుత్వాలు పంటనష్టం పరిహారం అందించాలని రైతులు వేడుకుంటున్నారు.

విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు

కందుకూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా శనివారం స్థానిక జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మండలస్థాయి వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో 52 మంది విద్యార్థులు పాల్గొనగా విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఎం. నరసింహమూర్తి, ఉపాధ్యాయులు రమణయ్య, పి. ప్రసాదరావు, ఎస్. మాధవరెడ్డి, సీఆర్‌ఎం టీచర్ ఎంపీ రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'అగ్నిప్రమాదాల నియంత్రణ పరికరాలు తప్పనిసరి

కావలి రూరల్, (ఆంధ్రజ్యోతి): పాఠశాలలు, కళాశాల బస్సుల్లో అగ్నిప్రమాదాల నియంత్రణ పరికరాలు తప్పనిసరి అని ఆర్టీవో మురళీధర్ పేర్కొన్నారు. కావలి మండలం రుద్రకోటలోని ఆర్టీవో కార్యాలయంలో శనివారం పాఠశాలల, కళాశాలల యాజమాన్యాలతో అగ్నిప్రమాదాల నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కార్యక్రమం జరగ్గా, ఆయన మాట్లాడారు.

భక్తులకు మెరుగైన వసతులు : ఎమ్మెల్యే ఇంటూరి



మాలకొండలో మరుగుదొడ్ల నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న కందుకూరు ఎమ్మెల్యే నాగేశ్వరరావు

వలేటివారిపాలెం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మాలకొండ మాల్యాద్రి లక్ష్మీనృసింహస్వామి దర్శనానికి వచ్చే భక్తులకు మెరుగైన వసతులు కల్పించడమే ప్రధాన ధ్యేయం అని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు అన్నారు. మాలకొండలో అన్నదాన సత్రం పక్కన రూ. 7,05440తో నిర్మించనున్న మరుగుదొడ్లకు శనివారం ఆయన భూమిపూజ చేశారు. అంతకుముందు కొండకింద మొక్కలు నాటిన అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయ పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. దూరప్రాంతాల నుండి దర్శనానికి వచ్చే భక్తులు ఎలాంటి అసౌకర్యాలకు గురికాకుండా మెరుగైన వసతులు కల్పించాలని, నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ కమిషనర్ చంద్రశేఖర్, మండల టీడీపీ అధ్యక్షుడు మాదాల లక్ష్మీనరసింహం, మాలకొండ దేవస్థానం మాజీ చైర్మన్ చెరువుపల్లి మాల్యాద్రి, కామినేని అశోక్, కూడలి భాస్కర్‌రావు, యల్లంపల్లి భరత్, పంది లక్ష్మీనరసింహం, చొప్పర రాఘవులు తదితరులు పాల్గొన్నారు.

● పింఛన్ల పంపిణీ

మండలంలోని అయ్యవారిపల్లెలో శనివారం ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఎన్టీఆర్ భరోసా పింఛన్లను పంపిణీ చేశారు. గ్రామంలోని వృద్ధులు, వితంతువులు, దివ్యాంగుల ఇళ్లకు వెళ్లి నగదును అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు మాదాల లక్ష్మీనరసింహం, ఎంపీడీఓ శంకర్‌రావు, గ్రామ పార్టీ అధ్యక్షుడు మంచాల మల్లికార్జునరావు, సర్పంచ్ డేగా వెంకటేశ్వర్లు, నాయకులు యల్లంపల్లి భరత్, పాలేటి రవి, మంచాల మాలకొండ్రాయుడు, ఆవుల నరేష్, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక



రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ వాలీబాల్, హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైన చాకిచర్ల విద్యార్థులు

ఉలవపాడు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ అండర్-17 పోటీలకు మండలంలోని చాకిచర్ల జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఏ జనార్దన్ తెలిపారు. ఒంగోలు డీఆర్ఆర్ఎం మున్సిపల్ హైస్కూల్‌లో జరిగిన అండర్-17 బాలుర వాలీబాల్ జట్టు ఎంపికలో పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న వాయిల మహేష్, బసంగారి రాజేష్ ఎంపికయ్యారు. అదేవిధంగా ఏబీఎం జూనియర్ కళాశాలలో జరిగిన హ్యాండ్ బాల్ అండర్-17 జిల్లా జట్టుకు 10వ తరగతి విద్యార్థి సూరగాని గోకుల్ చంద్ ఉమ్మడి ప్రకాశం హ్యాండ్‌బాల్ జట్టుకు ఎంపికయ్యాడని వ్యాయామ ఉపాధ్యాయుడు ఓగుబోయిన శ్రీనివాసులు తెలిపారు. ఈనెలలో రాజమండ్రి, తెనాలిలో జరగబోవు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. క్రీడల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను శనివారం పాఠశాల తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ శ్రీరాయి వెంకటసుధాకర్, ఉపాధ్యాయులు, గ్రామపెద్దలు, తోటి విద్యార్థులు అభినందించారు.

ఎమ్మెల్యే కాకర్ల ఆర్థిక సాయం



హజరత్‌కు నగదును అందజేస్తున్న టీడీపీ నాయకులు

కొండాపురం, నవంబరు1(ఆంధ్రజ్యోతి): మండలంలోని గొట్టిగుండాలకి చెందిన మండల ఎస్సీసెల్ ఉపాధ్యక్షుడు పదర్ల హజరత్ కొంతకాలంగా కిడ్నీ సమస్యతో బాధపడుతున్నాడు. ఇటీవల కురిసిన వర్షాలకు ఇంటి పైకప్పునుండి నీరు కారుతుండటంతో కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఆ కుటుంబం తలదాచుకోవాల్సివచ్చింది. ఈవిషయాన్ని తెలుసుకున్న ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ తన ట్రస్టు ద్వారా రూ. 20 వేల తక్షణ ఆర్థిక సాయాన్ని ప్రకటించగా, మండల టీడీపీ నాయకులు శనివారం ఆ నగదును బాధితుడు హజరత్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ నాయకులు పోలినేని చంద్రబాబు నాయుడు, యారవ క్రిష్టయ్య, డీ రామమోహన్, అల్లిక మధు, తిరుపాల్‌రెడ్డి, పద్మారెడ్డి, రవీంద్రారెడ్డి, నర్సారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాయితీపై యూరియా పంపిణీ

కొండాపురం, నవంబరు1(ఆంధ్రజ్యోతి): మండలంలోని గరిమెనపెంట సొసైటీ పరిధిలోని రైతుసేవా కేంద్రంలో రాయితీపై యూరియాను సొసైటీ అధ్యక్షుడు అల్లిక మధు ఆధ్వర్యంలో ప్రజాప్రతినిధులు శనివారం పంపిణీ చేశారు. మార్కెట్‌లో ధర అధికంగా ఉండటంతో ప్రభుత్వం రాయితీపై రూ. 267కే రైతులకు యూరియాను అందజేస్తోందన్నారు. సొసైటీ పరిధిలోని గ్రామాలకు చెందిన రైతులకు 400 బస్తాల యూరియా పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో నెల్లూరు పార్లమెంటు అధికార ప్రతినిధి యారవ క్రిష్టయ్య, మండల టీడీపీ కో ఆర్డినేటర్ పోలినేని చంద్రబాబునాయుడు, డీ రామమోహన్, వేమిరెడ్డి నరసారెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

● అధిక వాడకం వల్ల నష్టమే!

బిట్రగుంట,నవంబరు1 (ఆంధ్రజ్యోతి): అధికంగా యూరియా వాడకం వల్ల రైతుకు నష్టమేనని మండల వ్యవసాయ అధికారిణి బీ శైలజ అన్నారు. బోగోలు మండల వ్యవసాయ కార్యాలయంలో అల్లిమడుగు, కోవూరుపల్లి పంచాయతీలకు చెందిన రైతులకు శనివారం భూసార పరీక్షలపై అవగాహన కల్పించారు. యూరియా అధికంగా వాడటం వల్ల నేల చౌడుగా మారే ప్రమాదం ఉందని, పైరుకు చీడపీడల బెడద ఎక్కువగా ఉంటుందన్నారు.

క్రీడా స్ఫూర్తితో మెలగడమే అసలైన గెలుపు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఆర్డీవో వంశీకృష్ణ

కావలి (టౌన్), నవంబరు 1(ఆంధ్రజ్యోతి): గెలుపోటములు సహజమని, క్రీడా స్ఫూర్తితో మెలగడమే అసలైన గెలుపు అని ఆర్డీవో వంశీకృష్ణ పేర్కొన్నారు. శనివారం స్థానిక జేబీ డిగ్రీ కళాశాల డీఆర్ క్రీడా ప్రాంగణంలో విశ్వోదయా డీఆర్ బాలల దినోత్సవ క్రీడలు ప్రారంభమయ్యాయి. విశ్వోదయా రెక్టార్ దొడ్ల వినయ్‌కుమార్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కావలి ఆర్డీవో చిన్ని వంశీకృష్ణ హాజరయ్యారు. ముందుగా ముందుగా క్రీడాకారులను పరిచయం చేసుకుని పోటీలు ప్రారంభించారు. క్రీడాపరంగా మౌలిక సదుపాయాలు ఇక్కడ ఉండడం గర్వకారణమని, క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పరుగు పందెం పోటీలు ప్రారంభించి విజేతలకు మెడల్స్, బొకేలతో అభినందించారు. మూడు రోజుల పాటు జరిగే ఈ పోటీల్లో దాదాపు 300 మంది క్రీడాకారులు పాల్గొంటున్నారని, విజేతలకు నవంబర్ 14న బాలల దినోత్సవ సభలో బహుమతులు ప్రదానం చేస్తారని జేబీ వీడీ ప్రసాద్ రెడ్డి తెలిపారు. కార్య నిర్వాహకులు రామ్ సెంటర్ చైర్మన్ దొడ్ల మనోహర్ రెడ్డి, డైరెక్టర్ తాతిరెడ్డి, జేబీ సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సుల డైరెక్టర్ ఆర్ మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

చెరువులు, కాలువల మరమ్మతులకు ప్రతిపాదనలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి

కావలి,నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): జలవనరులశాఖ పరిధిలోని చెరువులు, కాలువలు, 316 చోట్ల దెబ్బతినగా, పునరుద్ధరణకు రూ. 2832.26 లక్షలతో ప్రతిపాదనలను కలెక్టర్‌కు పంపించామని ఎమ్మెల్యే దగుమాటి క్రిష్ణారెడ్డి తెలిపారు. శనివారం జలవనరులశాఖ, సోమశిల అధికారులు, రైతులతో ఎమ్మెల్యే కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. తుఫాన్ ప్రభావాన్ని సమర్థవంతంగా ఎదుర్కొని రైతులకు ఎలాంటి నష్టం కలగకుండా చేసిన అధికారులను ఎమ్మెల్యే అభినందించారు. చెరువులకు పుష్కలంగా నీరు రావటంతో రెతులు సంతోషంగా ఉన్నారన్నారు.

అయ్యప్ప పూజలో.. : పట్టణంలోని కలుగోళమ్మపేటలోని టీడీపీ లీగల్‌సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పొట్లూరు శ్రీనివాసులు నివాసంలో శనివారం ఉదయం అయ్యప్ప పడి పూజ జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

జాతీయ స్థాయి క్రీడలకు శ్రీచైతన్య విద్యార్థుల ఎంపిక

కావలి (టౌన్) నవంబరు 1(ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి అండర్ -19 స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అథ్లెటిక్స్ క్రీడా పోటీలకు కావలి శ్రీ చైతన్య జూనియర్ కళాశాల విద్యార్థులు ఎంపికయ్యారు. శనివారం స్థానిక పాతూరు కళాశాలలో ప్రిన్సిపాల్ లుకోధర్ అధ్యక్షతన క్రీడాకారులకు అభినందన కార్యక్రమం జరిగింది. ఇటీవల పశ్చిమ గోదావరి జిల్లా పెదవేగిలో జరిగిన ఎస్‌జీఎఫ్ అండర్ 19 రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో బాలికల హామర్‌త్రోలో పాల్గొన్న సీహెచ్ లక్ష్మీప్రియ ప్రథమ, పీవీ లక్ష్మీ ప్రసన్న ద్వితీయ స్థానాల్లో నిలిచారన్నారు. బాలుర విభాగం పోల్ వాల్ట్‌లో ఎన్ రాజేంద్ర, హేమర్‌త్రోలో హేమంత్ తృతీయ స్థానాలు సాధించారు. కరస్పాండెంట్ శ్రీకర్ల వెంకయ్య, డైరెక్టర్‌లు పీవీఎస్ ప్రసాద్, ఎం కొండయ్య, నందనం మధుసూదన్‌రావులు విద్యార్థులతో పాటు ఫిజికల్ డైరెక్టర్లు జీవన్‌కుమార్, వెంకటేశ్వర్లను అభినందించారు.

టిడ్కో గృహ సముదాయంలోని సమస్యలపై బీజేపీ నేత ఆగ్రహం

కావలి (టౌన్) నవంబరు 1(ఆంధ్రజ్యోతి): స్థానిక మద్దూరుపాడులోని టిడ్కో గృహ సముదాయంలో సమస్యల పట్ల బీజేపీ రాష్ట్ర సహ కోశాధికారి కందుకూరి సత్యనారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం బీజేపీ నాయకులతో కలిసి కందుకూరి టిడ్కో గృహ సముదాయంలో పర్యటించారు. సముదాయంలో వర్షపునీరు నిల్వ ఉండడంతో పాటు, పరిసరాలు దుర్భరంగా మారాయన్నారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో ప్రధాని మోదీ టిడ్కో గృహాలను నిర్మించారని, అయితే రాష్ట్ర ప్రభుత్వాల నిర్వహణ సరిగా లేనందువల్లే ఈ దుస్థితి ఏర్పడిందన్నారు. దుర్వాసనతో కూడిన కంపోస్ట్ మట్టిని తోలడం మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ సీవీసీ సత్యం తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరా నిలిపివేయడం అన్యాయం

కందుకూరు, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బీఎస్ఎన్ఎల్ షాపింగ్ కాంప్లెక్స్‌కు విద్యుత్ అధికారులు ఎటువంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా విద్యుత్ సరఫరా నిలిపివేయటం అన్యాయమని వైసీపీ నాయకులు గంగిరెడ్డి, రఫీ, బ్రహ్మానందం, వల్లూరి కోటేశ్వరరావు, ఉప్పుటూరి నాగేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో విమర్శించారు. ఈ కాంప్లెక్స్ వ్యవహారం కోర్టులో కేసు నడుస్తుండగా తీర్పుతో నిమిత్తం లేకుండా విద్యుత్‌శాఖ అధికారులు ఇలాంటిచర్యలకు పాల్పడటం సమంజసం కాదన్నారు.

రాయితీపై పశుదాణా పంపిణీ

అల్లూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : తుఫాన్ ధాటికి ఇబ్బందులు పడిన రైతులకు రాయితీపై పశు దాణా పంపిణీ చేస్తున్నట్లు జిల్లా పశువైద్యాధికారి రమేష్ నాయక్ తెలిపారు. శనివారం అల్లూరు మండలం ఇస్కపల్లిలో రైతులకు పశువుల దాణా పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అల్లూరు మండలంలోని ఇస్కపల్లి గ్రామ రైతులకు ఈ అవకాశాన్ని కల్పించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇస్కపల్లి ప్రాంత పాడి రైతుల కోసం 9.5 టన్నుల దాణా, 50 కిలోల బ్యాగ్‌ను 50 శాతం రాయితీ కల్పించి రూ.555కు రైతులకు అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచి పాటి రంజిత్, వార్డు సభ్యుడు రవ్వా హరికుమార్, పాపనబోయిన జగన్, అల్లూరు ఏడి మహేశ్వరయ్య, ఇస్కపల్లి పశువైద్యాధికారి అబ్దుల్ రహీం పాడి రైతులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కందుకూరు, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఓవీ రోడ్డులో రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్నందున 11కేవీ ఎంఆర్‌ఓ ఆఫీసు ఫీడర్‌లో ఆదివారం ఉదయం 9.30 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్ ఎఈఈ టీవీ నరసింహం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఫీడర్ పరిధిలోని సుల్తాన్‌మొహిద్దీన్ హాస్పటల్ ఏరియా, సంతోష్‌నగర్, మక్కామసీదు ఏరియా, ఎమ్మార్వో ఆఫీసు ఏరియా, బూడిదపాలెం, పాతబ్యాంకు బజారు, కోటకట్ట వీధి, అన్నా క్యాంటీన్ ఏరియా, పెద్దబజారులకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని తెలిపారు.



యూరియాకు ప్రత్యామ్నాయం
కారాకొల్లు కషాయం

SUNDAY SPECIAL

'యూరియా కోసం రైతుల పడిగాపులు'.., 'యూరియా కొరత'.., 'యూరియా ఇవ్వలేదని నిరసన'.. ఇటీవల మన రాష్ట్రంలో ఎటు చూసినా కనిపించిన దృశ్యాలు ఇవి. వరిలో అధిక దిగుబడి సాధించాలనే కోరిక యూరియా కోసం రైతులు ఎగబడేలా చేస్తోంది. నిజానికి రసాయన ఎరువుల వల్ల భూమి గుల్లవుతోంది. కలుపు పెరిగిపోయి దాన్ని సంహరించడానికి మళ్లీ ప్రమాదకరమైన మందులను చల్లుతున్నారు. అన్నంపెట్టే నేలలో విషం కలిపి పంటలు పండిస్తున్నారు. జబ్బులు ఇబ్బడి ముబ్బడిగా పెరగడానికి ఇటువంటి ఆహారమే కారణమని నిపుణులు ఆందోళన ప్రకటిస్తున్నా వ్యవసాయంలో తీరు మారడం లేదు. సేంద్రియం, ప్రకృతి వ్యవసాయం అని ఎందరు మొత్తుకుంటున్నా అలవాటుపడిన ఎరువులకీ, మందులకే రైతులు మొగ్గు చూపుతున్నారు. ఎరువుల కోసం ఎగబడుతున్నారు. వీటికి ప్రత్యామ్నాయ మందులను కనుగొన్నారు తిరుపతి జిల్లా కారాకొల్లు గ్రామీణ శాస్త్రవేత్తలు. మన చుట్టూ పెరిగేపిచ్చిమొక్కలపై దశాబ్దాలుగా వీరు చేస్తున్న పరిశోధనలు ఫలించాయి. వరికి పోషకాలను అందించే కషాయాన్ని, కలుపును నివారించే మందునూ, వేరుపురుగును అడ్డుకునే ఆకుపసరు మందునూ వీరు తయారు చేశారు. ఆంధ్ర, తెలంగాణ రైతులు వేలాది ఎకరాల్లో ప్రస్తుతం వీటిని వినియోగిస్తున్నారు. ప్రభుత్వం ప్రోత్సహిస్తే ఈ మందులు రైతులకు వరంగా మారడమే కాదు, మనకు అన్నంపెట్టే నేల ఆరోగ్యాన్ని కాపాడుతాయి.

- 6వ పేజీలో



చిన్నారుల ప్రదర్శనలను ఆసక్తిగా తిలకిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

వేడుకగా బాలోత్సవం

తిరుపతి నగరంలో బాలోత్సవం సందడి మొదలైంది. చిత్రవిచిత్రమైన వేషాల్లో తిరిగే పిల్లలు, వారి వెంట తల్లిదండ్రులు, టీచరు.. బాలల నృత్యాలు, ఉపన్యాసాలు, కథలు చెప్పే పిల్లలు.. గోవిందరాజస్వామి కళాశాల ప్రాంగణం శనివారం ఉదయం నుంచి కళకళలాడింది. కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ ప్రారంభించిన నాలుగో బాలోత్సవం వేడుకలు ఆదివారం కూడా జరుగుతాయి. 75 విభాగాల్లో మూడు స్థాయిల్లో జరిగే పోటీలకు దాదాపుగా 10 వేల మంది పిల్లలు హాజరుకానున్నారు.

- తిరుపతి కల్చరల్, ఆంధ్రజ్యోతి












షార్ చరిత్రలో ముందడుగు

- మరో కీలక ఘట్టానికి కౌంట్‌డౌన్ ప్రారంభం
- నింగిలో ప్రయాణానికి ఎల్వీఎం3-ఎం5 సిద్ధం



సీఎంఎస్-03 ఉపగ్రహం

నింగిలోకి ఎగిరేందుకు సిద్ధంగా ఉన్న ఎల్వీఎం3-ఎం5 రాకెట్

సూళ్లూరుపేట, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఇస్రో మరో చారిత్రక విజయం నమోదుకు సిద్ధమైంది. అత్యంత బరువైన ఉపగ్రహ ప్రయోగానికి షార్ తొలిసారిగా సిద్ధమైంది. ఇందుకు సంబంధించి కౌంట్‌డౌన్ శనివారం సాయంత్రం ప్రారంభమైంది. పూర్తి స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన సీఎంఎస్-03 (జీశాట్-7ఆర్) కమ్యూనికేషన్ ఉపగ్రహాన్ని ఎల్వీఎం3-ఎం5 రాకెట్ ద్వారా షార్ నుంచి ఆదివారం సాయంత్రం 5.26 గంటలకు ప్రయోగించేందుకు శాస్త్రవేత్తలు సర్వం సిద్ధం చేశారు. పీఎస్ఎల్వీ రాకెట్‌ను నాలుగు దశల్లో ప్రయోగిస్తే తాజా రాకెట్‌ను మూడు దశల్లోనే ప్రయోగించనున్నారు. కమ్యూనికేషన్ అవసరాలను తీర్చడంలో ఇది కీలకపాత్ర పోషిస్తుంది. అంతేకాదు పౌర, వ్యూహాత్మక, నావికా సేవలను అందించనుంది. తాజా ప్రయోగానికి సంబంధించిన కౌంట్‌డౌన్ శనివారం సాయంత్రం 5.26 గంటలకు మొదలైంది. 24 గంటల తర్వాత షార్‌లోని రెండో ప్రయోగ వేదిక నుంచి నింగిలోకి దూసుకెళ్లనుంది. ఇప్పటి వరకు షార్ నుంచి 102 ప్రయోగాలు చేపట్టారు. ఇది 10వ ప్రయోగం.

మూడు దశల్లో ప్రయోగం..

43.5 మీటర్ల ఎత్తు 642 టన్నుల బరువు కలిగిన ఎల్వీఎం3-ఎం5 రాకెట్‌ను మూడు దశల్లో ప్రయోగిస్తారు. మొదటి దశలో స్ట్రాపాన్ బూస్టర్లలో ఉండే 400 టన్నుల మన ఇంధన సాయంతో మండించి మొదటి దశ 105 సెకన్లలో పూర్తి చేస్తారు. అక్కడ నుంచి రెండో దశలో 110 టన్నుల ద్రవ ఇంధనాన్ని మండించి 304.70 సెకన్లకు రెండో దశను పూర్తి చేస్తారు. కీలక దశ క్రయోజనిక్ దశను (మూడో) 95.54 సెకన్లకు మూడో దశను పూర్తిచేస్తారు. మూడో దశ అనంతరం రాకెట్ శిఖర భాగాన ఉన్న ఉపగ్రహాన్ని 965.94 సెకన్లకు కక్ష్యలోకి చేరవేస్తుంది.



చెంగాళమ్మ ఆలయంలో పూజకు వెళ్తున్న ఇస్రో నారాయణన్, షార్ డైరెక్టర్ పద్మకుమార్ తదితరులు

ఇస్రో చరిత్రలో ముఖ్యమైన ప్రయోగం

మనదేశ అంతరిక్ష కార్యక్రమం ఎల్వీఎం3-ఎం5 సీఎంఎస్-03 ఉపగ్రహ ప్రయోగంతో ముఖ్యమైన మైలురాయిని చేరుకోనుందని ఇస్రో చైర్మన్ నారాయణన్ అన్నారు. శనివారం ఆయన ఎల్వీఎం3-ఎం5 రాకెట్ ప్రయోగం విజయవంతం కావాలని సూళ్లూరుపేటలోని చెంగాళమ్మ ఆలయంలో పూజలు చేశారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడారు. వచ్చే మార్చిలోగా ఏడు ప్రయోగాలు ఉంటాయన్నారు. ఆయనతో పాటు షార్ డైరెక్టర్ పద్మకుమార్, ఎంఎస్ఏ డీడీ గోపికృష్ణ తదితరులు ఉన్నారు.

రేపు కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్

- మీకోసం కాల్ సెంటర్ 1100ను సద్వినియోగం చేసుకోండి

తిరుపతి(కలెక్టరేట్), నవంబరు 1(ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)ను నిర్వహిస్తామని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జరిగే ఈ కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు పాల్గొంటారని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మీకోసం కాల్ సెంటర్ 1100 సేవలను ఉపయోగించుకోవాలన్నారు. వినతులకు సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి ఈ నంబర్‌కు కాల్ చేయవచ్చని వివరించారు. అలాగే మీకోసం.ఏపీ.జీవోవి.ఇన్ వెబ్‌సైట్‌లో పంట నమోదు చేసుకోవచ్చని తెలిపారు.

ఈనెలా కందిపప్పు లేనట్లే!

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 1(ఆంధ్రజ్యోతి): రేషన్ కార్డుదారులకు ఈనెలలో కూడా కందిపప్పు ఇచ్చే పరిస్థితి కనిపించడం లేదు. జిల్లాలోని 5.85 లక్షల తెల్ల రేషన్ కార్డుదారులకు ప్రతినెలా 81,230 టన్నుల బియ్యం, 510 టన్నుల చక్కెర, 420 టన్నుల కందిపప్పు పంపిణీ చేయాల్సి ఉంది. బియ్యం, చక్కెర పంపిణీ చేస్తున్న ప్రభుత్వం కందిపప్పు విషయానికి వచ్చేసరికి మొండిచేయి చూపుతోంది. బహిరంగ మార్కెట్‌లో కందిపప్పు నాణ్యతను బట్టి కిలో రూ.140 నుంచి 160 వరకు పలుకుతోంది. దీంతో కార్డుదారులు రేషన్ షాపుల్లో ఇచ్చే రాయితీ కందిపప్పు కోసం ఎదురు చూస్తున్నారు. తొమ్మిది నెలలుగా ప్రభుత్వం అదిగో ఇదిగో అంటూ కాలం గడుపుతుండటంతో అసంతృప్తికి గురవుతున్నారు. టెండర్ల ప్రక్రియలో జాప్యం జరుగుతోందని అధికారులు అంటున్నారు.

నేడు మాడవీధుల్లోకి ఉగ్రశ్రీనివాసమూర్తి

తిరుమల, నవంబరు1(ఆంధ్రజ్యోతి): కైశిక ద్వాదశి సందర్భంగా ఉగ్రశ్రీనివాసమూర్తి ఆదివారం ఆలయ మాడవీధుల్లో ఊరేగనున్నారు. ఈ సందర్భంగా సాలకట్ల కైశిక ద్వాదశి ఆస్థానాన్ని టీటీడీ నిర్వహించనుంది. ఉగ్రశ్రీనివాసమూర్తిని శ్రీదేవి, భూదేవి సమేతంగా ఏడాదిలో ఒక్కసారే ఈ రోజున సూర్యోదయానికి ముందు మాడవీధుల్లో ఊరేగిస్తారు.

పింఛన్ల పంపిణీలో ఫస్ట్ ప్లేస్

- 2,51,100 మందికి రూ.107.76కోట్ల పంపిణీ



ఆర్సీపురం ఎస్టీకాలనీలో పింఛన్ పంపిణీ చేస్తున్న తిరుపతి ఆర్డీవో రామ్మోహన్

తిరుపతి(కలెక్టరేట్), నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ సామాజిక భద్రతా పింఛన్ల పంపిణీలో జిల్లాకు మొదటి స్థానం దక్కింది. శనివారం రాత్రి 7.30గంటల వరకు 2,62,556మందికి గాను 2,51,100 మందికి రూ.107.76 పంపిణీ చేసినట్లు డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు, ఏపీడీ ప్రభావతి వెల్లడించారు. జిల్లాలోని 34 మండలాల్లో ఉదయం 7 గంటల నుంచి సచివాలయ ఉద్యోగులు ఇంటింటికీ వెళ్లి వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలకు పింఛన్లు పంపిణీ చేశారు. అక్టోబరు నెలకు సంబంధించి పలు మున్సిపాలిటీలు, మండలాల్లో ఉదయం 10 గంటల తర్వాత పింఛన్లు పంపిణీ చేసిన సచివాలయ ఉద్యోగులకు కలెక్టర్ షోకాజ్ నోటీసులు జారీ చేసిన నేపథ్యంలో ఈ నెలలో సకాలంలో పంపిణీ చేశారు.

టీటీడీ ఏవీఎస్వో కళావతి బదిలీ

తిరుమల, నవంబరు1(ఆంధ్రజ్యోతి): టీటీడీ తిరుపతి విజిలెన్స్ వింగ్ ఏవీఎస్వో కళావతి బదిలీ అయ్యారు. కొన్నేళ్లుగా ఈమె విజిలెన్స్ వింగ్ విభాగంలో ఏవీఎస్వోగా ఉన్నారు. పలు కీలకమైన కేసుల్లో సమర్థవంతంగా విచారణ జరిపి ప్రశంసలు అందుకున్నా విమర్శలు కూడా భారీగా ఎదుర్కొన్నారు. గత ప్రభుత్వం నుంచే ఏవీఎస్వోగా ఉన్న ఆమెను బదిలీ చేసి వైజాగ్ డీజీ కార్యాలయంలో రిపోర్టు చేయాలంటూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ పోస్టులో ఎవరిని నియమిస్తారనేది తెలియాల్సి ఉంది.

డ్వాక్రా గ్రూపు సభ్యుల
రూ.కోటి నిధులు హాంఫట్

- బ్యాంకు మేనేజర్ సహా ఆర్పీ, మెప్మా సిబ్బందిపై కేసు నమోదు

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 1(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో డ్వాక్రా సంఘాలకు చెందిన నిధుల స్వాహా పర్వం ఆగడం లేదు. తాజాగా మరో రూ.కోటి నిధులు గోల్‌మాల్ కావడంపై కేసు నమోదయ్యింది. బాధితుల్లో ఒకరైన మాధవి ఫిర్యాదు మేరకు శనివారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఈస్ట్ సీఐ శ్రీనివాసులు వివరాల మేరకు.. దీపిక ఎస్ఎల్ఎఫ్ పేరుతో ఉన్న 26 సంఘాలకు నౌహీరా రీసోర్సు పర్సన్‌గా పనిచేస్తోంది. ఈ సంఘాలకు సంబంధించి 260 మంది సభ్యులు బ్యాంకుల్లో తీసుకున్న రుణాలను రెండేళ్లుగా నౌహీరా ద్వారా చెల్లిస్తున్నారు. తిరుపతి బైరాగిపట్టెడలోని ఇండియన్ బ్యాంకు మాజీ మేనేజర్ ధనంజయ, మెప్మా సిబ్బంది అమ్మాజీ, ప్రమీల, రెడ్డెమ్మ, వసంత, పాతిమాతో నౌహీరా కుమ్మక్కై బ్యాంకులో నకిలీ డిపాజిట్ కౌంటర్ ఫైల్ తీసుకుని డబ్బులు బ్యాంకులో చెల్లించకుండానే చెల్లించినట్లు నకిలీ రసీదులు సృష్టించింది. వాటిని డ్వాక్రా గ్రూపు సభ్యులకు ఇస్తూ వచ్చింది. రుణాలు చెల్లించా లంటూ కొన్ని రోజులుగా బ్యాంకు సిబ్బంది నుంచి డ్వాక్రా సభ్యులకు ఒత్తిడి రావడంతో ఆమెను నిలదీశారు. నౌహీరా నీళ్లు నమలడంతో బ్యాంకుకు వెళ్లి విచారించారు. రెండేళ్ల నుంచి బ్యాంకులో పైసా కూడా చెల్లించలేదని తేలింది. బాధితురాలు మాధవి ఫిర్యాదు మేరకు ఈస్ట్ పోలీసులు బ్యాంకు మాజీ మేనేజర్‌తోపాటు నౌహీరా, మెప్మా సిబ్బందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నిండుకుండల్లా జలాశయాలు


- 75శాతం చెరువులకు జలకళ
- 2 లక్షలకుపైగా ఎకరాలకు సాగునీరు
- సంతోషంలో రైతాంగం



కాళంగి జలాశయం

తిరుపతి(కలెక్టరేట్), నవంబరు 1(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో జిల్లాలో వారం రోజులపాటు వర్షాలు కురిశాయి. జలాశయాలకు భారీగా వరదనీరు చేరింది. స్వర్ణముఖి నది, వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. పిచ్చాటూరు వద్ద ఉన్న ఆరణియార్, కేవీబీపురం వద్ద ఉన్న కాళంగి, రేణిగుంట వద్ద ఉన్న మల్లిమడుగు, వాకాడు, శ్రీకాళహస్తి వద్ద స్వర్ణముఖి బ్యారేజీ జలకళ సంతరించుకున్నాయి. వీటి ద్వారా సుమారు లక్ష ఎకరాలకు సాగునీరు అందుతుంది. జిల్లాలో 2,500కుపైగా చెరువులు ఉండగా 900 చెరువుల్లో 30 శాతం నీరు చేరింది. 300 చెరువులకు పైగా నిండి కలుజులు పారుతున్నాయి. వీటిద్వారా 40వేల ఎకరాలకు సాగునీరు పుష్కలంగా అందనుంది. వీటికితోడు నెల్లూరు జిల్లా రాపూరు వద్ద ఉన్న కండలేరు ప్రాజెక్టు పూర్తి స్థాయిలో నిండింది. ఈ ప్రాజెక్టు నుంచి వచ్చే నీరు జిల్లాలో లక్ష ఎకరాలకు సాగునీరు అందిస్తుంది. తిరుమలకు తాగునీరు అందిస్తున్న కల్యాణి డ్యామ్‌లో 0.331 టీఎంసీల నీరు చేరింది. దీంతోపాటు తిరుమలలోని పలు ప్రాజెక్టులు నిండటంతో శ్రీవారి భక్తులకు తాగునీటి సమస్య లేకుండా పోయింది. జలాశయాలకు పుష్కలంగా నీరు చేరిందని, వరద ముప్పు రాకుండా జాగ్రత్త చర్యలు తీసుకున్నామని జిల్లా జలవనరులశాఖ ఈఈ వెంకటసుబ్బారెడ్డి తెలిపారు. కాళంగి రిజర్వాయర్‌కు రూ.40లక్షలతో 18 గేట్లు మరమ్మతులు చేయించామన్నారు.

జలాశయం	గరిష్టం (కెపాసిటీ)	ప్రస్తుతం నీటి నిల్వ (టీఎంసీ)
అరణియార్	1.853టీఎంసీ	1.853టీఎంసీ
కాళంగి రిజర్వాయర్	0.240 టీఎంసీ	0.240టీఎంసీ
మల్లిమడుగు	0.181 టీఎంసీ	0.181 టీఎంసీ
కల్యాణిడ్యాం	0.910టీఎంసీ	0.331 టీఎంసీ
స్వర్ణముఖి బ్యారేజీ(వాకాడు)	0.033టీఎంసీ	0.033టీఎంసీ
స్వర్ణముఖి(శ్రీకాళహస్తి)	0.031టీఎంసీ	0.031టీఎంసీ



ఆరణియార్ జలాశయం

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల శ్రీవారిని శనివారం కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కేఎస్ ముదగల్, తెలంగాణ రాష్ట్ర మంత్రి వి.శ్రీహరి దర్శించుకున్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి




మంత్రి శ్రీహరి - జస్టిస్ ముదగల్

త్యాగమే సేవకు మూలం

అమరవీరుల సంస్మరణ దినోత్సవంలో ఎస్పీ సుబ్బరాయుడు

విద్యార్థులు, పోలీసు సిబ్బంది పిల్లలకు ప్రశంసాపత్రాల పంపిణీ

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 1(ఆంధ్రజ్యోతి): త్యాగమే సేవకు మూలమని ఎస్పీ సుబ్బరాయుడు పేర్కొన్నారు. పోలీసు అతిథిగృహం కాన్ఫరెన్సు హాలులో శనివారం పోలీసు అమరవీరుల సంస్మరణ దినం నిర్వహించారు. వివిధ రకాల పోటీల్లో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు, పోలీసు సిబ్బందికి, వారి పిల్లలకు ఎస్పీ ప్రశంసాపత్రాలు అందజేశారు. ఆయన మాట్లాడుతూ అమరవీరుల త్యాగాల స్ఫూర్తితో యువత, పోలీసు సిబ్బంది దేశభక్తి, క్రమశిక్షణ, సామాజిక బాధ్యతతో ముందుకు సాగాలని కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు నాగభూషణరావు,డీఎస్పీలు శ్రీలత, శ్యాం సుందర్, ఆర్ఐ హరికృష్ణ, పోలీసు అసోషియేషన్ నాయకులు సోమశేఖర్, శంకర్ రెడ్డి పాల్గొన్నారు.



విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న ఎస్పీ సుబ్బరాయుడు

సర్వదర్శనానికి 12 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. శనివారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో 3 షెడ్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.


గురువారం హుండీ ఆదాయం: రూ.3.76 కోట్లు

శుక్రవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 63,539

తలనీలాలు సమర్పించినవారు: 23,144



రైతులకు వరం కారాకొల్లు కషాయం




● నేల సురక్షితం.. దిగుబడి అధికం.. కలుపు మాయం

● గ్రామీణశాస్త్రవేత్తల పరిశోధనా ఫలితం

SUNDAY SPECIAL

తొట్టంబేడు మండలం కారాకొల్లు గ్రామానికి చెందిన రైతు గల్లా చంద్రశేఖర్ నాయుడు, ఆయన మిత్ర బృందం నాలుగు దశాబ్దాలుగా పలు పరిశోధనలు చేస్తున్నారు. నేలతల్లిని కాపాడుకునే దిశగా వీరు చేస్తున్న పరిశోధనలు మంచి ఫలితాలను ఇచ్చాయి. మూలికా విధానం ద్వారా నెమటోడ్స్ (వేరు పురుగు)ను నివారించే మందును 2012లో కనిపెట్టారు. దీనికి నెమ్‌జాప్ అని పేరు పెట్టారు. 2020లో అహ్మదాబాద్ సృష్టి ల్యాబ్స్ నుంచి దీనికి పేటెంట్ కూడా పొందారు. ఇక కలుపు నివారణ కోసం వీడ్ జాబ్, పంట ఎదుగుదల కోసం గ్రోత్ ఫిట్ కషాయాలను రూపొందించారు. ఈ రెండింటితో పాటు మరికొన్ని ఉత్పత్తులు కలుపుకుని మొత్తం పదింటికి పేటెంట్ హక్కుల కోసం దరఖాస్తు చేసుకున్నారు.

- కథనం : శ్రీకాళహస్తి, ఆంధ్రజ్యోతి

25 వేల ఎకరాలకు కారాకొల్లు మందులు

కారాకొల్లు గ్రామీణ శాస్త్రవేత్తల మిత్ర బృందం శ్రీకాళహస్తి పట్టణ శివార్లలో ప్రస్తుతం ఈ మందులను భారీ ఎత్తున తయారు చేస్తున్నారు. యూరియా పొటాషియంలకు ప్రత్యామ్నాయం కావడంతో గ్రోత్ ఫిట్ మందు పట్ల రైతులు ఆసక్తి చూపుతున్నారు. కలుపు నివారిణి వీడ్‌జాబ్ మంచి ఫలితాలను ఇస్తోంది. దీంతో తెలంగాణలో సుమారు 5వేల మంది రైతులు పదివేల ఎకరాల్లో ఈ రెండు ఉత్పత్తులను వినియోగిస్తున్నారు. మన రాష్ట్రంలో 6 వేల మంది రైతులు 12 వేల ఎకరాల్లో కారాకొల్లు కషాయాలను వాడుతున్నారు. సరిహద్దుల్లోని తమిళనాడు, కర్ణాటక నుంచి వీరి మందుల కోసం అడుగుతుంటారు. ఏడాదికి 40 వేల లీటర్ల మందులను వీరు ఉత్పత్తి చేసి రైతులకు అందిస్తున్నారు.

శ్రీకాళహస్తిలోని కషాయాల తయారీ బాధ్యతలన్నీ కారాకొల్లు రైతులే చూస్తున్నారు. గ్రామ్‌బజార్ అనే యూట్యూబ్ చానెల్ వీరి మందుల గురించిన సమాచారం వీడియోల రూపంలో పెడుతూ ఉంటుంది. ఈ మందులు వాడుతున్న రైతుల అనుభవాలను, పంటల తీరును చూపిస్తుంటారు.

కారాకొల్లు కషాయాలు కావాలంటే:
www.gramabazaar.com
వరిలో కొనుగోలు చేస్తే ఆర్టీసీ పార్శిల్ ద్వారా పంపుతారు.
వివరాలకు: 9849541674

కారాకొల్లు మందులు





వీడ్‌జాబ్: వరిలో కలుపు నివారణకు అద్భుత ఫలితాలనిస్తోంది. ఎకరాకు మూడు లీటర్ల మందు అవసరం. ఇది లీటరు రూ.600

వాడే విధానం: వరి నాట్లకు ముందు నీళ్లు పెట్టి దమ్ము చేసుకునే సమయంలో ఈ మందును ఇసుకలో కలిపి చల్లాలి. వరి నాటుకున్న తర్వాత అందులోని నీళ్లు 15 రోజుల పాటు బయటకు పోనివ్వకుండా చూసుకోవాలి.

ప్రయోజనం: వరిలో సాధారణంగా వచ్చే ఏ రకమైన కలుపూ ఎదగదు. పైగా మొలిచిన కలుపును ఇది చంపేసి ఎరువుగా మార్చేస్తుంది.

గ్రోత్‌ఫిట్: ఇది మంచి పోషకం. వరి సహా అన్ని పంటలకూ వాడవచ్చు. వరి అయితే ఎకరాకు మూడు లీటర్లు అవసరం. లీటరు రూ.600.

వాడే విధానం: వరి నాటిన 25రోజులకు రెండు లీటర్ల మందు ఇసుకలో కలిపి చల్లాలి. ఆ సమయంలో పొలంతో నీళ్లు ఉండాలి. వరి వెన్ను వచ్చే ముందు అంటే 35 రోజులకు ఒక లీటరు మందులో 100లీటర్ల నీళ్లు కలిపి స్ప్రే చేయాలి. వరి 5నెలల పంట అయితే ఇంకోసారి 2లీటర్ల మందు వేయాలి.

ప్రయోజనం: పొలం పచ్చగా నిగనిగలాడుతూ ఎదుగుతుంది. వెన్ను బలంగా వస్తుంది. గింజ రాలదు. దిగుబడి పెరుగుతుంది.

నెమ్‌జాప్: వేరుపురుగును నివారించే ఈ మందు వరి, మామిడి తప్ప అన్ని రకాల పంటలకీ వాడుకోవచ్చు. కూరగాయల తోటల్లో ఇది మంచి ఫలితాలను ఇస్తోంది. ఎకరాకు రెండు లీటర్ల మందు అవసరం. లీటరు ధర రూ.800. దీనికి పేటెంట్ కూడా లభించింది.

వాడే విధానం: పంట వేసే ముందు ఇసుకలో కలిపి చల్లుకోవాలి. పంట వేశాక అయితే ఒక లీటరు మందును వందలీటర్ల నీళ్లలో కలిపి డ్రిప్‌లో వదలాలి.

ఈ మందు వాడిన 15రోజుల తర్వాత గ్రోత్ ఫిట్ స్ప్రే చేస్తే పూతవిరగ్గాస్తుంది. కాయ సైజు పెరుగుతుంది. నాణ్యత ఉంటుంది.

నొప్పి నివారిణి శ్రీతైలం

కారాకొల్లు గ్రామీణ శాస్త్రవేత్తలు తయారు చేసిన శ్రీతైలం పెయిన్ రిలీవర్‌గా ఉపయోగపడుతుంది. ఇది కూడా పూర్తిగా ఆకు పసరు నుంచి తయారు చేసిందే. నొప్పి ఉన్న చోట పూసుకుంటే చాలు. అలాగే పడుకునే ముందు ఒంటికి పూసుకుంటే దోమలు దగ్గరకు కూడా రావు. గాయాలకు పూస్తే వేగంగా నయమవుతాయి. సొరియాసిస్ తప్ప అన్ని రకాల చర్మ వాధులకు ఇది మంచి ఫలితాలు ఇస్తోందని గ్రామీణ శాస్త్రవేత్త చంద్రశేఖర్ చెబుతున్నారు.

ఎరువులకన్నా ఖర్చు తక్కువ

యూరియా, పొటాషియం, డీఏపీ వంటి రసాయన ఎరువులను సాధారణంగా రైతులు వినియోగిస్తారు. కలుపు నివారణకు మందులు చల్లుతారు. వీటికి ఎకరా వరికి రూ.6వేలు ఖర్చవుతుంది. చీడపీడల పురుగు మందుల కోసం రూ.8,400 వ్యయం చేయాలి. అంటే ఎకరా వరికి రూ.14,500లు ఖర్చు అవుతుంది. అదే కారాకొల్లు కషాయాలు వాడితే కేవలం రూ.3600తో ఎకరా వరి సాగవుతుంది.



వయ్యారిభామపై యమపాశం

వయ్యారిభామ, కాంగ్రెస్ గడ్డి, పార్థీనియం వంటి పేర్లతో పిలిచే పిచ్చి మొక్క తీవ్ర అనారోగ్యాలకు కారకమని గుర్తించి దీన్ని అణుబాంబుతో పోలుస్తారు. కారాకొల్లు శాస్త్రవేత్తలు తయారుచేసిన కలుపుమందును చల్లగానే అరగంట వ్యవధిలో వయ్యారిభామ నిలువునా మాడిపోతుంది. ఇది తర్వాత అదే నేలకు ఎరువుగా మారిపోతుంది. ఈ మందు కూడా మన చుట్టూ లభించే పిచ్చిమొక్కల నుంచే తయారు చేయడం విశేషం. రైతులకు మరింత లాభదాయకంగా ఉండేలా ఈ మందుపై పరిశోధనలు కొనసాగిస్తున్నారు.

40 ఏళ్ల క్రితం నేను, భాస్కర్, బత్తినాయుడు, మురళి, వెంకటేశ్వర్లు, శివయ్య, చిరంజీవులు, శ్రీధర్ అనే ఏడుగురు మిత్రులు కలిసి ప్రారంభించిన పరిశోధనల ఫలితమే ఇవి. రసాయన ఎరువులు, పురుగుమందులు భూమి కడుపులో విషంగా మారి మన ఆరోగ్యాలను దెబ్బతీస్తున్నాయని అందరికీ తెలుసు. ప్రత్యామ్నాయంగా సేంద్రియ సేద్యాన్ని సూచిస్తున్నారు. గడ్డి, ఆకులు వంటివి మేతగా స్వీకరించే పశువుల విసర్జితమే ఈ సేద్యంలో కీలకం. నేలలో మిత్రకీటకాల వృద్ధికి దోహదం చేస్తున్నది ఇదే. పశువులు స్వీకరించి విసర్జించిన తర్వాత ఏర్పడే సేంద్రియ గుణాలను కలిగివున్న మొక్కలపై దశలవారీగా మేం చేసిన పరిశోధనల్లోంచే గ్రోత్‌ఫిట్, నెమ్‌జాప్, వీడ్‌జాబ్ వంటివి తయారయ్యాయి. ఇంకా చవగ్గా రైతులకు అందించేలా ఇప్పటికీ మా పరిశోధనలు కొనసాగుతున్నాయి.

- చంద్రశేఖర్



పైరు బాగా పెరిగింది

మాది తొట్టంబేడు మండలం కొమ్మలగుంట గ్రామం. నాకున్న ఎకరా నేలలో తెలంగాణ నుంచి గౌతమ బుద్ధ అనే దేశవాళీ నాటు వరి విత్తనాలను కొనుగోలు చేశాను. ధాన్యం చూడ్డానికి నల్లగానూ.. అన్నం మామూలుగా తెల్లగాను ఉంటుంది. ఇది అరుదైన రకం కావడంతో కిలో బియ్యం రెండు వందల యాభై రూపాయలు చొప్పున మార్కెట్ ధర ఉంది. కారాకొల్లు కషాయాలు చల్లాను. వీడ్‌జాబ్‌తో అసలు కలుపు సమస్య రాకుండా... ఎరువుగా కూడా ఉపయోగపడి పైరు బాగా వచ్చింది. మధ్యలో గ్రోత్ ఫిట్ వినియోగించాను. పైరు బాగా ఎత్తుగా పెరిగింది.

- రాంబాబు





పోటీలను ప్రారంభిస్తున్న రవినాయుడు

రాష్ట్రస్థాయి లాన్‌టెన్నిస్ పోటీలు ప్రారంభం

శ్రీకాళహస్తి, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని విక్రమ్ టెన్నిస్ అకాడమీలో శనివారం 69వ ఆంధ్రప్రదేశ్ స్కూల్ గేమ్స్ ఇంటర్ డిస్ట్రిక్ట్ లాన్ టెన్నిస్ అండర్-14, అండర్ 17, అండర్-19 పోటీలను శాప్ ఛైర్మన్ రవినాయుడు ప్రారంభించారు. ఉమ్మడి 13 జిల్లాల నుంచి జిల్లాకు 30మంది చొప్పున 390మంది క్రీడాకరులు ఈ పోటీలకు విచ్చేశారు. ఇక్కడ గెలుపొందిన క్రీడాకారులు వచ్చే నెలలో ఢిల్లీలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనున్నారు. ఈ సందర్భంగా శాప్ ఛైర్మన్ రవినాయుడు మాట్లాడుతూ గతంలో ఎన్నడూలేని విధంగా స్కూల్ గేమ్స్ పోటీలను సమర్థవంతంగా నిర్వహిస్తున్న స్కూల్ గేమ్స్ ఫెడరేషన్‌కు అభినందనలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ ఛైర్మన్ చెంచయ్యనాయుడు, టీడీపీ పట్టణాధ్యక్షుడు విజయకుమార్, మండలాధ్యక్షుడు కృష్ణయాదవ్,ఏర్పేడు మండలాధ్యక్షుడు పేరం నాగరాజునాయుడు,నాయకులు కాసరం రమేష్,రవీంద్రనాథ్‌రెడ్డి, కూటమి నాయకులు,తిరుపతి స్కూల్‌గేమ్స్ కార్యదర్శి కిషోర్ పాల్గొన్నారు.

హథీరాంజీ మఠం కూల్చివేస్తారన్నది అపోహ మాత్రమే

● దెబ్బతిన్న ప్రాంతాన్నే పునర్నిర్మిస్తాం ● కలెక్టర్ వెంకటేశ్వర్



తిరుపతి(కలెక్టరేట్), నవంబరు 1(ఆంధ్రజ్యోతి): తిరుపతి గాంధీ రోడ్డులోని హథీరాంజీ మఠాన్ని మొత్తంగా కూల్చివేస్తారన్నది అపోహ మాత్రమేనని, దెబ్బతిన్న ప్రదేశాలను పునర్నిర్మిస్తామని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. ఈ అంశంపై కలెక్టరేట్‌లో శనివారం ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, నగరపాలక సంస్థ కమిషనర్ మౌర్యతో కలిసి ప్రజాప్రతినిధులు, మఠం కమిటీ సభ్యులతో ఆయన సమావేశమయ్యారు. పురాతనమైన హథీరాంజీ మఠం విషయంలో ఎక్స్పర్ట్ కమిటీని నియమించి వారి సలహాలు తీసుకున్నామని తెలిపారు. గాంధీ రోడ్డు వైపు ఉన్న భాగం దెబ్బతిందని, ఉత్తరం వైపు ఉన్న మొదటి అంతస్తు భాగం పూర్తిగా ధ్వంసమైందని తిరుపతి ఐఐటీ డైరెక్టర్ ప్రసన్నకుమార్, స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్ డైరెక్టర్ ఆర్ఎస్ఎస్ మూర్తి తెలిపారన్నారు. ఈ మఠాన్ని మద్రాస్ టెర్రస్ రూఫింగ్ టెక్నాలజీని ఉపయోగించి పూర్వం నిర్మించారని, అదే తరహాలో పునర్నిర్మాణం చేస్తామని అన్నారు. త్వరగా పూర్తి చేసి, బంజారా భక్తులకు వసతిగృహం, వ్యాపారులకు దుకాణాలను అందుబాటులోకి తెస్తామన్నారు. ఈ సమావేశంలో తిరుపతి ఆర్డీవో రామ్మోహన్, శ్రీకాళహస్తీశ్వరాలయ ఈవో బాపిరెడ్డి, ఆంధ్రప్రదేశ్ గ్రీన్ అండ్ బ్యూటిఫికేషన్ ఛైర్మన్ సుగుణమ్మ, యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహయాదవ్ పాల్గొన్నారు.

కళలపైనా ఆసక్తి పెంచుకోండి

● బాలోత్సవ ప్రారంభోత్సవంలో కలెక్టర్ పిలుపు



తిరుపతి (కల్చరల్), నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): చదువుతో పాటు విద్యార్థులు కళలూ సాహిత్యం పట్ల కూడా ఆసక్తిని పెంపొందించుకోవాలని కలెక్టర్ వెంకటేశ్వర్ సూచించారు.తిరుపతి నాల్గవ బాలోత్సవాన్ని నగరంలోని ఎస్జీఎస్ ఆర్ట్స్ కాలేజీలో శనివారం ఉదయం ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాల్లో పాల్గొనడం వల్ల పిల్లల్లో సృజనాత్మక శక్తి మెరుగుపడుతుందన్నారు.ఇలాంటి కార్యక్రమాలను మరిన్ని చేపట్టాలని,అవసరమైన సహాయ సహకారాలను జిల్లా యంత్రాంగం అందిస్తుందని హామీ ఇచ్చారు.డీఈవో కుమార్,సాంఘిక సంక్షేమ అధికారి విక్రమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ...విద్యార్థులకు ఇది ఒక మంచి అవకాశమని, సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.బాలోత్సవం స్థాపకులు మల్లారపు నాగార్జున మాట్లాడుతూ.. విద్యార్థుల్లో దాగున్న సామర్థ్యాన్ని వెలికితీయాలనే సంకల్పంతో విద్య, శాస్త్రీయ, సాంస్కృతిక అంశాలపై పోటీలను నిర్వహిస్తున్నామన్నారు.పిల్లల్లో సామాజిక స్పృహ , దేశభక్తి, సమష్టితత్వం పెంపొందించాలనే ఆశయంతో ఏటా ఈ కార్యక్రమాన్ని నాలుగేళ్లగా ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు.బాలోత్సవం గౌరవాధ్యక్షులు టెంకాయల దామోదరం, కస్తూరిబా గాంధీ ట్రస్టు చైర్మన్ పి.సి. రాయలు, రోటరీ క్లబ్ అధ్యక్షులు రాజేంద్ర శెట్టి, రీచ్ గ్లోబల్ ఫౌండేషన్ ఛైర్మన్ రమేష్ నాథ్ లింగుట్ల, క్రియా పిల్లల పండుగ సెక్రటరీ కాకినాడ జగన్నాథ రావు, ఎస్జీఎస్ కాలేజ్ ప్రిన్సిపాల్ సత్యనారాయణ పాల్గొన్నారు.




చిన్నారుల సందడి

● హుషారుగా సాంస్కృతిక పోటీలు, ప్రదర్శనలు

● నేడు విజేతలకు బహుమతుల ప్రదానం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 1 (ఆంధ్రజ్యోతి):బాలోత్సవంలో విద్యార్థులు సాంస్కృతిక ప్రతిభా పోటీల్లో అదరహో అనిపించారు.వేలాది మంది చిన్నారులు తమలోని సుకుమార భావాలను వ్యక్తం చేసి ఆహూతులను మైమరిపించారు.ఆరు సమాంతర వేదికలపై ఇరవై ఒక్క అంశాలపై పోటీలు నిర్వహించారు.ఫ్యాన్సీ డ్రెస్, బొమ్మకు కథ రాయండి, కథ చెబుతాను ఊ కొడతారా, కథ రాయడం, స్పెల్-బీ (ఇంగ్లీషు), గజిబిజి సరిచేద్దాం, మ్యాప్, మెమరీ టెస్ట్, తెలుగు దినపత్రిక పఠనం, లేఖారచన, బెస్ట్ ఫ్రం వేస్ట్, జానపద నృత్యం, ఇన్స్ట్రుమెంట్, బుర్రకథ, ఏకపాత్రాభినయం, క్లాసికల్ డ్యాన్స్, దేశభక్తి గీతాలాపన, లఘునాటిక, చదరంగం వంటి అంశాలపై ఆసక్తికరంగా పోటీలు సాగాయి.ఆదివారం చిత్రలేఖనం, పదకేళి (పదవినోదం), గణిత తర్కం, తెలుగులో మాట్లాడటం, తెలుగులో ఉపన్యాసం, పద్యం-భావం, క్విజ్, మట్టితో బొమ్మల తయారీ, సంప్రదాయ నృత్యం, దేశభక్తి గేయాలాపన, జానపద నృత్యం, కోలాట ప్రదర్శనం, యోగ, శాస్త్రీయ సంగీతం, జానపద గీతాలు, చెస్ తదితర పోటీలు నిర్వహించనున్నారు.సాయంత్రం 4 గంటలకు ప్రారంభమయ్యే ముగింపు సభకు ఎస్పీ సుబ్బరాయుడు ముఖ్య అతిధిగా హాజరు కానున్నారు.సాంస్కృతిక ప్రతిభా పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేయనున్నట్టు బాలోత్సవం స్థాపకులు మల్లారపు నాగార్జున, అధ్యక్షులు నడ్డి నారాయణ తెలిపారు.

నేడు నారావారిపల్లెకు రోహిత్ దంపతుల రాక

చంద్రగిరి, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే రామ్మూర్తినాయుడు కుమారుడు, సినీహీరో నారా రోహిత్ దంపతులు ఆదివారం స్వగ్రామమైన నారావారిపల్లెకు రానున్నారు. ఇటీవల హైదరాబాదులో రోహిత్ వివాహమైన సంగతి తెలిసిందే. నవ దంపతులు ఉదయం నారావారిపల్లెకు చేరుకుని, రామ్మూర్తినాయుడు ఘాట్‌కు నివాళులు అర్పించనున్నారు. గ్రామదేవత దొడ్డి గంగమ్మకు, ఇంటి దేవత నాగాలమ్మకు పూజలు నిర్వహించనున్నారు. అనంతరం హైదరాబాదుకు వెళ్లనున్నారు.

పీఎం ఆదర్శ గ్రామాల అభివృద్ధికి నిధుల మంజూరు

● జెడ్పీ సీఈవో రవికుమార్‌నాయుడు

తిరుపతి రూరల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పీఎం ఆదర్శ గ్రామాల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం రూ.10కోట్లకు పైగా నిధులు మంజూరు చేసిందని, ప్రణాళిక సిద్ధం చేయాలని జెడ్పీసీఈవో వి.రవికుమార్ నాయుడు ఆదేశించారు. తిరుపతి రూరల్ మండల ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం ఎంపీడీవోలు, పంచాయతీ, ఇరిగేషన్ విభాగాల ఇంజినీర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో కేంద్ర ప్రభుత్వం మూడు దశలలో రూ.10కోట్లకు పైగా నిధులను మంజూరు చేసిందని తెలిపారు. ఈ నిధులతో గ్రామాల్లో రోడ్లు, తాగునీరు వంటి మౌలిక సదుపాయాలకు సంబంధించిన పనులు చేపట్టాలని సూచించారు. రెండు సంవత్సరాల కాల పరిమితితో ఈ నిధులను వినియోగించుకోవచ్చన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రవికుమార్‌నాయుడు

హత్య కేసులో నిందితుడి అరెస్టు



నిందితుడితో సీఐ కిషోర్‌బాబు, ఎస్ఐ సురేష్‌బాబు

చిల్లకూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తమ్మినపట్నం గ్రామ సమీపంలోని సాగరమాల రోడ్డు నిర్మాణం పనులు చేస్తున్న ఒడిశా రాష్ట్రానికి చెందిన కూలీ నరసింగ్ ఓరమ్ హత్యకేసులో నిందితుడు సమీర్ నాయక్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. శనివారం చిల్లకూరు పోలీస్ స్టేషన్ సీఐ కిషోర్‌బాబు వివరాలు వెల్లడించారు. ఒడిశా రాష్ట్రానికి చెందిన నరసింగ్ ఓరమ్, సమీర్ నాయక్ మండలంలోని తమ్మినపట్నం గ్రామ సమీపంలోని సాగరమాల రోడ్డు నిర్మాణం పనులు చేసేవారు. వీరిద్దరూ ఈనెల 26వ తేదీ సాయంత్రం మద్యం తాగుతుండగా వివాదం ఏర్పడి ఘర్షకు దారి తీసింది. ఈ క్రమంలో నర్సింగ్ ఓరమ్‌పై సమీర్‌నాయక్ ఇనుపరాడ్డుతో దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన నర్సింగ్ ఓరమ్‌ను నెల్లూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లగా, అక్కడ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు శనివారం సమీర్ నాయక్‌ను అరెస్ట్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఐ సురేష్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులందరికీ పింఛన్లు



పింఛన్లు అందజేస్తున్న టీడీపీ నాయకులు

గూడూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతిఒక్కరికీ ప్రతినెలా 1వ తేదీ నాడే లబ్ధిదారుల ఇంటికి వెళ్లి పింఛన్లు అందజేస్తున్న ఘనత ఎన్డీఏ ప్రభుత్వానికే దక్కుతుందని ఆ పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి శీలం కిరణ్‌కుమార్ అన్నారు. శనివారం రెండో పట్టణ పరిధిలోని మాళవ్యానగర్, జానికిరామ్‌పేట తదితర ప్రాంతాల్లో లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, పులిమి శ్రీనివాసులు, బిల్లు చెంచురామయ్య, చంద్రమోహన్, జనార్దనరెడ్డి, రమణయ్య, నరసింహులు, ఇశ్రాయిల్ కుమార్, వేముల సునీల్, ప్రణీత్, ఓంప్రకాష్, పార్వతయ్య తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా చెన్నూరు గ్రామంలో తిరుపతి పార్లమెంటు తెలుగు మహిళా ప్రధాన కార్యదర్శి మట్టం శ్రావణి, పింఛన్లు అందజేశారు. కార్యక్రమంలో హేమంత్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, కృష్ణయ్య, మనోహర్ రెడ్డి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా చెన్నూరులోని రామ లింగయ్య కాలనీలో టీడీపీ నాయకుడు ఎల్లసిరి శ్రీనివాసులురెడ్డి పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో శ్రీధర్‌రెడ్డి, శివకుమార్, అభిలాష్‌రెడ్డి పాల్గొన్నారు.

తహసీల్దారుకు ముఖ్యమంత్రి అభినందన



సీఎం చంద్రబాబునాయుడు నుంచి ప్రశంసాపత్రం అందుకుంటున్న తహసీల్దారు జయజయరావు

కోట, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): కోట తహసీల్దారు కటారి జయ జయరావును ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అభినందించారు. మొంథా తుఫాన్ సందర్భంగా తహసీల్దారు జయజయరావు ప్రజలకు విశేష సేవలు అందించారు. మండలంలోని సముద్ర తీరప్రాంత గ్రామాలు, మత్స్యకారులను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేసి సురక్షిత ప్రాంతాలకు తరలించారు. స్వర్ణముఖి ముంపు ప్రాంతాలైన పుచ్చలపల్లి, దొరువుకట్ట, దైవాల దిబ్బ, అల్లంపాడు గ్రామాల్లోని ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ రెవెన్యూ తన సిబ్బందితో పాటు అన్నిశాఖలను సమన్వయం చేసుకొని సహాయక చర్యలు చేపట్టారు. ఆయన సేవలను జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ గుర్తించి అవార్డు, ప్రశంసాపత్రానికి ఎంపిక చేస్తూ రాష్ట్ర ప్రభుత్వానికి సిఫారసు చేశారు. శనివారం ఉదయం ఉండవల్లిలోని సీఎం క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కోట తహసీల్దారు జయజయరావుకు ప్రశంసాపత్రం అందజేసి అభినందించారు. సాయంత్రం కోట రెవెన్యూ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దారు మల్లికార్జున రావు, ఆర్ఐ ప్రసాద్ ఆధ్వర్యంలో రెవెన్యూ సిబ్బంది తహసీల్దారును గజమాలలతో సన్మానించి అభినందించారు.

జాతీయ విజ్ఞాన మేళాకు విద్యార్థి ఎంపిక



వర్షికాశృతి శర్మ

నాయుడుపేట/పెళ్లకూరు, నవంబరు, 1 (ఆంధ్రజ్యోతి): పెళ్లకూరు మండలంలోని చిల్లకూరుకు చెందిన సుధీర్ శర్మ, డోరతి వయోలా దంపతుల కుమార్తె వర్షికాశృతి శర్మ జాతీయ విజ్ఞాన మేళాకు ఎంపికైంది. నాయుడుపేట జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో వర్షికాశృతి శర్మ 10వ తరగతి చదువుతోంది. ఆమె తల్లి డోరతి వయోలా పెళ్లకూరు మండలంలోని కానూరు రాజుపాలెం పాఠశాలలో ఉపాధ్యాయురాలుగా పనిచేస్తున్నారు. ఇటీవల నిర్వహించిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీల్లో జిల్లా, రాష్ట్ర స్థాయిలో వర్షికాశృతి శర్మ సత్తా చాటింది. అలాగే నాసా బృందంలోని ప్రముఖ ఇంజనీర్లతో జరిగిన ముఖాముఖిలో పాల్గొంది. చెన్నై యూనివర్శిటీలో నిర్వహించిన పెన్సిల్ ఆర్ట్‌లో వెంకటేశ్వరుడి రూపాన్ని గీయడంతో ఫైన్ ఆర్ట్స్ విభాగంలో గౌరవ డిప్లొమాకు ఎంపికైంది. న్యూ ఢిల్లీలో ఈనెల 6నుంచి 8వ తేదీ వరకు జరగనున్న జాతీయ విజ్ఞాన మేళాలో వర్షికాశృతి శర్మ పాల్గొననుంది. జాతీయ విజ్ఞాన మేళాకు ఎంపికైన వర్షికాశృతి శర్మను ఎంఈవో-2 మునిరత్నం, ప్రధానోపాధ్యాయులు మనోజ్ కుమార్, ఉపాధ్యాయులు అభినందించారు.

హథీరాంజీ మఠం పునర్నిర్మాణ నిర్ణయంపై హర్షం

తిరుపతి(ఉపాధ్యాయనగర్), నవంబరు 1(ఆంధ్రజ్యోతి): హథీరాంజీ మఠం భవనాన్ని పునర్నిర్మించాలని కలెక్టర్ వెంకటేశ్వర్ నిర్ణయించడంపట్ల బీజేపీ సీనియర్ నాయకులు వరప్రసాద్ శనివారం ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. కలెక్టర్, నగరపాలక సంస్థ కమిషనర్ మౌర్య, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులుకు ధన్యవాదాలు తెలిపారు. భవన నిర్మాణానికి కమిటీని నియమించి చర్యలు ప్రారంభించినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు.

నాయీ బ్రాహ్మణుల జనచైతన్యయాత్ర



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఆవులపాటి బుజ్జి తదితరులు

తిరుపతి(ఎంఆర్‌పల్లె), నవంబరు 1(ఆంధ్రజ్యోతి): నాయిబ్రాహ్మణుల కుల వృత్తి రక్షణ, పేటెంట్ హక్కుల సాధనకు ఆంధ్రప్రదేశ్ నాయీ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో జనచైతన్య సైకిల్‌యాత్రను ప్రారంభిస్తున్నట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆవులపాటి బుజ్జి తెలిపారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ నవంబరు 5న ఉదయం 7గంటలకు జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద నుంచి సైకిల్‌యాత్ర ప్రారంభం అవుతుందన్నారు. కార్యక్రమంలో శిబ్బాల సుధాకర్, తులసి, భాస్కర్, సంజీవరాయుడు, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

హుండీ చోరీ కేసులో ఇద్దరి అరెస్టు

తడ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): హుండీ చోరీ కేసులో ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. మండల పరిధిలోని వెండ్లూరుపాడు వెంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం రాత్రి హుండీలు చోరీకి గురయ్యాయి. కేసు నమోదు చేసి విచారణ చేసిన పోలీసులు సూళ్లూరుపేట వట్రపాళెం ప్రాంతానికి చెందిన దిలీప్, ఆనంద్ అనే ఇద్దరు పాత నేరస్థుల హస్తం ఉన్నట్లుగా గుర్తించారు. ఆ మేరకు వారిపై నిఘా పెట్టారు. శనివారం ఇద్దరు నిందితులు తడలో ఉండగా అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి ఆలయ హుండీలో చోరీ చేసిన రూ.17వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. నిందితులిద్దరినీ కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించారు. కాగా, ఇద్దరు నిందితులపై గతంలో 8కేసులు ఉన్నాయని, జైలు శిక్ష కూడా అనుభవించారని ఎస్ఐ కొండపనాయుడు తెలిపారు.

వీధికుక్కల దాడిలో బాలుడికి గాయాలు



గాయపడిన బాలుడు

బాలాయపల్లి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కయ్యూరు ఎస్టీ కాలనీలో శనివారం వీధి కుక్కలు దాడి చేయడంతో రెండేళ్ల బాలుడు తీవ్రంగా గాయపడ్డారు. గ్రామానికి చెందిన సుమన్, పుష్ప దంపతుల కుమారుడు నరసింహ ఇంటి ముందు ఆడుకుంటుండగా వీధి కుక్కలు దాడి చేశాయి. ఈ ఘటనలో బాలుడికి తల, ముఖంపై గాయాలు అయ్యాయి.

ఆర్టీసీ బస్సు ఢీ - స్కూటరిస్టుకు గాయాలు

కోట, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): కోట ఆర్టీసీ బస్టాండ్ సెంటర్‌లో శనివారం ఆర్టీసీ బస్సు ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న ఘటనలో హర్షాద్ అనే యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. వాకాడు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు కోట బస్టాండ్ నుంచి నెల్లూరుకు వెళ్తూ ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనాన్ని నడుపుతున్న హర్షాద్ తలకు తీవ్రగాయం అయింది. అతడిని కుటుంబ సభ్యులు కోట ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

పింఛన్ల పంపిణీ

వెంకటగిరి, నవంబర్ 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని జంగాలపల్లి పంచాయతీ పరిధిలో లబ్ధిదారులకు పింఛన్లను టీడీపీ మండల అధ్యక్షుడు పప్పు చంద్రమౌళిరెడ్డి ఆధ్వర్యంలో శనివారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాలూరు పాపయ్య, మురళి, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

కోటి సంతకాల సేకరణ

నాయుడుపేట, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నాయుడుపేటలోని తుమ్మూరు, భరత్ నగర్‌లో శనివారం మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ చేపట్టారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కటకం దీపిక, వైసీపీ జిల్లా కార్యదర్శి తంబిరెడ్డి సుబ్రహ్మణ్యంరెడ్డి, సహకార సంఘం మాజీ అధ్యక్షుడు కామిరెడ్డి రాజారెడ్డి, డీసీసీబీ మాజీ డైరెక్టర్ కలికి మాధవరెడ్డి, పొట్లపూడి రాజేష్, రత్నశ్రీ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు యూరియా పంపిణీ



రైతులకు యూరియా పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

వెంకటగిరి, నవంబర్ 1(ఆంధ్రజ్యోతి): వెంకటగిరి, లాలాపేట సింగిల్ విండోల చైర్మన్లు పప్పు చంద్రమౌళిరెడ్డి, గొల్లగుంట వెంకట ముని శనివారం రైతులకు యూరియా పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ పునుగోటి విశ్వనాధనాయుడు, పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీరామదాసు గంగాధర్, ఏఎంసీ వైస్ చైర్మన్ సూరి, మండల వ్యవసాయాధికారిణి సుజాత, ఏఎంసీ మాజీ చైర్మన్ పులికొల్లు రాజేశ్వరావు, టీడీపీ పట్టణ అధ్యక్షుడు అవ్వారు సత్యనారాయణ, నాయకులు మంకు ఆనంద్, శివనారాయణ, నక్కల వెంకటేశ్వర్లు, కోడూరు శినయ్య, జమ్మల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

గాయపడిన వ్యక్తికి ఆర్థికసాయం



ఆర్థికసాయం అందజేస్తున్న ఏజీ కిషోర్ శ్రీధర్ తదితరులు

సూళ్లూరుపేట, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలోని డేగలపాలెంలో నివాసం ఉంటున్న పీ.ఈశ్వరయ్య కూలి పనులు చేసుకుని జీవనం సాగించుకునేవాడు. ఈనెల 30న జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన ఈశ్వరయ్య కోమాలోకి వెళ్లడంతో తిరుపతిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. ఈ విషయం తెలుసుకున్న రైతు సేవా సహకార సంఘం చైర్మన్ ఏజీ కిషోర్ శనివారం ఆస్పత్రికెళ్లి ఈశ్వరయ్య కుటుంబ సభ్యులకు రూ.20 వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు రమణయ్య, శ్రీధర్, సతీష్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

మూడేళ్ల లా కోర్సు ఏర్పాటు చేయాలి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ఎస్వీయూలో మూడేళ్ల లా కోర్సు ఏర్పాటు చేయాలని నేషనల్ లా స్టూడెంట్ యూనియన్ అధ్యక్షులు సుందర్రాజు కోరారు. ఈ మేరకు వీసీ నరసింగరావును కలిసి శనివారం వినతిపత్రం అందజేశారు.

గరుడ వారధిపై ఎస్పీ పరిశీలన

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 1(ఆంధ్రజ్యోతి): తరచూ ప్రమాదాలతో ఆందోళన కలిగిస్తున్న గరుడ వారధిని ఎస్పీ సుబ్బరాయుడు శనివారం పరిశీలించారు. ప్రమాదాలకు ఆస్కారమిస్తున్న అంశాలపై అధ్యయనం చేశారు. లక్ష్మీపురం సర్కిల్, తిరుచానూరు ప్రాంతంలో జరుగుతున్న ప్రమాదాలపై ఆరా తీశారు. ఏఎస్పీ రవిమనోహరాచారి, డీఎస్పీ భక్తవత్సలం, రామకృష్ణమాచారి, సీఐలతో కలసి ఆదివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు కలియతిరిగారు. ప్రమాదాల కట్టడికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మలుపుల వద్ద బ్లింకింగ్ లైట్లు, రేడియం ఏరో మార్కులాంటివి ఏర్పాటు చేయాలన్నారు.



గరుడ వారధిపై ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ సుబ్బరాయుడు

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం: విజయశ్రీ



రైతులకు యూరియాను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ, నెలవల సుబ్రహ్మణ్యం, టీడీపీ నాయకులు

నాయుడుపేట టౌన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తున్నదని సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ అన్నారు. పట్టణంలోని సొసైటీ కార్యాలయం వద్ద శనివారం ఎమ్మెల్యే విజయశ్రీ, సూళ్లూరుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం రైతులకు యూరియా అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తూ... ప్రజలకు సంక్షేమ పథకాలను అందిస్తున్న కూటమి ప్రభుత్వంపై వైసీపీ నాయకులు బురదచల్లే ప్రయత్నాలు చేయడం మంచి పద్ధతి కాదన్నారు. అనంతరం లోతువానిగుంట వద్ద పింఛన్లు పంపిణీ చేశారు. ఆర్‌అండ్‌బీ రహదారి మరమ్మతు పనులను పరిశీలించారు. నెలవల సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ సారథ్యంలో కూటమి ప్రభుత్వం అభివృద్ధి, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తోందన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ఉయ్యాల ప్రవీణ్‌కుమార్, తహసీల్దారు రాజేంద్ర, ఎంపీడీవో సురేష్, వ్యవసాయశాఖ ఏవో గణేష్, నాయకులు అశోక్‌రెడ్డి, గంగాప్రసాద్, సంచి కృష్ణయ్య, ముత్యాలయ్య, చేవూరి చెంగయ్య, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి



కోటలో నిరసన తెలుపుతున్న చింతా మోహన్ తదితరులు

కోట, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించాలని కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ అన్నారు. కోట బజారుసెంటర్‌లో శనివారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా చింతా మోహన్ మాట్లాడుతూ రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోయి ఆత్మహత్యలు చేసుకోవాల్సిన పరిస్థితిలో ఉన్నారని, కూటమి ప్రభుత్వం రుణమాఫీ చేసి ఆదుకోవాలన్నారు. అదే విధంగా లక్షలాది మంది నిరుద్యోగులకు జీవనోపాధి కల్పించే దుగరాజపట్నం ఓడరేవు నిర్మాణానికి కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వెంకటయ్య, చిరంజీవి, ప్రసాద్, రమణయ్య, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

వాకాడు: నిరుద్యోగ యువతను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని మాజీ ఎంపీ చింతామోహన్ అన్నారు. శనివారం మండలంలోని అశోక్‌పిల్లర్ వద్ద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా నిరసన తెలిపారు.

గిరిజన విద్యార్థులకు ఆధార్ నమోదు



గిరిజన విద్యార్థులకు ధృవీకరణ పత్రాన్ని అందజేస్తున్న టీడీపీ నాయకులు

గూడూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): పట్టనంలోని గాంధీనగర్ కాలనీకి చెందిన గిరిజన విద్యార్థులకు ఆధార్ నమోదు చేయించేందుకు అట్రాసిటీ కమిటీ సభ్యుడు పెంచలయ్య, టీడీపీ నాయకుడు చంద్రమౌళి చర్యలు తీసుకున్నారు. శనివారం తహసీల్దారు కార్యాలయం వద్ద గిరిజన విద్యార్థులకు ఆధార్ ధృవీకరణ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గాంధీనగర్ గిరిజన కాలనీకి చెందిన శివకుమార్ 4వ తరగతి, రమ్య 2వ తరగతి చదువుతున్నారు. వీరికి తల్లిదండ్రులు లేకపోవడంతో అదే ప్రాంతానికి చెందిన వెంకటరమణ అనే మహిళ వద్ద ఉంటున్నారు. వీరికి ఆధార్ కార్డులు లేకపోవడంతో ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందడంలేదు. ఈ విషయాన్ని గుర్తించిన పెంచలయ్య, చంద్రమౌళి సమస్యను తహసీల్దారు ప్రసాద్ దృష్టి తీసుకువెళ్లి ఆధార్ కార్డులు నమోదు చేయించేందుకు వీలుగా వారికి ధృవీకరణ పత్రాలను మంజూరు చేయించి అందజేయడం జరిగిందన్నారు.

వృద్ధురాలికి అంత్యక్రియలు

గూడూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక సాయిరాం చారిటీస్ వృద్ధాశ్రమంలో ఆశ్రయం పొందుతున్న సత్యవతి(85) అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. ఈ విషయాన్ని ఆశ్రమ నిర్వాహకురాలు కల్యాణి మెగా బ్రదర్స్ సేవాసమితి సభ్యులకు తెలిపారు. సేవాసమితి సభ్యులు చంద్రశేఖర్, మోహన్, ఓంకార్, విజయ్ తదితరులు హిందూ సంప్రదాయ పద్ధతిలో వృద్ధురాకి అంత్యక్రియలు నిర్వహించారు.

ర్యాగింగ్‌పై విద్యార్థులకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ శ్రీలత

తిరుపతి(వైద్యం), నవంబరు 1(ఆంధ్రజ్యోతి): స్విమ్స్‌లో ర్యాగింగ్‌కు పాల్పడకుండా చర్యలు చేపడుతున్నామని సంస్థ డైరెక్టర్ ఆర్వీ కుమార్ అన్నారు. స్విమ్స్‌లోని పద్మావతి ఓపీడీ భవనంలో ఆయన శనివారం యాంటీ ర్యాంగింగ్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తోటి విద్యార్థుల వలన ఎటువంటి ఇబ్బందులు ఎదురైనా వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. సీనియర్ విద్యార్థులు కొత్తవారికి ఆదర్శంగా నిలవాలన్నారు. ర్యాంగింగ్‌పై డీఎస్పీ శ్రీలత విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీన్ అలోక్‌సచన్, రిజిస్ట్రార్ అపర్ణ బిట్లా, ప్రిన్సిపాల్స్ ఉషాకళావత్, మాధవి, సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

హక్కులపై అవగాహన అవసరం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 1(ఆంధ్రజ్యోతి): పద్మావతి మహిళా యూనివర్సిటీ లా విభాగం శనివారం నిర్వహించిన ప్రత్యేక ఉపన్యాసం అందరినీ ఆకట్టుకుంది. ఆంధ్రా యూనివర్సిటీ లా ప్రొఫెసర్ రాజ్యలక్ష్మి హక్కుల ప్రాముఖ్యతపై ప్రసంగించారు. హక్కులపై అవగాహన ఉన్నప్పుడే ఎవరైనా న్యాయం పొందడం, న్యాయ సహకారం అందించడం చేయగలరని అన్నారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ రాజ్యలక్ష్మిని డీన్ అనురాధ, లా హెడ్ సీతాకుమారి, అధ్యాపకులు సత్కరించారు.

భక్తిశ్రద్ధలతో నగర సంకీర్తన

తిరుపతి(కల్చరల్), నవంబరు 1(ఆంధ్రజ్యోతి): తిరుపతి మాడవీధుల్లో శనివారం భజన మండలి ఆధ్వర్యంలో నగర సంకీర్తన భక్తిశ్రద్ధలతో జరిగింది. మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ ఈ కార్యక్రమంతో భక్తిభావం సంతరించుకుంది. అనంతరం భక్తులకు ప్రసాదాలను పంపిణీ చేశారు. నగర సంకీర్తన మండలి సభ్యులు గుండాల గోపీనాథ్‌రెడ్డి, భాస్కరాచారి, చెంగారెడ్డి, గంగయ్య, మురళీ, సుబ్రహ్మణ్యం, పద్మావతి, సిద్దమ్మ, అరుణ, జయమ్మ, పార్వతి పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి



వీరాస్వామి (ఫైల్‌ఫొటో)

పెళ్లకూరు, నవంబరు, 1 (ఆంధ్ర జ్యోతి): విద్యుదాఘాతానికి గురై ఓ యువ కుడు మృతి చెందిన ఘటన పెళ్లకూరు మండలంలోని నందిమాల దళితవాడలో శనివారం ఉదయం చోటుచేసుకుంది. దళితవాడకు చెందిన గంధం వీరా స్వామి(22) ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఉన్న ఏబీ స్విచ్ ఆఫ్ చేసే క్రమంలో విద్యుదాఘా తానికి గురై అపస్మారక స్థితిలోకి వెళ్లి పోయాడు. స్థానికులు వీరాస్వామిని హుటాహుటిన నాయుడుపేటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి వీరాస్వామి మృతి చెందినట్లు నిర్ధారించారు. సమాచారం అందుకున్న పోలీసులు గ్రామానికి వెళ్లి వివరాలు సేకరించారు. 14 ఏళ్ల క్రితం వీరాస్వామి తండ్రి గున్నయ్య కూడా విద్యుదాఘాతంతోనే మృతి చెందాడు. భర్త, ఒక్కగానొక్క కుమారుడు విద్యుదాఘాతంతో మృతి చెందడంతో వీరాస్వామి తల్లి ఇంద్రమ్మ తీవ్రంగా రోదించారు.

మత్స్యకారులను ఆదుకుంటాం: టీడీపీ



మత్స్యకారులకు నిత్యావసర సరుకులను పంపిణీ చేస్తున్న ఏఎంసీ చైర్మన్ మర్రి ప్రమీల, టీడీపీ నాయకులు

కోట, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మత్స్యకారులకు అండగా నిలవడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని వాకాడు వ్యవసాయ మార్కెట్ చైర్మన్ మర్రి ప్రమీల అన్నారు. శనివారం మండల పరిధిలోని గోవిందపల్లిపాళెంలో 270 కుటుంబాల మత్స్యకారులకు ప్రభుత్వం అందించిన సరుకులను పంపిణీ చేశారు. మొంథా తుఫాన్ సమయంలో శ్రీనివాససత్రం, గోవిందపల్లిపాళెం గ్రామాల్లోని మత్స్యకారులు వారం రోజులపాటు సముద్రంలో చేపల వేటకు వెళ్లకుండా వేట విరామం ప్రకటించారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం ఒక్కొక్క కుటుంబానికి కిలో చొప్పున బంగాళా దుంపలు, యర్రగడ్డలు, 50 కిలోల బియ్యం, ఆయిల్, చక్కెర, కందిపప్పు కిలో చొప్పున సరఫరా చేసింది. ఈ సరుకులను ఏఎంసీ చైర్మన్ ప్రమీల చేతులమీదుగా ఆయా గ్రామాలకు చెందిన మత్స్యకారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు పలగాటి భాస్కర్‌రెడ్డి, మైనార్టీ జిల్లా అధ్యక్షుడు జలీల్ అహ్మద్, ఎంపీటీసీ దారా సురేష్, నాయకులు మురళి, చెంగల్‌రావు, ఎఫ్‌బీవో రెడ్యా నాయక్, డీటీ మల్లికార్జునరావు, వీఆర్వో శ్రీనివాసులు, వ్యవసాయ మార్కెట్ కమిటీ సూపర్ వైజర్లు రవి చంద్ర తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా కాళికామాత జాతర



కాళికామాత ఆలయంలో యాగం చేస్తున్న వేదపండితులు

తడ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక బోడిలింగాలపాడులో ఉన్న కాళికామాత ఆలయంలో శనివారం జాతర వేడుకగా మొదలైంది. ఆలయంలో కాళికామాతకు విశేష పూజలు, పుష్పయాగం నిర్వహించారు. గ్రామస్తులు పొంగళ్లను నైవేద్యంగా సమర్పించారు. మధ్యాహ్నం అన్నదానం జరిగింది. అర్ధరాత్రి నుంచి అమ్మణ్ణి గ్రామోత్సవం నిర్వహించేందుకు పుష్ప పల్లకిని ఏర్పాటు చేశారు. విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు పరంధామయ్య ఆచారి దంపతులు ఈ కార్యక్రమాలకు ఉభయదాతలుగా వ్యవహరించారు.

'ఇండియాదే మహిళా క్రికెట్ ప్రపంచ కప్'



జాతీయ పతాకాన్ని ప్రదర్శిస్తూ నినాదాలు చేస్తున్న మహిళా క్రికెటర్లు, అసోసియేషన్ ప్రతినిధులు

తిరుపతి(క్రీడలు), నవంబరు 1(ఆంధ్రజ్యోతి): మహిళా క్రికెట్ ప్రపంచ కప్ ఇండియాదేనని ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరి విజయ్‌కుమార్ ధీమా వ్యక్తం చేశారు. ఆదివారం జరగనున్న మహిళా ప్రపంచ కప్ ఫైనల్లో విజయం సాధించాలని కలియుగదైవం వేంకటేశ్వర స్వామిని ప్రార్థిస్తూ అలిపిరి పాదాల మండపం వద్ద ఆయన కొబ్బరికాయలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెమీస్‌లో ఆస్ట్రేలియాను మట్టికరిపించి ఫైనల్‌కు దూసుకెళ్లిన మహిళా క్రికెట్ జట్టు తుదిపోరులోనే అదే ఆటతీరును ప్రదర్శించి సౌత్‌ఆఫ్రికాపై ఘన విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తంచేశారు. ప్రపంచకప్ షెడ్యూల్స్‌లో భాగంగా విశాఖ మైదానంలో ఐదు మ్యాచ్‌లు ఆడటానికి ఏసీఏ చైర్మన్ కేశినేని శివనాథ్(చిన్ని), కార్యదర్శి సాన సతీష్‌బాబు ఎంతో కృషి చేశారన్నారు. స్పిన్ బౌలర్ శ్రీచరణి సెమీస్‌లో కీలక వికెట్లు పడగొట్టి తెలుగు సత్తా చాటిందన్నారు. అనంతరం జాతీయ జెండాను ప్రదర్శిస్తూ పాదాల మండపం నుంచి కొంతదూరం ర్యాలీ నిర్వహించారు. ఫైనల్లో భారత్ విజయం సాధిస్తుందని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షులు శ్రీనివాసమూర్తి, కార్యదర్శి సతీష్‌కుమార్ యాదవ్, హరిప్రసాద్, మహిళా క్రికెటర్లు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఫారెస్టు సర్వీస్ అసోసియేషన్ అధ్యక్షుడిగా రవినాయక్



మంగళం, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ఏపీ ఫారెస్ట్ సర్వీస్ అసోసియేషన్ అధ్యక్షుడిగా అటవీశాఖ బయోట్రీమ్ పరిపాలన అధికారి రవినాయక్ ఎన్నికయ్యారు. శనివారం తిరుపతిలోని కపిలతీర్థం వద్ద అటవీకాంప్లెక్సులో అసోసియేషన్ తిరుపతి సర్కిల్ ఎన్నిక ఏపీఎన్జీవో అధ్యక్షులు సురేష్‌బాబు, లోకనాథ్, రత్నం, తిరుమల బాబుల ఆధ్వర్యంలో జరిగింది. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా ఆనంద్, అసోసియేట్ అధ్యక్షులుగా టి.గణేష్, కోశాధికారిగా ఆర్.బాగ్యరాజ్, ఉపాధ్యక్షులుగా సునీత, సంయుక్త కార్యదర్శిగా శ్రీకాంత్, కార్యనిర్వాహక కార్యదర్శిగా రమాదేవి ఎన్నికయ్యారు.